www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 26-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 149 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: తదియ మ.1:55 తదుపరి చవితి; నక్షత్రం: హస్త పూర్తి; వర్జ్యం: మ.1:00-2:45; దుర్ముహూర్తం: ఉ.8:33-9:22, రా.10:17-11:01; అమృతఘడియలు: రా.11:30-1:15; రాహుకాలం: మ.3:00-4:30; సూర్యోదయం: 6:03; సూర్యాస్తమయం: 6:29 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త న్యాయమూర్తులు!

జస్టిస్ అలోక్ అరాధే,
జస్టిస్ విపుల్ పంచోలిలకు పదోన్నతి

కేంద్రానికి కొలీజియం సిఫారసు

జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ సుధాంశు ధులియా పదవీ విరమణతో సుప్రీంలో రెండు ఖాళీలు


జస్టిస్ అలోక్ అరాధే


జస్టిస్ విపుల్ పంచోలి ▲

2

సమాంతర సమరం!

- ఇటు పార్టీల పరంగా 42 శాతం రిజర్వేషన్లు
- అటు సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం
- ఒకేసారి చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో మేధోమథనం 13
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సింఘ్వీలతో మంతనాలు
- వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి, మంత్రుల భేటీ
- నేడు బిహార్‌కు రేవంత్, మంత్రుల బృందం


ఉస్మానియా యూనివర్సిటీలో కొత్త హాస్టల్ భవనాలను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశిం తదితరులు

ఫాంహౌస్‌లో మానవ మృగాలు

వాటిని పట్టుకొని బంధించాలి

హెచ్‌సీయూలో ఏనుగులు, సింహాలు లేవు.. ఏఐ టెక్నాలజీతో సృష్టించారు

కోదండరాంను 15 రోజుల్లో తిరిగి చట్టసభకు పంపుతాం.. ఎవరు అడ్డొస్తారో చూస్తాం

ప్రపంచంతో పోటీపడేలా ఓయూ అభివృద్ధి.. వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధం

వచ్చే ఆరు నెలల్లో 40 వేల ఉద్యోగాలు.. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాల భర్తీ లక్ష్యం

డిసెంబరులో మళ్లీ ఓయూకి వస్తా.. ఆర్ట్స్ కాలేజీ ముందు సభ పెడతా: సీఎం రేవంత్

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పలు భవనాల ప్రారంభం.. శంకుస్థాపన

అడిగినవన్నీ ఇస్తున్నా.. ఆందోళన ఏంటి?.. మనకు, ఉద్యోగులకు మధ్య దూరమేంటి?

చక్కదిద్దండి.. భట్టికి సూచించిన సీఎం.. ఉద్యోగ నేతలతో చర్చించిన ఉపముఖ్యమంత్రి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీలో ఏనుగులు, సింహాలు ఉన్నాయంటూ ఏఐ టెక్నాలజీతో వీడియో క్రియేట్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వాటిని ప్రభుత్వం చంపుతున్నట్లు ప్రచారం చేశారని మండిపడ్డారు. కానీ, తెలంగాణలో ఏనుగులు, సింహాలు లేవని, మానవ రూపంలో మృగాలు ఉన్నాయని ధ్వజమెత్తారు. అవి ఫాంహౌస్‌లో ఉన్నాయని, వాటిని పట్టుకొని బంధించాలని అన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్‌ను తమ ప్రభుత్వం ఎమ్మెల్సీని చేస్తే.. కొందరు కోర్టుకు వెళ్లి పెద్ద పెద్ద లాయర్లను పెట్టి మరీ తొలగించారని తెలిపారు. ఆయనను మళ్లీ ఎమ్మెల్సీని చేస్తామని, 15 రోజుల్లో చట్టసభకు పంపుతామని ప్రకటించారు. ఎవరు అడ్డొస్తారో చూస్తానని సవాల్ చేశారు. 'మీ ఇంట్లో అందరికీ పదవులు ఉండొచ్చు కానీ, తెలంగాణ ఉద్యమంలో పొలిటికల్ జేఏసీ చైర్మన్‌గా ఉన్న కోదండ రామ్ సార్‌కు ఒక్క పదవి ఉండొద్దా?' అని మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలో

మిగతా 13వ పేజీలో...

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పుతో నక్సల్స్‌కు..

20 ఏళ్లు ఊపిరి!



తర్వాత జరిగిన హింసకు రాహుల్ జవాబివ్వాలి

పదవీచ్యుతి బిల్లుపై విపక్షాల వైఖరి ఘోరం

రాహుల్ నైతిక ప్రమాణాలు ఎటు పోయాయి

నాడు ఆర్డినెన్స్ చించి నేడు లాలూకు మద్దతా?

మోదీ పట్టుబట్టి ప్రధానినీ బిల్లులో చేర్చారు

సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు పెట్టగానే

గుజరాత్ హోం మంత్రి పదవిని త్యజించా

నా బెయిలు దరఖాస్తు పరిష్కారానికి రెండేళ్లు

పట్టింది.. అప్పటిదాకా రాష్ట్రం వెలుపలే ఉన్నా

కేసు కొట్టేసే వరకు ఏ పదవీ తీసుకోలేదు

చివరికి కోర్టే దురుద్దేశ పూరిత కేసుగా తేల్చింది

ఏఎన్ఐ ఇంటర్వ్యూలో అమిత్‌షా

న్యూఢిల్లీ, ఆగస్టు 25: ఇండీ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఇచ్చిన ఒక తీర్పు కారణంగా కొన ఊపిరితో ఉన్న నక్సలైట్ ఉద్యమం మరో రెండు దశాబ్దాల పాటు దేశంలో మనగలిగిందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. సల్వాజుడుం వ్యవస్థను రాజ్యాంగ విరుద్ధమని, రద్దు చేయాలని ఆదేశించడం ద్వారా సుదర్శన్‌రెడ్డి గిరిజనులకు ఉన్న స్వీయరక్షణ హక్కును కాలరాశారని మండిపడ్డారు. గిరిజనులు తమను తాము కాపాడుకొనేందుకే సల్వాజుడుం ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలను నక్సల్స్ కూల్చేస్తుంటే ప్రభుత్వాలు సాయుధ బలగాలను మోహరించాయని, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఒక్క కలంపోటుతో వాళ్లను రోడ్డున పడేశారని చెప్పారు. ఆ తర్వాత భద్రతా దళాల మీద నక్సల్స్

మిగతా 2వ పేజీలో...

అమిత్ షా వ్యాఖ్యలతో న్యాయవ్యవస్థ స్వతంత్రతకు తీవ్ర విఘాతం

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పులో

ఎక్కడా నక్సలిజాన్ని సమర్థించలేదు

సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించడం

జడ్జిల మనో స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది

18 మంది మాజీ జడ్జిల ప్రకటన

2

వైద్య విద్యలో నకిలీ దందా!

ఫేక్ డాక్యుమెంట్లతో కుంభకోణం

ఎన్నారై కోటా కింద 18 వేల

ఎంబీబీఎస్, పీజీ సీట్ల భర్తీ

బెంగాల్, ఒడిశాలలో గుర్తింపు 12

ఏజెంట్లతో కాలేజీల కుమ్మక్కు

భారీ మొత్తంలో సొమ్ము దోపిడీ

బట్టబయలు చేసిన ఈడీ



కరీంనగర్‌లో ఒకే ఇంట్లో 40 ఓట్లు

వర్ధన్నపేట జనహిత పాదయాత్రలో మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్. చిత్రంలో మీనాక్షి, కొండా సురేఖ

నిజామాబాద్‌లో ఓటర్లుగా మహారాష్ట్ర వాసులు

ఎంత మందికి 2 ఓట్లు ఉన్నాయో లెక్కే లేదు

8 మంది బీజేపీ ఎంపీల గెలుపుపై సందేహాలు

రాహుల్ పాదయాత్రకు బిహార్‌లో బ్రహ్మరథం

బీసీలపై కిషన్‌రెడ్డికి ఎందుకంత కక్ష?

కేటీఆర్, కవిత ఆస్తుల గొడవ పదేళ్లైనా తెగదు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వంద సీట్లు పక్కా

జనహిత పాదయాత్రలో మహేశ్‌గౌడ్

వరంగల్/కరీంనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్‌లోని ఓ సేటు ఇంట్లో 40 ఓట్లు ఉన్నాయని, ఈ అంశంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ పట్టణంలో మహారాష్ట్ర వాసులకు ఓట్లు ఉన్నాయని, ఎంత మందికి రెండు ఓట్లు ఉన్నాయో లెక్కే లేదని

మిగతా 12వ పేజీలో...

నిషేధిత భూముల జాబితా పరిష్కారానికి

త్రిసభ్య కమిటీ!

- సీసీఎల్ఏ, రిటైర్డ్ జడ్జి, మరో అధికారి సభ్యులు
- కమిటీ నిర్ణయంపై అప్పీలు చేసుకోవచ్చు
- హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం
- కలెక్టర్లు నిషేధిత జాబితా భూముల్ని గుర్తించాలి
- వాటి వివరాలు సబ్ రిజిస్ట్రార్లకు పంపాలి: హైకోర్టు



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చట్టంలోని నిషేధిత భూముల జాబితా(సెక్షన్ 22ఏ)తో ముడిపడి ఉన్న వేల వివాదాల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు నివేదించింది. ముగ్గురు అధికారులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రెండు రోజుల క్రితం జీవో 98 జారీ చేసినట్లు వెల్లడించింది. కమిటీలో రెవెన్యూ

మిగతా 3వ పేజీలో...

అనుమతి లేని కేబుళ్లు తొలగించవచ్చు: హైకోర్టు 3



పెంచిన తల్లిదండ్రులకే ఆ పిల్లల్ని ఇవ్వండి

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

గతంలో ఇచ్చిన ఆదేశాలు పాటించకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం

కోర్టు ధిక్కరణకు పాల్పడ్డ అధికార్లు 2న వర్చువల్‌గా హాజరు కావాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆ పిల్లలకు ఊరట! వారిని పెంచిన తల్లిదండ్రులకూ ఊరట!! ఇంకా కన్ను తెరవని పిల్లలను దత్తత తీసుకుని, పెంచిన తల్లిదండ్రులకే ఆ పిల్లలను తిరిగి ఇచ్చెయ్యాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు మరోసారి ఆదేశించింది. మంగళవారం (ఆగస్టు 26) ఉదయం 11 గంటలలోపే ఆ చిన్నారులను వారికి అప్పగించాలని

మిగతా 14వ పేజీలో...

నిందితుడు నిర్దోషిగా విడుదలైతే.. బాధితులు, వారి వారసులూ తీర్పును సవాల్ చేయొచ్చు: సుప్రీం 2


నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

ఏపీ డిప్యూటీ తహసీల్దార్ డ్రగ్స్ దందా!

కొండాపూర్‌లో డ్రగ్స్‌తో నిర్వహిస్తున్న

రేవ్‌పార్టీపై ఈగల్, గచ్చిబౌలి పోలీసుల దాడి

ఆరుగురి అరెస్టు.. ప్రధాన నిందితుడికి డ్రగ్స్

అలవాటు చేసింది డిప్యూటీ తహసీల్దారే

అతడిని విచారిస్తే వెలుగులోకి మరిన్ని

వివరాలు.. పోలీసుల వెల్లడి 14

20 గ్రాముల కొకైన్, 3 గ్రా. ఎండీఎంఏ సీజ్

గ్లుటాక్స్ ఇంజక్షన్‌ల మాటున డ్రగ్స్ సరఫరా

మల్నాడు డ్రగ్స్ కేసుతో నిందితులకు లింకు?

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పవిత్ర

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్

జడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్రం టీచరు

సాంకేతికతను మేళవించి బోధన 10

దేశవ్యాప్తంగా 45 మందికి అవార్డులు


ఎమ్మెల్యే కృష్ణ సాహా; ఎమ్మెల్యేను దొరకబుచ్చుకున్న ఈడీ అధికారి

ఈడీని చూసి ఎమ్మెల్యే పరార్

బెంగాల్‌లో ఘటన.. ఇంటిపైనుంచి దూకిన టీఎంసీ ఎమ్మెల్యే

ఆ తర్వాత ఎత్తైన ప్రహరీ పైనుంచి దూకి పారిపోయే ప్రయత్నం

వెంబడించి పట్టుకున్న అధికారులు.. ఆధారాలు దొరక్కుండా

ఫోన్‌ను మురికి కాల్వలోకి విసిరిన ఎమ్మెల్యే కృష్ణ సాహా

కోల్‌కతా, ఆగస్టు 25: ఈడీ అధికారులు తన ఇంట్లో సోదాలు చేయడానికి వస్తున్నారని తెలిసి పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ ఎమ్మెల్యే ఒకరు తన ఇంటి మొదటి అంతస్తు నుంచి దూకి పారిపోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇంటి చుట్టూ ఉన్న ఎత్తైన ప్రహరీని కూడా ఎక్కి, దూకేశారు. ఆయన్ను చూసి అధికారులు వెంబడించగా, ఆధారాలు దొరక్కుండా తన ఫోన్‌ను దూరంగా డ్రైనేజీలోకి

మిగతా 2వ పేజీలో...

శ్రీశైలానికి 6 అలైన్‌మెంట్లు!

మన్ననూర్ నుంచి పాతాళగంగ వరకు 54 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం

రిజర్వ్ ఫారెస్ట్‌లో ఎలివేటెడ్ కారిడార్‌కు పలు రకాల ప్రతిపాదనలు

మార్గంలో ఒక టోల్‌ప్లాజా.. రెండు బైపాస్‌లు.. కేంద్రానికి నివేదిక

వచ్చే నెల తొలి వారంలో భేటీ.. ఎలివేటెడ్ కారిడార్‌వైపే సర్కారు చూపు



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు రిజర్వ్ ఫారెస్ట్‌లో నిర్మించతలపెట్టిన మార్గం అలైన్‌మెంట్లు సిద్ధమయ్యాయి. తెలంగాణ నుంచి ఏపీలోని శ్రీశైలానికి చేరుకోవడానికి ప్రస్తుతం ఉన్న ఇబ్బందులను తొలగిస్తూ.. ఎలివేటెడ్ కారిడార్ నిర్మించతలపెట్టిన సంగతి తెలిసిందే. ఈ మార్గానికి సంబంధించి 6 రకాల అలైన్‌మెంట్లతో కూడిన ప్రతిపాదనలు తాజాగా కేంద్రానికి చేరాయి. వీటిపై ఇప్పటికే ఒక సమావేశం జరగ్గా సెప్టెంబరు మొదటివారంలో కీలక భేటీ జరగనుంది. కేంద్రానికి అందించిన నివేదికలో రహదారి స్వరూపంతో

మిగతా 12వ పేజీలో...


గుజరాత్‌లో ఓ సభలో ప్రసంగిస్తున్న మోదీ

ఒత్తిడి పెరిగినా భరిస్తాం

రైతులు, పశు పోషకులు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలపై రాజీ పడం

అమెరికా 50% సుంకాల అమలుపై ప్రధాని నరేంద్ర మోదీ

అహ్మదాబాద్, ఆగస్టు 25: 'మనపై ఒత్తిడి పెరుగొచ్చు. కానీ, మనం దాన్ని భరిద్దాం' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి భారత్ వస్తువులపై అమెరికా 50% సుంకాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని మోదీ సోమవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పలు పథకాలను ప్రారంభించి.. రోడ్‌షో నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రైతులు, పశు పోషకులు, చిన్న పారిశ్రామికవేత్తల ప్రయోజనాల విషయమై రాజీ పడే ప్రసక్తే లేదని

మిగతా 2వ పేజీలో...

మోదీ బీఏ వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదు!

స్మృతీ ఇరానీ విద్యాభ్యాసం విషయంలో కూడా అంతే..

దీంట్లో ప్రజాప్రయోజనం ఏమీ లేదు: ఢిల్లీ హైకోర్టు

మోదీ డిగ్రీపై మాడభూషి ఆదేశాల్ని కొట్టివేసిన బెంచ్

రోజుకు 16 గంటల ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో..

హృద్రోగాల ముప్పు 135% ఎక్కువ

» తాజా అధ్యయనంలో వెల్లడి




ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ (ఐఎఫ్).. రోజులో 12 గంటల నుంచి 16 గంటలపాటు ఏమీ తినకుండా ఉండడం. ఏది తిన్నా మిగతా 8-12 గంటల సమయంలోపే తినడం. ఇటీవలికాలంలో చాలా మంది బరువు తగ్గడానికి అనుసరిస్తున్న పద్ధతి ఇది. ఈ పద్ధతిని అనుసరించేవారు సాయంత్రం 6 గంటల నుంచి మర్నాడు ఉదయం అల్పాహార సమయం దాకా ఏమీ తినరు. కానీ.. ఇలా 16 గంటలపాటు ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేసేవారు హృద్రోగంతో మరణించే ముప్పు.. 12-14 గంటల ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేసేవారితో పోలిస్తే 135% ఎక్కువని తాజా అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనంలో భాగంగా.. అమెరికా జాతీయ ఆరోగ్య, పోషకాల పరిశీలన సర్వే (ఎన్‌హేన్స్) నుంచి సేకరించిన 19 వేల మంది వ్యక్తుల డేటాను పరిశోధకులు నిశితంగా పరిశీలించారు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేసినవారిలో ఎంత మంది క్యాన్సర్‌తో చనిపోయారు? ఇతరత్రా కారణాలతో ఎందరు మరణించారు? అనే విషయాలను పరిశీలించి.. తక్కువ సమయం ఐఎఫ్ చేసినవారితో పోలిస్తే రోజులో ఎక్కువ సమయం ఏమీ తినకుండా ఉండేవారు హృద్రోగాల బారిన ఎక్కువగా పడినట్టు గుర్తించారు. కాబట్టి ఈ విధానాన్ని దీర్ఘకాలం అనుసరించేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ సొంతంగా చేయకుండా.. వైద్యులను సంప్రదించి, వారి సలహాలు సూచనలను అనుసరించాలని పేర్కొన్నారు. గతంలో అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చేసిన ఒక అధ్యయనంలో కూడా.. ఇలా రోజులో ఎక్కువ గంటలపాటు ఉపవాసం ఉండేవారు హృద్రోగాల బారిన పడే ముప్పు 91% ఎక్కువని తేలినట్టు బెంగళూరుకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ రంజన్ శెట్టి తెలిపారు. రోజులో కేవలం 8 గంటలపాటు మాత్రమే తినడం.. అరిత్మియా (హృదయ స్పందనలు సరిగా లేకపోవడం) వంటి సమస్యలతో బాధపడేవారికి మంచిది కాదని, 16 గంటలపాటు ఉపవాసం ఉండడం వల్ల వారి రక్తంలో చక్కెరస్థాయిలు తగ్గి, గుండె దడ, హృదయస్పందన రేటు పెరగడం వంటి సమస్యలు వస్తాయని.. గుండెపోటు బారిన పడే ముప్పు ఉందని ఆయన హెచ్చరించారు. "16 గంటలపాటు ఏమీ తినకుండా.. ఆ సమయంలో రోజువారీ పనులు చేసుకోవాలని భావిస్తే.. రక్తసరఫరా చేయడానికి గుండె ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది" అని ఆయన వివరించారు. వృద్ధులు, చిన్నపిల్లలు,మధుమేహ బాధితులు,మూత్రపిండాలు, కాలేయం, గుండె జబ్బులున్నవారు ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేయకూడదని సూచించారు. ఒకవేళ అలాంటివారు ఐఎఫ్ చేయాలన్నా.. వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు.

లోకం తీరు



జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పుతో నక్సల్స్‌కు..

20 ఏళ్లు ఊపిరి!



(మొదటిపేజీ తరువాయి)

పెద్దఎత్తున దాడులు చేశారన్నారు. ఈ తీర్పునకు సంబంధించి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కన్నా రాహుల్ గాంధీ ఎక్కువ సమాధానం చెప్పాల్సి ఉంటుందని అన్నారు. ఇండీ కూటమి సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేయడంలో వామపక్ష భావజాలమే ప్రాతిపదికగా తీసుకున్నారని అమిత్‌షా ఆరోపించారు. సోమవారం ఆయన ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వామపక్ష సిద్ధాంత సానుభూతిపరుడైన సుదర్శన్‌రెడ్డిని ఎందుకు ఎంపిక చేశారో రాహుల్ గాంధీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జైల్లోంచి దేశాన్ని నడిపిస్తామంటే ఎలా?

క్రిమినల్ కేసుల్లో జైలుపాలైన మంత్రులను పదవుల నుంచి తొలగించే మూడు బిల్లుల విషయంలో విపక్షాల వైఖరిపై అమిత్‌షా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జైలు పాలైన నేత ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాలన నడవదన్న విపక్షాల ఆలోచనను బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ప్రకటించారు. "పీఎం, సీఎం లేదా మరో నేత జైలు నుంచి దేశాన్ని నడిపిస్తానంటే ఎలా" అని ప్రశ్నించారు. ఈ మూడు బిల్లులను నెగ్గించుకొనే సంఖ్యాబలం ఉందో లేదో సభలోనే తేలుతుందన్నారు. మోదీ స్వయంగా తన పదవిని కూడా రాజ్యాంగ సవరణలో చేర్చాలని పట్టుబట్టి చేర్పించుకున్నారని చెప్పారు. 1975లో ఇందిర 39వ రాజ్యాంగ సవరణ ద్వారా తనను రక్షించుకోవడం కోసం ప్రధాని ఎన్నికను న్యాయ సమీక్ష పరిధి నుంచి తప్పించారని అమిత్‌షా ప్రస్తావించారు. ఇద్దరి మధ్య తేడాను గుర్తించాలన్నారు. యూపీఏ హయాంలో శిక్షపడ్డ ఎంపీలను కాపాడే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొస్తే రాహుల్‌గాంధీ చించి పారేశారని అమిత్‌షా గుర్తు చేశారు. అదే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌కు శిక్ష పడ్డా ఆయనకు అండగా నిలుస్తోందని చెప్పారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ వరుసగా మూడు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన నైతిక ప్రమాణాల్లో రాజీ పడ్డారని ఎద్దేవా చేశారు.

కోర్టులు కళ్లు మూసుకొని కూర్చోవు

సుప్రీంకోర్టు, హైకోర్టులు కళ్లు మూసుకొని కూర్చోలేదని, ఒక సీఎంపై తప్పుడు కేసు పెడితే కోర్టులు బెయిలిస్తాయని చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఎక్కువ మంది సీఎంలు, ప్రధాని ఎన్డీయే వారేనని గుర్తు చేశారు. ఎన్డీయే సీఎంలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులే పెట్టడం లేదని చేస్తున్న వాదనను కొట్టిపారేశారు. వారు అవినీతిపరులైతే విపక్షాలు కోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు వేసి కేసు నమోదుకు ఆదేశాలు తెచ్చుకోవచ్చన్నారు. గతంలో చాలామంది సీఎంలు జైలుకు వెళ్లారని, వాళ్లు నైతిక బాధ్యత వహించి రాజీనామాలు చేశారని, ఇప్పుడు అలా చేయకపోవడం వల్లే ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి వస్తోందని అన్నారు.

రెండేళ్లు రాష్ట్రానికి దూరంగా ఉన్నా

సొహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసు విచారణను తాను ప్రభావితం చేస్తానేమోనని కేసును విచారిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ అఫ్తాబ్ ఆలం సందేహం వెలిబుచ్చిన నేపథ్యంలో తానే విచారణ పూర్తయ్యే వరకు రాష్ట్రం విడిచి వెళతానని ప్రతిపాదించానని అమిత్‌షా వెల్లడించారు. రెండేళ్లు రాష్ట్రం వెలుపల ఉండటం తన స్వీయ నిర్ణయమని చెప్పారు. సాధారణంగా ఒక బెయిలు అప్లికేషన్‌ను 11 రోజుల్లో పరిష్కరిస్తారని, తన బెయిలు దరఖాస్తును పరిష్కరించడానికి రెండేళ్ల సమయం తీసుకున్నారని, అన్ని రోజులు తాను రాష్ట్రం వెలుపల ఉండాల్సి వచ్చిందని చెప్పారు. తనపై సీబీఐ కేసు నమోదు చేయగానే మంత్రి పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. కేసు పూర్తిగా కొట్టేసే వరకు ఎలాంటి పదవులు చేపట్టలేదన్నారు. చివరికి ఈ కేసు రాజకీయ ప్రతీకారంతో పెట్టిందేనని న్యాయస్థానం స్వయంగా తేల్చిందని ప్రస్తావించారు.

అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ సుదర్శన్ రెడ్డికి వ్యతిరేకంగా అమిత్ షా వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన 18 మంది మాజీ న్యాయమూర్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరమని వారు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తీర్పులో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎక్కడా నక్సలిజాన్ని, దాని సిద్ధాంతాలను సమర్థించలేదని.. ఆ తీర్పు సారాంశంలో ఎక్కడా అలాంటి ఉద్దేశం లేదని వారు స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి పదవికి జరిగే ప్రచారం మర్యాదగా, హుందాగా ఉండాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేశంలో ఉన్నత స్థానంలో ఉన్న ఒక వ్యక్తి దురుద్దేశంతో వక్రీకరించడం న్యాయవ్యవస్థ స్వతంత్రతను కుదిపివేస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ ప్రకటనపై ఏడుగురు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ఏకే పట్నాయక్, జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ గోపాల గౌడ, జస్టిస్ విక్రంజిత్ సేన్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ జె.చలమేశ్వర్.. ముగ్గురు హైకోర్టు మాజీ సీజేలు గోవింద్ మాథుర్, బి.మురళీధర్, సంజీబ్ బెనర్జీ, 8 మంది హైకోర్టు మాజీ న్యాయమూర్తులు సి.ప్రవీణ్ కుమార్, ఎ.గోపాల్ రెడ్డి, జి.రఘురామ్, కె.కన్నన్, కె.చంద్రు, బి.చంద్ర కుమార్, కైలాష్ గంభీర్ సంతకం చేశారు.

తప్పుడు కేసులు పెట్టిన మంత్రికి

ఎన్నేళ్లు జైలు శిక్ష విధించాలి?

» అమిత్ షాకు కేజ్రీవాల్ కౌంటర్



న్యూఢిల్లీ, ఆగస్టు 25: అవినీతిపరులను పార్టీలో చేర్చుకొని, పదవులు కట్టబెట్టే నేతలు కూడా వారి పదవులకు రాజీనామా చేయాలని ఆప్ అధినేత కేజ్రీవాల్ అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్యాలయం సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టుకు సోమవారం ఆయన ఈ మేరకు ఘాటుగా స్పందించారు. 30 రోజులు అంతకంటే ఎక్కువ కాలం జైల్లో ఉన్న వారు పీఎం, సీఎం, మంత్రుల పోస్టుల్లో కొనసాగకుండా నిషేధం విధించాలన్న బిల్లులపై అమిత్ షా స్పందిస్తూ.. అవినీతి, క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారు ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులుగా జైలు నుంచి పాలన కొనసాగిస్తారా? అని ప్రశ్నించారు. ఈ పోస్టుపై కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. "తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని పార్టీలో చేర్చుకొని, వారిపై కేసులన్నీ ఎత్తివేయించి, మంత్రులుగా, ఉప ముఖ్యమంత్రులు/ముఖ్యమంత్రులుగా చేస్తున్నారు. అలాంటి మంత్రి లేదా ప్రధాన మంత్రి కూడా తమ పదవులకు రాజీనామా చేయాలి కదా? ఎవరినైనా తప్పుడు ఆరోపణలతో జైలుకు పంపించిన తర్వాత వారు అమాయకులని తేలితే ఎలా? తప్పుడు కేసు పెట్టిన మంత్రికి ఎన్నేళ్లు శిక్ష విధించాలి?" అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. "రాజకీయ కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నన్ను తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుకు పంపింది. అక్కడి నుంచే నేను 160 రోజుల పాటు ప్రభుత్వాన్ని నడిపా" అని చెప్పారు. అలాంటి సమయంలో కూడా తాను ఢిల్లీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూశానన్నారు.

నిందితుడు నిర్దోషిగా విడుదలైతే బాధితులు, వారి వారసులు సవాల్ చేయొచ్చు

» బాధితుల హక్కును పరిమితం చేయలేం: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 25: నిందితుడు నిర్దోషిగా విడుదలైనప్పుడు.. బాధితులు, వారి చట్టబద్ధ వారసులు కూడా సవాల్ చేయవచ్చని సుప్రీం కోర్టు ఓ కేసు తీర్పు సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితుడి హక్కును దోషిగా నిర్ధారించిన నిందితుడి హక్కుతో సమానంగా ఉంచాలంటూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథ్ ధర్మాసనం పేర్కొంది. "నిందితుడికి తక్కువ శిక్ష పడ్డప్పుడు, బాధితుడికి తగినంత నష్ట పరిహారం ఇవ్వాల్సిందిగా కోర్టు ఆదేశించకపోయినా, నిందితుణ్ని నిర్దోషిగా విడిచిపెట్టినా.. ఆ తీర్పుపై అప్పీల్ చేయడానికి సీఆర్‌పీసీ సెక్షన్ 372 నిబంధనల ప్రకారం బాధితుడికి హక్కు ఉంది" అని వెల్లడించింది. బాధితుల హక్కును పరిమితం చేయలేమని స్పష్టం చేసింది. అలాగే అప్పీల్ పెండింగ్‌లో ఉన్న సమయంలో బాధితుడు మరణిస్తే వారి చట్టబద్ధ వారసులు కూడా కేసును కొనసాగించవచ్చని తెలిపింది. క్రిమినల్ కేసులో దోషిగా తేలిన వ్యక్తి ఎలాంటి షరతులూ లేకుండా అప్పీలు చేసుకోవడానికి సీఆర్‌పీసీ సెక్షన్ 374 ప్రకారం ఎలా హక్కు ఉందో.. బాధితులకు కూడా అప్పీలు చేసుకునే హక్కు ఉండాలని పేర్కొంది. బాధితులు ఫిర్యాదుదారా కాదా అనే దాంతో సంబంధం లేకుండా.. అప్పీలు చేసుకోవడానికి 2009లో సీఆర్‌పీసీ సెక్షన్ 372లో ఓ నిబంధనను జోడించారని గుర్తు చేసింది.

ఆర్టికల్ 32 కింద మరణశిక్షనూ సవాల్ చేయొచ్చు..

మరణశిక్ష విధించిన కేసుల్లో నిందితులకు సంబంధించి విధానపర రక్షణ ప్రమాణాలను ఉల్లంఘించినట్లు తేలితే రాజ్యాంగంలోని అధికరణం 32 ప్రకారం తిరిగి కేసు తెరవవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. మరణశిక్ష పడిన దోషి సైతం ప్రాథమిక హక్కులను కోల్పోకూడదని స్పష్టం చేసింది. మరణశిక్ష పడిన ఓ దోషి పిటిషన్‌ను విచారించేందుకు ధర్మాసనం అంగీకరించింది. 2008లో నాగ్‌పూర్‌కు చెందిన వసంత్ నాలుగేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడ్డాడు. అతడికి మరణశిక్ష పడటంతో పలుమార్లు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తాజాగా అతడికి ఊరట దక్కింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ పంచోలి!

న్యూఢిల్లీ, ఆగస్టు 25: బాంబే హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, పట్నా హైకోర్టు సీజే జస్టిస్ విపుల్ పంచోలిలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతులు కల్పించాలని కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ బీవీ నాగరత్న కొలీజియం సోమవారం మధ్యాహ్నం సమావేశమై చర్చించి ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ సుధాంశు ధులియా పదవీ విరమణ పొందడంతో 34 మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవుల్లో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. కొలీజియం సిఫారసులను కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే.. రాష్ట్రపతి ఉత్తర్వులతో వారు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులవుతారు.

యూపీఎస్ నుంచి ఎన్‌పీఎస్‌కు మరో చాన్స్

న్యూఢిల్లీ: కొత్తగా ప్రవేశ పెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)లో చేరిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వీరు ఈ పథకం నుంచి నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లోకి మారేందుకు అవకాశం కల్పించింది. అయితే ఇలా మారే అవకాశం ఒకసారికి మాత్రమే పరిమితమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఎన్‌పీఎస్‌లోని ఉద్యోగులు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి యూపీఎస్‌కు మారేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెలాఖరు వరకు ఈ ఆప్షన్ ఉంటుంది. గత నెల 20 నాటికి దాదాపు 31,555 మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్‌పీఎస్ నుంచి యూపీఎస్‌కు మారారు. కావాలనుకుంటే వీరు మళ్లీ ఎన్‌పీఎస్‌కు మారవచ్చని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఉద్యోగార్థులకు వ్యక్తిగత ఇంటర్వ్యూ తప్పనిసరి

» ఆన్‌లైన్ ఇంటర్వ్యూల్లో ఏఐ దుర్వినియోగం : పిచాయ్

న్యూఢిల్లీ, ఆగస్టు 25: ఐటీ, టెక్నాలజీ సంస్థలు నిర్వహిస్తున్న ఉద్యోగ నియామక ప్రక్రియలో అభ్యర్థులు ఏఐ టూల్స్ వాడుతున్నారన్న అనుమానాల మధ్య గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్.. ఉద్యోగార్థులకు ఒక రౌండ్ వ్యక్తిగత ఇంటర్వ్యూ తప్పనిసరని తెలిపారు. ఆన్‌లైన్ ఇంటర్వ్యూల్లో ఏఐ దుర్వినియోగం అవుతోందని అభిప్రాయపడ్డారు. కాగా, పలు దిగ్గజ సంస్థలు, టెక్ నియామక ఏజెన్సీలు కూడా 50 శాతానికి పైగా ఉద్యోగార్థులు ఆన్‌లైన్ ఇంటర్వ్యూల్లో అనధికారిక టూల్స్ వాడుతున్నారని అనుమానిస్తున్నాయి. అప్లికేషన్ల ప్రక్రియలో ఏఐ టూల్స్ వాడకంపై ఆంత్రోపిక్ నిషేధం విధించగా, సిస్కో, మెకెన్సీ, డెలాయిట్ ముఖాముఖీ ఇంటర్వ్యూలతో నియామక ప్రక్రియ చేపట్టాయి.

అమెరికాలో భారత్ రెండో 'లాబీయింగ్' సంస్థ

వాషింగ్టన్, ఆగస్టు 25: మరి కొద్ది రోజుల్లో భారత వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50% సుంకాలు అమలుకానున్న వేళ భారత్ ఆ దేశంలో రెండో లాబీయింగ్ సంస్థను నియమించింది. మాజీ సెనెటర్ డేవిడ్ విటర్‌కు చెందిన లాబీయింగ్ సంస్థ మెర్క్యురీ పబ్లిక్ ఎఫయిర్స్‌ని భారత్ నూతనంగా నియమించినట్లు ఒక అమెరికన్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ సంస్థకు ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌తో దగ్గరి సంబంధాలు ఉన్నాయి. భారత్ ఇప్పటికే అమెరికాలో ఎస్‌హెచ్‌డబ్ల్యూ పార్ట్‌నర్స్ ఎల్ఎల్‌సీ లాబీయింగ్ సంస్థను 1.8 మిలియన్ డాలర్లకు నియమించింది. మరోవైపు మెర్క్యురీకి నెలకు 75,000 డాలర్ల చొప్పున మూడు నెలలకు చెల్లించనున్నట్లు సమాచారం. దీంతో మెర్క్యురీ భాగస్వామి, ట్రంప్‌నకు కమ్యూనికేషన్ డైరెక్టర్‌గా పని చేసిన బ్రియన్ లాంజా భారత్ కోసం పనిచేయనున్నట్లు సమాచారం. ట్రంప్ అధికారంలోకి వచ్చాక దాదాపు 30 దేశాలు తమ లాబీయింగ్ సంస్థలను అమెరికాలో ఏర్పాటు చేసుకున్నాయి.

ఇజ్రాయెల్ దాడుల్లో ఆరుగురు జర్నలిస్టులు మృతి

» విచారం వ్యక్తం చేసిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

గాజా, టెల్ అవీవ్, ఆగస్టు 25: ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఆరుగురు జర్నలిస్టులు మృతిచెందారు. గాజాలోని నాసెర్ మెడికల్ కాంప్లెక్స్ ఆసుపత్రిపై జరిపిన దాడుల్లో ఐదుగురు జర్నలిస్టులు, ఖాన్‌యూనిస్‌లో జరిపిన దాడిలో మరో జర్నలిస్టు మృతిచెందారు. మృతుల్లో అల్ జజీరాకు చెందిన మొహమ్మద్ సలామా, రాయిటర్స్‌కు చెందిన హుస్సామ్ అల్ మస్రీ, ఖుద్స్ ఫీడ్ నెట్‌వర్క్‌కు చెందిన అహ్మద్ అబు అజీజ్, అసోసియేటెడ్ ప్రెస్‌కు చెందిన మరియం డఖ్భా, గాజా ప్రభుత్వ మీడియాకు పనిచేస్తున్న మోయిజ్ అబూ తాహా, అల్ హయత్ అల్ జదియాకు చెందిన హస్సాన్ దౌహాన్ ఉన్నారు. వాస్తవానికి నాసెర్ ఆసుపత్రిపై జరిపిన దాడిలో మొత్తం 21 మంది చనిపోయారు. వీరిలో ఐదుగురు జర్నలిస్టులే. ఇజ్రాయెల్ దాడిని ఐక్యరాజ్యసమితితో పాటు పలు మీడియా సంస్థలు ఖండించాయి. ఈ నెల 10న ఇజ్రాయెల్ జరిపిన దాడిలో నలుగురు అల్‌జజీరా జర్నలిస్టులు మృతిచెందారు. కాగా, ఇజ్రాయెల్ బలగాల దాడిలో జర్నలిస్టుల మృతిపై ప్రధాని నెతన్యాహు విచారం వ్యక్తం చేశారు.

ఒత్తిడిని భరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ఎవరి పేర్లు ప్రస్తావించకుండానే ఆర్థిక ప్రయోజనాల చుట్టూ ప్రపంచ రాజకీయాలు తిరుగుతున్నాయన్నారు. రక్షణ, శక్తికి మారుపేరుగా నిలిచిన 'సుదర్శన చక్రధారి శ్రీకృష్ణుడు.. జాతీయోద్యమంలో రాట్నంపై నూలు వడికి స్వదేశీ దుస్తులు వాడాలన్న మహాత్మాగాంధీ బాటలో భారత్ సాధికారత సాధించిందని మోదీ చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో సైనికుల ధైర్యం, గాంధీజీ మార్గం ప్రతిబింబించిందని ఆయన తెలిపారు. కానీ, 60-65 ఏళ్ల పాలించిన కాంగ్రెస్ పార్టీ.. దిగుమతి కుంభకోణాలకు పాల్పడేందుకు విదేశాలపై దేశం ఆధార పడేలా చేసిందన్నారు. గాంధీజీ బోధించిన ముఖ్య సూత్రాలను కాంగ్రెస్ పార్టీ గాలికొదిలేసిందని, ఆత్మను చిదిమేసి దశాబ్దాలుగా అధికారంలోకి రావడానికి ఆయన పేరును వాడుకుంటుందని మోదీ ధ్వజమెత్తారు. ఇదిలా ఉండగా, భారత్, పసిఫిక్ ద్వీప దేశం ఫిజీ మధ్య ఏడు అంశాలపై ఒప్పందాలు కుదిరాయి. మూడు రోజుల పర్యటనకుగాను ఫిజీ ప్రధాని సితివేని రబూకా ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్నారు.

ఈడీని చూసి ఎమ్మెల్యే పరార్

(మొదటిపేజీ తరువాయి)

విసిరిగొట్టారు. కానీ, అధికారులు ఆయన్ను పట్టుకొని అరెస్టు చేశారు. ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్‌లో ఉపాధ్యాయ నియామకాల్లో జరిగిన అక్రమాలపై ఈడీ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సోమవారం ముర్షిదాబాద్ జిల్లాలోని బుర్వాన్ ఎమ్మెల్యే జిబాన్ కృష్ణ సాహా, ఆయన బంధువుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించడానికి ఈడీ అధికారులు వెళ్లారు. వారిని చూసిన సాహా పారిపోవడానికి విఫల యత్నం చేశారు. ఇదే వ్యవహారంలో సాహాను 2023 ఏప్రిల్‌లో సీబీఐ అరెస్టు చేసింది. అప్పుడు కూడా ఆయన ఇదే విధంగా ప్రవర్తించారు. తన ఫోన్లను ఓ చెరువులోకి విసిరిగొట్టారు. వాటిని గుర్తించి స్వాధీనం చేసుకోవడానికి అధికారులకు మూడు రోజులు పట్టింది. సీబీఐ కేసులో సాహా ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు.

ప్రియురాలి నోట్లో జిలెటిన్ స్టిక్ పేల్చివేత

బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తితో లాడ్జికి వెళ్లిన మహిళ దారుణ హత్యకు గురైంది. నమ్మించి తీసుకెళ్లిన వ్యక్తే ఆమె నోట్లో జిలెటిన్ స్టిక్ పెట్టి పేల్చి చంపేశాడు. మైసూరు జిల్లా భేర్య గ్రామంలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. హత్యకు గురైన మహిళను గరసనహళ్లి గ్రామానికి చెందిన రక్షిత(20)గా పోలీసులు గుర్తించారు. ఆమె ప్రియుడు సిద్దరాజును అదుపులోకి తీసుకున్నారు. రక్షితకు కేరళకు చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. మైసూరు ప్రాంతానికి చెందిన సిద్దరాజు అనే యువకుడితో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. కప్పడి ఆలయానికి వెళదామని సిద్దరాజు పిలవడంతో రక్షిత వెంట వెళ్లింది. ఆమెను సిద్దరాజు లాడ్జికి తీసుకెళ్లాడు. పథకం ప్రకారం వెంట తీసుకెళ్లిన జిలెటిన్ స్టిక్‌ను ఆమె నోట్లో పెట్టి పేల్చాడు. పేలుడులో తనూ గాయపడ్డాడు.

ప్రధాని మోదీ డిగ్రీ వెల్లడిలో

ప్రజా ప్రయోజనం ఏమీ లేదు!

» దాన్ని వెల్లడించాల్సిన అవసరం లేదు

» స్మృతి ఇరానీ విషయంలో కూడా అంతే

» మోదీ డిగ్రీపై మాడభూషి ఆదేశాల్ని కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం



న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రధాని మోదీ, కేంద్ర మాజీ మంత్రి స్మృతీ ఇరానీల విద్యాభ్యాసం వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. దాంట్లో ప్రజాప్రయోజనం ఏమీ లేదని పేర్కొంది. ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను కోరుతూ నీరజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన దరఖాస్తుపై కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ).. 2016లో ఢిల్లీ వర్సిటీకి ఆదేశాలు జారీ చేస్తూ సదరు వివరాలు వెల్లడించాలని పేర్కొంది. 1978 బ్యాచ్‌లో వర్సిటీలో బీఏ పాసైన (అదే ఏడాది మోదీ బీఏ పూర్తి చేశారని సమాచారం) వారి వివరాలను దరఖాస్తుదారు పరిశీలించే అవకాశం కల్పించాలని తెలిపింది. ఈ ఆదేశాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీ హైకోర్టులో ఢిల్లీ వర్సిటీ పిటిషన్ వేయగా.. కోర్టు 2017లో స్టే విధించింది. తర్వాతకాలంలో ఈ అంశంపై హైకోర్టులో విచారణ కొనసాగింది. ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన తీర్పును రిజర్వు చేసిన జస్టిస్ సచిన్‌దత్తా సోమవారం వెలువరించారు. పాలనలో పారదర్శకత కోసం ఆర్టీఐ చట్టాన్ని తీసుకొచ్చారుగానీ సంచలనాలకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వటం కోసం కాదన్నారు.

పదవులకు కనీస విద్యార్హతలు ఏమీ లేవు

ప్రధాని, మంత్రి వంటి ప్రభుత్వ పదవులు నిర్వహించేవారికి ఎటువంటి విద్యార్హతలను రాజ్యాంగం నిర్దేశించలేదని, కాబట్టి, వారి విద్యార్హతల సమాచారం వెల్లడించాల్సిన అవసరం లేదని జస్టిస్ సచిన్ దత్తా తెలిపారు. ఒక వ్యక్తికి సంబంధించిన మార్కుల మెమో, ఫలితాలు, డిగ్రీ, సర్టిఫికెట్ వంటివి వ్యక్తిగత సమాచారమని, అది ఆర్టీఐ పరిధిలోకి రాదని.. ప్రభుత్వ పదవుల్లో ఉన్న వారికైనా ఇదే వర్తిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర మాజీమంత్రి స్మృతీ ఇరానీ చదివిన 10, 12వ తరగతుల ఫలితాలను వెల్లడించాలన్న సీఐసీ ఆదేశాల్ని కూడా జస్టిస్ సచిన్‌దత్తా కొట్టివేశారు. సంచలనం కోసమే ముందుకొచ్చే ఇటువంటి డిమాండ్లను ఆమోదిస్తే.. అవి తామరతంపరగా పెరిగిపోతాయని న్యాయమూర్తి తన 175 పేజీల తీర్పులో పేర్కొన్నారు. కాగా, విచారణ సందర్భంగా ఢిల్లీ వర్సిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. 1978 బ్యాచ్ బీఏ ఫలితాల్ని బహిరంగపర్చలేంగానీ కోర్టుకు చూపించటానికి వర్సిటీకి ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. కాగా, ప్రధాని మోదీ డిగ్రీ వివరాలు వెల్లడించాల్సిందేనని, అలా వెల్లడించేందుకు నిరాకరించిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రజాసంబంధాల అధికారి జీతం నుంచి రూ.25 వేలు కోత విధించాలని అప్పటి కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్యులు 2016 డిసెంబర్‌లో జారీ చేసిన తుది ఆదేశాల్ని హైకోర్టు కొట్టేసింది.

రాజస్థాన్‌ను ముంచెత్తిన వరదలు

వేర్వేరు ఘటనల్లో నలుగురు చిన్నారులు సహా ఆరుగురి మృతి



జదావతా గ్రామంలో వరదతో ఏర్పడిన భారీ బిలం

జైపూర్/న్యూఢిల్లీ, ఆగస్టు 25: రాజస్థాన్‌ను వాన ముంచెత్తింది. తెరిపినివ్వకుండా కురుస్తున్న వర్షాలతో 19 జిల్లాలు అతలాకుతలమవుతున్నాయి. సుర్వాల్ డ్యామ్ ఉప్పొంగడంతో.. జదావతా అనే గ్రామంలో నేల తీవ్రంగా కోతకు గురై, 2 కిలోమీటర్ల మేర 100 అడుగుల వెడల్పు, 55 అడుగుల లోతుతో బిలం ఏర్పడింది. గ్రామాలు, పట్టణాలు, నగరాలు అని తేడా లేకుండా అంతటా వరద ఉధృతి కనిపించింది. జైపూర్‌లోనూ లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వగా.. రహదారులు చెరువులను తలపించాయి. పలు గ్రామాలకు రాకపోకలు తెగిపోయి.. ప్రజలు ఆకలికేకలు పెడుతున్నారు. సైన్యం, జాతీయ విపత్తు నిర్వహణ బృందం(ఎన్‌డీఆర్ఎఫ్), ఎస్‌డీఆర్ఎఫ్ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ఉదయ్‌పూర్‌లోని వర్షిన్ గనుల్లో ఆదివారం వరదనీరు చేరి.. 14 ఏళ్ల వయసున్న లక్ష్మీ గమేటీ, భవేశ్, 12 ఏళ్ల వయసున్న రాహుల్, శంకర్ అనే చిన్నారులు.. నాగౌర్‌లో ఇల్లు కూలిన ఘటనతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. సుర్వాల్‌లోని అజ్నోటీ గ్రామం వద్ద ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తాపడడంతో.. ఓ యువకుడు మృతిచెందాడు. ఝులావర్ జిల్లాలో ముగ్గురు ప్రయాణిస్తున్న కారు వరదలో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో వీరంతా మరణించి ఉంటారని అధికారులు చెబుతున్నారు. సోమవారం ఉదయానికి(గడిచిన 24 గంటల్లో) నాగౌర్ జిల్లాలో అత్యధికంగా 17.3 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లోనే రాజస్థాన్‌లో ఇదే అత్యధిక వర్షపాతమని వివరించారు. 1975 తర్వాత రాజస్థాన్‌లో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నట్లు వెల్లడించారు. మరో మూడ్రోజులపాటు మోస్తరు నుంచి భారీ/అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు, ఉత్తరాదిలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లోని ఐఐఎంలో భారీగా వరద నీరు చేరింది. క్యాంపస్‌లోని నాలుగు బ్లాకుల్లో గ్రౌండ్‌ఫ్లోర్లు పూర్తిగా నీట మునిగాయి. విద్యార్థులు పైఅంతస్తుల్లో నిలబడి హాహాకారాలు చేసే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ప్రపంచ అయ్యప్ప సంగమానికి సీఎం స్టాలిన్‌కు ఆహ్వానమా?

» హిట్లర్ యూదులతో కలిసి పండుగ చేసుకున్నట్లుగా ఉంది: బీజేపీ

తిరువనంతపురం, ఆగస్టు 25: మొట్టమొదటి 'ప్రపంచ అయ్యప్ప సంగమం' కార్యక్రమానికి తమిళనాడు సీఎం స్టాలిన్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించిన కేరళ సీఎం విజయన్‌పై బీజేపీ మండిపడింది. ఇది జర్మన్ నియంత హిట్లర్.. తాను అహరహం ద్వేషించే యూదులతో కలిసి పండుగ చేసుకున్నట్లుగా ఉందని ధ్వజమెత్తింది. ఈ అయ్యప్ప సంగమం వచ్చే నెల 20వ తేదీన పథనంథిట్టలో జరుగనుంది. తన మంత్రివర్గ సహచరులు హిందూయిజంపై అవమానకర వ్యాఖ్యలు చేసినా స్పందించని స్టాలిన్‌ను దీనికి ఆహ్వానించడం హిందూమతాన్ని అవమానించడమేనని బీజేపీ కేరళ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. శబరిమలలో అయ్యప్ప భక్తులపై పోలీసు చర్యకు విజయన్ గతంలో ఆదేశాలిచ్చారని గుర్తుచేశారు. ఈ ఇద్దరు అయ్యప్ప భక్తులకు క్షమాపణ చెప్పకపోతే సంగమంలో వారిని పాల్గొననివ్వబోమన్నారు.

మైసూరు దసరా ఉత్సవాలపై వివాదం

బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాలను ఈ ఏడాది బుకర్ ప్రైజ్ విజేత బాను ముస్తాక్ చేత ప్రారంభించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించడంపై కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. కన్నడ మాతగా భువనేశ్వరీదేవిని ఎలా అంగీకరించాలని గతంలో ఓ ఇంటర్వ్యూలో బాను ముస్తాక్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. భువనేశ్వరీదేవిని కన్నడ మాతగా అంగీకరించని బాను ముస్తాక్, చాముండేశ్వరి దేవికి పుష్పార్చన ఎలా చేస్తారని, చాముండేశ్వరి దేవిపై ఆమెకు నమ్మకం ఉందా అని కేంద్రమంత్రి శోభా కరంద్లాజె ప్రశ్నించారు.

'బినామీలకు పరిహారం'పై ఎట్టకేలకు కదలిక!

» ఫార్మాసిటీ భూసేకరణలో భూదాన్ భూములకు పరిహారం
» ఈ అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం
» విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి


యాచారం మండలం తాటిపర్తిలోని భూదాన్‌భూములు

యాచారం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల పరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలపై ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. మొత్తం వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. గత ప్రభుత్వ హయంలో జరిగిన భూసేకరణలో రూ.కోట్లలో అక్రమాలు జరిగాయి. స్థానిక నేతలు అధికారులపై ఒత్తిడిచేసి భూదాన్, అసైన్డ్ భూముల్లో కూడా తమ బినామీలకు పరిహారం అందించారు. ఈ అక్రమాలపై గత ఫిబ్రవరి 12న 'ఆంధ్రజ్యోతి'లో 'బినామీలకు పరిహారం'శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు చేపట్టిన విచారణ ఇంకా పూర్తికాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. భూదాన్ భూముల పరిహారం సొమ్ములు అనర్హులకు అందించారని, దీనిపై విచారణ జరపాలంటూ అప్పట్లో తాటిపర్తి గ్రామ సర్పంచిగా ఉన్న దూస రమేశ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో కేసు వేశారు. గ్రామంలోని సర్వే నం.104లో 250 ఎకరాల భూములకు ఎకరానికి రూ.16లక్షల పరిహారం చొప్పున రూ.40 కోట్ల నిధులు అక్రమార్కులకు చెల్లించారని, దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని పలుమార్లు గ్రామసభల్లో నిలదీశారు. అయినా ఫలితం లేకపోయింది. భూదాన్ భూములను సాగు చేసుకుంటున్న పేదలు తమకు అన్యాయం జరిగిందని గగ్గోలు పెడుతున్నారు. కాగా, ఇటీవల ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ప్లాట్లను అందించింది. తమకు పరిహారం, ప్లాట్లు కూడా ఇవ్వాలని తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాల రైతులు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాగా, భూదాన్ భూములా, కాదా? అనేదానిపై అధికారులు సరైన విచారణ చేయకుండానే పరిహారం అందించడంపై రమేశ్ లోకాయుక్తలో కేసు వేశారు. దీనిపై నివేదిక ఇవ్వాలని లోకాయుక్త.. అధికారులను ఆదేశించింది. కాగా.. అక్రమాలకు పాల్పడిన వారు మళ్లీ ఇప్పుడు భూ నిర్వాసితులకు ఇస్తున్న ప్లాట్లపైనా కన్నేసినట్లు తెలిసింది. ఈ అక్రమాలు ప్రభుత్వం దృష్టికి రావడంతో మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఆదేశించారు. దీనిపై ఆర్డీవో అనంతరెడ్డిని వివరణ కోరగా భూదాన్ భూములకు సంబంధించి ప్లాట్లు ఇవ్వలేదని చెప్పారు.

నిషేధిత జాబితా పరిష్కారానికి త్రిసభ్య కమిటీ!

(మొదటి పేజీ తరువాయి)

శాఖ ముఖ్య కార్యదర్శి/సీసీఎల్‌ఏ ఛైర్మన్‌గా ఉంటారని, రిటైర్డ్ జిల్లా జడ్జి, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ సభ్యులుగా ఉంటారని తెలిపింది. కమిటీ సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి నిషేధిత జాబితాకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తుందని చెప్పింది. వచ్చిన దరఖాస్తులను అంగీకరించడం లేదా తిరస్కరించడం ద్వారా నిషేధిత జాబితాలోని భూములను తొలగించడం, అలాగే ఉంచడం మీద నిర్ణయాలను తీసుకుంటుందని తెలిపింది. ఉన్నత స్థాయి కమిటీ తీసుకునే నిర్ణయాలకు అటు ప్రభుత్వం, ఇటు ప్రైవేటు పార్టీలు లేదా ఫిర్యాదుదారులు కట్టుబడి ఉండాలని చెప్పింది. కమిటీ నిర్ణయం నచ్చకపోతే సంబంధిత కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. సదరు కమిటీ మూడేళ్ల కాల పరిమితితో కొనసాగుతుందని, కనీసం నెలకు ఒక్కసారి అయినా కమిటీ భేటీ అయి దరఖాస్తులను పరిష్కరిస్తుందని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది.

నిషేధిత జాబితా భూముల వివరాలపై గతవారం ఆదేశాలు

నిషేధిత జాబితా భూములకు సంబంధించి తన కోర్టులో దాదాపు 5 వేల కేసులు పెండింగ్‌లో ఉండటంతో నిషేధిత జాబితా భూముల వివరాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం గతవారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో నిషేధిత జాబితాలో ఉన్న భూములను గుర్తించి, ఆయా వివరాలను సబ్ రిజిస్ట్రార్‌లకు పంపాలని, ఈ ప్రక్రియ వల్ల అక్రమ రిజిస్ట్రేషన్లకు తావు ఉండదని హైకోర్టు అభిప్రాయపడింది. జిల్లా కలెక్టర్లు తమ తమ జిల్లాల పరిధిలో ఉన్న నిషేధిత జాబితా భూముల వివరాలు సేకరించి క్రోడీకరించే ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది. జిల్లా కలెక్టర్లు తమ పరిధిలో ఉండే సబ్ రిజిస్ట్రార్‌లకు ఈ జాబితాలు పంపితే ఏ భూములు రిజిస్ట్రేషన్ చేయకూడదో స్పష్టత ఉంటుందని పేర్కొంది. దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించినట్లు వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది. పది రోజుల్లో దాఖలు చేయని పక్షంలో ప్రత్యక్షంగా తమ ఎదుట హాజరు కావాలని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తూ జీవో ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వివరాలు అందించింది. వాదనలు విన్న ధర్మాసనం అన్ని జిల్లాల కలెక్టర్లు నిషేధిత జాబితా భూముల వివరాలను తొమ్మిది వారాల్లో సబ్ రిజిస్ట్రార్‌లకు పంపాలని పేర్కొంది. కలెక్టర్లు ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు వివరాలు తెలియజేస్తూ పది రోజుల్లో సీఎస్ అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది. అఫిడవిట్ వేయకపోతే సీఎస్ ప్రత్యక్షంగా హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొంటూ తదుపరి విచారణను సెప్టెంబరు మూడో తేదీకి వాయిదా వేసింది.



ఏ ప్రాతిపదికన తొలగించారు?

నాగారంలోని సర్వే 194, 195లో ప్రభుత్వ భూములుగా పేర్కొంటున్న దాదాపు 50 ఎకరాల భూములకు ఏ ప్రాతిపదికను పాస్ పుస్తకాలు ఇచ్చారో చెప్పాలని సీసీఎల్‌ఏ, రంగారెడ్డి కలెక్టర్, కందుకూరు ఆర్డీవో, మహేశ్వరం తహసీల్దార్ తదితరులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే 194, 195 నెంబర్లలోని నిషేధిత జాబితాలో ఉన్న దాదాపు 50 ఎకరాల ప్రభుత్వ భూములకు రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయడంపై తాజాగా మరో పిటిషన్ దాఖలైంది. ఈ భూముల రికార్డులు తారుమారు చేసి పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లకు రిజిస్ట్రేషన్ చేశారని, దీనిపై విచారణ చేపట్టాలని మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామానికి చెందిన బిర్ల మల్లేశ్ గతంలో పిటిషన్ దాఖలు చేశారు. బిర్ల మల్లేశ్ తాజాగా మరో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి అబ్దుల్ జావీద్, అర్షియా సుల్తానా, అబ్దుల్ లతీఫ్, మునావర్‌ఖాన్ పేరిట అప్పటి తహసీల్దార్ టి.సుబ్రమణ్యం పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశారని, సదరు అధికారిపై చట్టపరంగా క్రమశిక్షణా చర్యలతోపాటు క్రిమినల్ చర్యలు చేపట్టాలని మల్లేశ్ కోరారు. సర్వే నెంబర్ 194, 195లో దాదాపు 700 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, ఈ భూములు 2019 వరకు నిషేధిత జాబితాలో ఉన్నాయని, కానీ సదరు తహసీల్దార్ 2018 ఏప్రిల్‌లోనే ప్రైవేటు వ్యక్తులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశారని.. గతంలో సదరు ప్రైవేటు వ్యక్తుల పేర్లు ఎక్కడా రికార్డుల్లో లేవని పేర్కొన్నారు. ఈ ప్రైవేటు వ్యక్తులకు జారీ చేసిన పాస్ పుస్తకాల ఆధారంగానే వివాదం ఏర్పడిందని.. పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌ల పేరిట రిజిస్ట్రేషన్లు జరిగాయని పేర్కొన్నారు. అక్రమంగా నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూములకు పాస్ పుస్తకాలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం నిషేధిత జాబితాలో ఉన్న సదరు భూములకు ఏ ప్రాతిపదికన పాస్ పుస్తకాలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించింది. కలెక్టర్ నుంచి వివరాలు సమర్పించాలని ప్రభుత్వ న్యాయవాదికి సూచించింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

అనుమతి లేని కేబుళ్లను తొలగించవచ్చు: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థల అనుమతి తీసుకోకుండా వాటి స్తంభాలపై ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ కేబుళ్లను తొలగించవచ్చని హైకోర్టు తెలిపింది. అనుమతి తీసుకున్న వాటిని మాత్రమే ప్రస్తుతానికి తొలగించరాదని చెప్పింది. ప్రభుత్వ విద్యుత్ సంస్థతో ఒప్పందం చేసుకొని కేబుళ్లు వేసుకున్నామని భారతీ ఎయిర్‌టెల్ చెబుతున్న నేపథ్యంలో ఆ సంస్థ అనుమతి పొందకుండా కేబుళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఎన్నో లెక్క తేల్చాలని హైకోర్టు ఆదేశించింది. ఇటీవల ఇంటర్నెట్ కేబుళ్ల కారణంగా విద్యుదాఘాతానికి గురై ఐదుగురు మరణించిన నేపథ్యంలో ప్రభుత్వం విద్యుత్ స్తంభాలపై కేబుళ్లను తొలగించే కార్యక్రమం చేపట్టింది. దీనిపై భారతీ ఎయిర్‌టెల్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై సోమవారం మరోసారి జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రంలో 20 లక్షల విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, ఎన్నింటికి కేబుళ్లు వేసుకోవడానికి అనుమతి పొందారో భారతీ ఎయిర్‌టెల్ చెప్పాలని ప్రభుత్వ న్యాయవాది ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని స్తంభాలపై ఎయిర్‌టెల్ కేబుళ్లు వేయడానికి తాము గుత్తగా అనుమతి ఇవ్వలేదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన కేబుళ్లను తొలగించవచ్చిన గతంలో ఇచ్చిన ఉత్తర్వులను కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. అలాగే, అనుమతి లేని విద్యుత్ స్తంభాలు ఎన్నో ప్రత్యేకంగా అధికారులను నియమించి లెక్క తేల్చాలని పేర్కొంది. పూర్తి స్థాయి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని విద్యుత్ సంస్థకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను సెప్టెంబరు ఎనిమిదవ తేదీకి వాయిదా వేసింది.

మీ అకౌంట్‌లో డబ్బు వేస్తాం.. మేం చెప్పిన వాళ్లకు పంపండి

» సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసం
» కమీషన్ల కక్కుర్తితో జైలు పాలైన 13 మంది యువకులు

కొత్తగూడెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో మీ సేవా కేంద్రం నడుపుతున్న బోడా శ్రీధర్ అనే వ్యక్తికి టెలిగ్రామ్ ద్వారా కొందరు(సైబర్ నేరగాళ్లు) పరిచయమయ్యారు. ఏవైనా బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలను తెరవాలని, వాటిల్లోకి వచ్చే డబ్బును వేరేవాళ్ల అకౌంట్లకు పంపిస్తే కమీషన్ ఇస్తామని చెప్పారు. దీంతో, శ్రీధర్‌తో పాటు మరో 12 మంది యువకులు నకిలీ పత్రాలతో కొత్తగూడెంలోని ఐదు బ్యాంకుల్లో కరెంట్ అకౌంట్లను తెరిచారు. ఆ ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు చెప్పిన అకౌంట్లకు నగదును బదిలీ చేస్తూ కమీషన్లు పొందారు. మరోవైపు, సైబర్ నేరగాళ్ల మాయతో డబ్బు పోగొట్టుకున్న బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో సైబర్ క్రైం అధికారులు దర్యాప్తు చేయగా.. డబ్బంతా ఈ ఖాతాల్లోకి వెళ్తోందని గుర్తించి ఫ్రీజ్ చేశారు. అనంతరం జిల్లా పోలీసులకు సమాచారమిచ్చారు. టేకులపల్లి, సైబర్ క్రైం పోలీసుల విచారణలో నిందితులకు చెందిన ఖాతాల నుంచి రూ.8.50 కోట్ల లావాదేవీలు జరిగినట్లు తేలింది. దేశవ్యాప్తంగా వీరి బ్యాంకు ఖాతాలపై 108 ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో 13 మంది యువకులను ఆదివారం టేకులపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఆర్మీ అధికారికి పూజలు చేయాలంటూ.. పూజారికి కుచ్చుటోపీ!

» రూ.10 పంపి.. రూ.6 లక్షలు కొట్టేశారు
» సీసీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధిత పూజారి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు పూజలు చేయాలంటూ ఓ పూజారికే కుచ్చుటోపీ పెట్టారు. ఆర్మీ అధికారి ఆరోగ్యం బాగుపడడానికి పూజలు చేయాలని నమ్మించి.. రూ.6 లక్షలు కొట్టేశారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం.. పురానాపూల్‌కు చెందిన 52 ఏళ్ల పూజారికి రెండు రోజుల క్రితం గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తనను తాను కెప్టెన్ అమన్‌కుమార్‌గా పరిచయం చేసుకున్న వ్యక్తి సికింద్రాబాద్ ఆర్మీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పాడు. తమ కర్నల్‌కు ఆరోగ్యం బాగోలేదని, 21 మంది పండితులతో 11 రోజులపాటు పూజలు చేయాలని కోరాడు. దీనికి పూజారి సరే అన్నారు. అడ్వాన్‌గా రూ.3 లక్షలు ఇస్తామని, తర్వాత మిగిలిన డబ్బు ఇస్తామని నమ్మబలికాడు. ఆర్మీ నిబంధనల ప్రకారం.. ముందుగా తాము కొంత నగదు బదిలీ చేస్తామని, నిర్ధారించుకొని, మిగిలిన డబ్బు పంపుతామని నమ్మించాడు. ముందు రూ.10 ఫోన్‌పే చేశాడు. ఆ తర్వాత పూజారికి చెందిన మరో ఫోన్ నంబరు అడిగి, దానికి వీడియోకాల్ చేశాడు. ఆర్మీ దుస్తుల్లో ఉన్న వ్యక్తి మాట్లాడుతూ.. డబ్బులు అకౌంట్‌కు బదిలీ చేస్తున్నట్లుగా నమ్మించి గూగుల్‌పే, ఫోన్‌పే యాప్‌లను ఓపెన్ చేయించి.. డెబిట్ కార్డు నంబరు, పిన్ నంబర్లను తెలుసుకున్నాడు. పూజారిని తన మాటలతో ఏమార్చి అతనితోనే ఖాతాలోని డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అలా విడతలవారీగా రూ.5,99,999 కొల్లగొట్టారు. మోసపోయిన విషయాన్ని గుర్తించిన పూజారి.. ఆర్మీ అధికారికి ఫోన్ చేయగా, ఆ వ్యక్తి స్పందించలేదు. వెంటనే సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హెచ్‌ఎంఎస్ నుంచి రియాజ్ అహ్మద్ బహిష్కరణ

» త్వరలో నూతన కమిటీ : అధ్యక్షుడు జక్కుల నారాయణ

గోదావరిఖని, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్(హెచ్‌ఎంఎస్) ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌ను యూనియన్ నుంచి బహిష్కరిస్తున్నట్లు అధ్యక్షుడు జక్కుల నారాయణ ప్రకటించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..రియాజ్ అహ్మద్ తన వర్గానికి చెందిన నాయకులకు పదవులు ఇస్తూ ఇతరులకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినట్లు ఆరోపించారు. కేంద్ర కమిటీకి తెలియకుండా శ్రీరాంపూర్‌లో సెంట్రల్ కమిటీ ఏర్పాటు చేశారని, ఇది ఎలా చెల్లుతుందని ఆయన ప్రశ్నించారు. దసరా తరువాత యూనియన్ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

ఇద్దరు యువకుల దారుణ హత్య

» ప్రాణాలు తీసిన వివాహేతర సంబంధం
» నిజామాబాద్ జిల్లా ధర్మారంలో ఘటన


ఆకాశ్, జిలకర ప్రసాద్ (ఫైల్)

నిజామాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మం డలం ధర్మారంలో ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. జిల్లా కేంద్రానికి చెందిన జిలకర ప్రసాద్ (35)కు మాక్లూర్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఓ మహిళతో పదేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. రెండు రోజుల క్రితం ఆ మహిళ ఇంటి పక్కన ఉండే మహారాజ్ కుటుంబ సభ్యులతో గొడవ జరగగా ప్రసాద్ వారిని చంపుతానని బెదిరించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి గ్రామానికి వచ్చిన జిలకర ప్రసాద్, ఆకాశ్ (27)ను మహారాజ్ కుటుంబ సభ్యులు.. చెట్టుకు కట్టేసి కళ్లలో కారంకొట్టి రాడ్లు, గొడ్డలితో దాడి చేశారు. ప్రసాద్ ఘటన స్థలంలోనే మృతి చెందగా.. ఆకాశ్ ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. ప్రసాద్‌కు వివాహమై.. విడాకులు కూడా అయినట్లు సమాచారం. ఆకాశ్ అవివాహితుడు. తోడుగా రావాలని ప్రసాద్ పిలవడంతో వెళ్లిన ఆకాశ్ హత్యకు గురికావడం అతడి కుటుంబంలో విషాదాన్ని నింపింది. ప్రసాద్‌పై నిజామాబాద్‌లో పదికి పైగా గంజాయి, దొంగతనం కేసులున్నాయి. పోలీసుల తుపాకిని ఎత్తుకెళ్లిన కేసులో కూడా ప్రసాద్ నిందితుడు. కాగా, మహరాజ్ కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఐ ఫోన్ చోరీ చేసి పట్టుబడ్డ కానిస్టేబుల్

డోర్నకల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడి బావమరిదితో కలిసి ఫోన్లు చోరీ చేస్తూ ఓ కానిస్టేబుల్ డోర్నకల్ రైల్వే పోలీసులకు పట్టుబడ్డారు. ఈమేరకు ఖమ్మం రైల్వే పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అంజలి సోమవారం తెలిపారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన బండి ప్రియాంక అనే మహిళ తన ఐ ఫోన్-15 చోరీకి గురైనట్లు డోర్నకల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే సీఐ అంజలి, డోర్నకల్ రైల్వే పోలీస్ ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆ యువతి అనుమానించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అనంతరం నిందితులను పూర్తిస్థాయిలో విచారించగా వారిలో యరమడి రవీందర్ అనే వ్యక్తి రాచకొండ కమిషనరేట్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు తేలింది. మరో వ్యక్తి కానిస్టేబుల్ బావమరిది మేకల నాగసాయి అని తేలిందన్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఏడు రోజులుగా గదిలోనే భర్త శవం

» తమిళనాడులోని కన్నియకుమారిలో ఘటన

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఓ రిటైర్డ్ ఎస్‌ఐ ఇంట్లో ఏడు రోజులుగా శవమై పడి ఉన్నా.. ఆయన భార్య గుర్తించలేదు. మానసిక రోగి అయిన ఆమె ఎప్పటిలాగే వంటావార్పు చేసుకుంటూ గడిపింది. తమిళనాడులోని కన్నియాకుమారిలో జరిగిన ఈ ఘటన స్థానికులు, పోలీసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. కన్నియాకుమారి కలైజంర్ క్వార్టర్స్ ప్రాంతంలోని ఓ ఇంటిలో జయకుమార్ (57) దంపతులు నివసిస్తున్నారు. జయకుమార్ భార్య ఏడేళ్ల నుంచి మానసిక రుగ్మతతో బాధపడుతుండడంతో ఆమె సంరక్షణ కోసం ఆయన వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని ఇంటి పట్టునే ఉంటున్నారు. ఈ క్రమంలో జయకుమార్ పక్కఊరిలో ఉన్న తన సోదరుడు ఫ్రాన్సిస్‌కు రోజూ ఫోన్ చేస్తుండేవారు. ఈ నెల 17 తర్వాత జయకుమార్ నుంచి ఎలాంటి ఫోన్‌కాల్ రాలేదు. దీంతో ఫ్రాన్సిస్‌కు అనుమానం వచ్చి సోమవారం ఉదయం జయకుమార్ ఇంటికి వచ్చారు. ఇంటి మిద్దెపైన ఉన్న గదికి వెళ్లి చూడగా.. మంచంపై కుళ్లిన స్థితిలో ఉన్న జయకుమార్ మృతదేహం కనిపించింది. దిగ్భ్రాంతికి గురైన ఫ్రాన్సిస్ వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జయకుమార్ వారం రోజుల క్రితమే మృతిచెందినట్టు పోలీసులు నిర్ధారించారు.

రాముడిని ఎగతాళి చేయడం కాంగ్రెస్‌కు అలవాటే

» దేవుని ఉనికిని తిరస్కరించే పార్టీ అది
» కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాముడిని ఎగతాళి చేయడం కాంగ్రెస్‌కు అలవాటేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ.. రాముడిని పార్టీ సభ్యుడిలా చూస్తోందని సిగ్గులేకుండా మాట్లాడుతోందని మండిపడ్డారు. దేవుడి ఉనికిని తిరస్కరించే కాంగ్రెస్, దాని మతిలేని నాయకుల నుంచి ఇంతకన్నా ఇంకేం ఆశించగలమని అన్నారు. జనహిత పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్.. బీజేపీపై చేసిన వ్యాఖ్యలను సంజయ్ ఖండించారు. "రామ సేతు కేసులో శ్రీరాముడిని కోర్టుకు లాగింది కాంగ్రెస్సే. రాముడు లేడు.. రామాయణం లేదు.. అని 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం రామసేతు కేసులో సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. హిందువులను హింసాత్మకులు అన్నది. రామ మందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు హాజరుకావడానికి నిరాకరించింది. రామ మందిర ఉద్యమం ఓడిపోయింది అని రాహుల్ గాంధీ అనలేదా..? కాంగ్రెస్ దశాబ్దాలుగా రామ మందిరం తలుపులను మూసివేస్తే.. బీజేపీ తెరిచింది. బీజేపీకి రాముడంటే ప్రాణం, విశ్వాసం. రామ్ రాజకీయాల కోసం కాదు.. ఈ దేశ గుండె చప్పుడు" అని సంజయ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

సైనికులు దేశ గౌరవాన్ని పెంచారు

» కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


తిరుమల ఆలయం ముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తిరుమల/న్యూఢిల్లీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనికులు, భద్రతా సిబ్బంది వీరోచిత పోరాటంతో దేశ గౌరవాన్ని పెంచారని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం సుప్రభాత సేవలో కిషన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ రక్షణలో అంకిత భావంతో పనిచేస్తున్న సైనికులకు అండగా ఉండాలని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్టు తెలిపారు. కాగా, అమృత్ భారత్ పథకం కింద తెలంగాణలోని రైల్వే స్టేషన్లు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్నాయని కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పేర్కొన్నారు. అమృత్ భారత్‌లో భాగంగా అభివృద్ధి చేస్తున్న మహబూబాబాద్ రైల్వేస్టేషన్ చిత్రాలను ఆయన పోస్ట్ చేశారు. రూ.26.49 కోట్లతో స్టేషన్ ఆధునీకరణ చేపట్టగా ఇప్పటి వరకు 92 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటే

» యూరియా విషయంలో బీజేపీపై నిందలు
» స్థానిక ఎన్నికలు నిర్వహించలేక ఓట్ చోరీ డ్రామాలు
» బీసీలకు 46% రిజర్వేషన్లు ఇస్తాం: రాంచందర్‌రావు



నిజామాబాద్/హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటేనని.. రెండు పార్టీలు కలిసి యూరియా విషయంలో బీజేపీపై నిందలు వేయాలని చూస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. సోమవారం నిజామాబాద్‌లో నిర్వహించిన పార్లమెంట్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ఒక్కటి కాకుంటే ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ పరస్పర ఒప్పందంతోనే ముందుకు వెళ్తున్నారని ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డిని, ఫోన్ ట్యాపింగ్ కేసులో సీఎం కేసీఆర్‌ను తప్పించేందుకు చూస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలు నిర్వహించలేక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఓట్ చోరీ అంటూ దృష్టి మరల్చే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఓట్ చోరీ అయిందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించడం తెలంగాణ ఓటర్లను కాంగ్రెస్ అవమానించడమేనన్నారు. ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో బీసీలకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు ఇస్తే 32 శాతమే బీసీలకు దక్కుతుందని తెలిపారు. బీసీలకు 46 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నేతలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. ఓట్ చోరీ విషయంలో 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచినప్పుడు అనేక అనుమానాలు వచ్చాయని అప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదో మహేష్‌గౌడ్ చెప్పాలని ఎంపీ అర్వింద్ అన్నారు. ఓట్లు, సీట్లు ఇచ్చిన నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి రాష్ట్ర బీజేపీ కమిటీలో వాటా పదవులు ఇవ్వాలని రాంచందర్‌రావును కోరారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులకు ఎంపీ అర్వింద్ సొంత డబ్బులతో చెక్కులను అందజేశారు.

ధైర్యముంటే దొంగ ఓట్ల లెక్కలు తేల్చండి: డీకే అరుణ

ధైర్యముంటే రాష్ట్రంలో దొంగఓట్ల లెక్కలు తేల్చాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ.. మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సవాల్ చేశారు. రాష్ట్రంలో దొంగ ఓట్లు ఉంటే మీరు కూడా వాటితోనే గెలిచినట్లు కాదా?అని నిలదీశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. మహేశ్‌గౌడ్ అహంకారంతో మతిభ్రమించి మాట్లాడారని విమర్శించారు. మీలో బీసీ రక్తం ప్రవహిస్తే బీసీలకు 42శాతం రిజర్వేషన్లను తక్షణం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్.. మహేశ్‌గౌడ్‌ను డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని దేశ్‌ముఖ్ అనడం మూర్ఖత్వమని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వీధికుక్కల వివాదం

ఎనిమిది వారాల్లోగా ఒక్క వీధికుక్క దేశరాజధాని రోడ్లమీద కనబడకూడదంటూ సుప్రీంకోర్టు ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ జారీచేసిన ఆదేశాలు కఠినంగా ఉండటంతో పాటు, ఆచరణలో అసాధ్యమని కూడా గ్రహించినందున అనంతరం సర్దుబాట్లు, దిద్దుబాట్లు జరిగాయి. అత్యంత వివాదాస్పదమైన ఓ అంశంమీద తీర్పు కూడా వివాదాస్పదమైన రీతిలో ఉన్నందున, మరుసటి తీర్పు జంతుప్రేమికులకు నచ్చింది. ఢిల్లీ, సబర్బన్‌ప్రాంతాల్లో పదిలక్షలవరకూ వీధికుక్కలు ఉంటాయన్న అంచనాల నేపథ్యంలో, రెండునెలల్లోనే ఈ వీధికుక్కలన్నింటినీ పట్టుకొని, జంతు సంరక్షణాకేంద్రాలకు తరలించాలనడమే కాదు, మళ్ళీ వాటిని వీధుల్లోకి వదలకుండా అక్కడే నిర్బంధించాలన్న తొలి తీర్పు ఆచరణలో ఎంతో అమానవీయంగా అమలు జరుగుతుందని జంతుప్రేమికులు బాగా భయపడ్డారు. మూగజీవులమీద కేవలం ప్రేమతో ఆ ఆదేశాలను వ్యతిరేకించినవారిని అటుంచితే, సదరు తీర్పు పలుకారణాల రీత్యా ఆశించినదానికి పూర్తి విరుద్ధమైన ఫలితాన్నిస్తుందని కూడా కొందరు విశ్లేషించారు. టీకాలువేసి, డీవార్మింగ్ చేసి, కుటుంబనియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, వీధికుక్కలను మళ్ళీ అవి ఉంటున్న ప్రాంతాల్లోనే వదిలేయాలని సుప్రీంకోర్టు తన సవరణ తీర్పులో ప్రకటించింది. రాబిస్ ఉన్నవాటినీ, భయానకంగా ప్రవర్తిస్తున్నవాటినీ మినహాయించినప్పటికీ, తొలి, మలి తీర్పులమీద ఇంకా చర్చ సాగుతూనే ఉంది, వివాదం నడుస్తూనే ఉంది.

సర్వోన్నత న్యాయస్థానాన్ని సైతం ఇలా తీర్పు సరిదిద్దుకొనేట్టుగా చేసిన జంతుప్రేమికులకూ, సెలబ్రిటీలకు కుక్కలమీదమాత్రమే అంత ప్రేమ ఎందుకుంటుందని కొందరి ప్రశ్న. శునకాల పట్ల కరుణచూపమంటూ సామాజిక మాధ్యమాల్లో నిజానికి ఒక యుద్ధమే సాగింది. పేరొందిన ప్రముఖులు కోర్టుకు తమ వాదనను, వేదనను నివేదించారు, అభ్యర్థించారు, కొందరు కన్నీళ్ళు కూడా పెట్టుకున్నారు. ఇదంతా న్యాయస్థానాన్ని ప్రభావితం చేసినందునే, వెంటనే తీర్పును సవరించుకున్నదని అనలేం కానీ, తొలి తీర్పు మరీ కఠినంగా ఉన్నదని న్యాయమూర్తులే ఒప్పుకున్నారు. లక్షలాది వీధికుక్కలను నిర్బంధించి, నిర్వహించగలిగే షెల్టర్ల నిర్మాణం, నిర్వహణ అత్యంత కష్టమైన పని. ఎకరాలకొద్దీభూమి, శునకసేవలకు సరిపడా సిబ్బంది, వాటి ఆహారం, మందులు తడిసిమోపెడవుతాయి. ఆర్భాటంగా ఆరంభమైనా, నిర్వహణ అనతికాలంలోనే భ్రష్టుపడుతుందన్నది వాస్తవం. స్టెరిలైజ్ చేసిన తరువాత, ఎక్కడి కుక్కలను అక్కడే విడిచిపెట్టాలన్న నియమం చాలా అధ్యయనాల అనంతరం రూపొందినందువల్ల అనంతర తీర్పులో సుప్రీంకోర్టు దానిని ఆమోదించింది. గత ఏడాది దేశ వ్యాప్తంగా 37లక్షల కుక్కకాట్లు నమోదైతే, రేబిస్‌తో సంభవించిన మరణాల సంఖ్య అధికారికంగా 55మాత్రమే. సామాజిక మాధ్యమాల కారణంగా దేశంలో ఏ మూల కుక్కదాడిచేసినా ఇప్పుడు ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. రేబిస్ సోకినవారి వేదనను తెలియచేసే ఆ కొద్ది వీడియోలు కూడా ఒకటికి పదిసార్లు తిరుగుతూ వీధికుక్కలంటేనే వొణికిపోయేట్టు చేస్తున్నాయి. రేబిస్‌తో ఏటా 20వేల మరణాలు సంభవిస్తున్నాయన్న అనధికారిక లెక్కలను అటుంచితే, కుక్కకాటు తీవ్రమైన సమస్య. సకాలంలో ఇంజక్షన్లు తీసుకొని జాగ్రత్త పడినప్పటికీ, భౌతికంగానూ, మానసికంగానూ ఆ ఘటన మిగల్చే గాయం చిన్నది కాదు. కొందరిని జీవితాంతం అది వెంటాడుతూ ఉంటుంది.

వీధికుక్కలకు సామూహిక సంరక్షణ కేంద్రాల ఏర్పాటుతో సమస్యకు శాశ్వత పరిష్కారం ఏర్పడుతుందనుకొని ఇచ్చిన తొలితీర్పు వివాదాస్పదమై, మళ్ళీ పాతపద్ధతులకే మలితీర్పు ప్రాధాన్యం ఇచ్చింది. వీధికుక్కల సమస్య, వివాదం ఈనాటిది కాదు. భవిష్యత్తులోనూ న్యాయస్థానాల జోక్యం అవసరం రాకుండా ప్రజలు, మరీ ముఖ్యంగా జంతుప్రేమికులు చొరవ చూపాలి. వీధికుక్కల నియంత్రణ, నిర్వహణకు సంబంధించి చట్టంలో నిర్దేశించిన అంశాల్లో సగభాగం కూడా మునిసిపాలిటీలు అమలుచేయడం లేదని, తగినన్ని నిధుల కేటాయింపు, వినియోగం జరగడం లేదని, అబద్ధపు లెక్కలతో అధికారగణమే అత్యధిక భాగాన్ని తినేస్తున్నదని జంతుప్రేమికుల విమర్శ. సుప్రీంకోర్టు మలితీర్పు ఈ అంశాలను విస్తృతంగా చర్చించి, పరిష్కారాలను అన్వేషించేందుకు ఉపకరిస్తుంది. స్థానిక సంస్థల నిర్లక్ష్యాన్ని, నిధుల దుర్వినియోగాన్ని జంతుప్రేమికులు ఎప్పటికప్పుడు ప్రశ్నించాలి. ఏటా నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు పరిపూర్తి చేసేట్టుగా నిరవధిక ఒత్తిడి ఉంచాలి. వాక్సినేషన్, స్టెరిలైజేషన్ ప్రక్రియలు నిక్కచ్చిగా, నిర్దిష్టంగా జరిగేట్టు చేస్తే వీధికుక్కలు పరిమితంగా ఉంటాయి, వివాదాలూ హద్దులు దాటవు.

'సుప్రీం' సందిగ్ధత ఎన్నికలకు శాపం!



ఉన్నత న్యాయమూర్తుల నియామకం విషయంలో ప్రభుత్వం పార్లమెంటు ద్వారా నెలకొల్పిన జాతీయ న్యాయ నియామక కమిషన్‌ను కొనగోటితో తొలగించి కొలీజియంను కాపాడుకున్న సుప్రీంకోర్టు... ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐని తిరిగి చేర్పించే విషయంలో ఇంతగా వెనుకాడడం దేశ ప్రజాస్వామ్యాన్ని కంపింపజేస్తున్నది.

ఎన్నికల కమిషన్ (ఈసీ) ఇంతగా వివాదాస్పదమై పలచనైపోయిన సందర్భం ఇంతకుముందు ఎప్పుడూ లేదనుకుంటాను. ఒకవైపు ఎన్నికలు చేరువలో ఉన్న బిహార్‌లో ఉన్నట్టుండి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో చేపట్టిన కార్యక్రమం అభాసుపాలవుతున్నది. ఇంకొకవైపు ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పరిశోధించి బయటపెట్టిన భారీ దొంగ ఓట్ల బండారం ప్రజాస్వామ్యానికి పెనుముప్పును సూచిస్తూ కమిషన్ తలదించుకోవలసిన పరిస్థితిని కలిగించింది. ఈ రెండు ఉదంతాల్లోనూ అది కేంద్ర పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిపోయింది.

ఏ పార్టీ, లేదా ఏ శక్తి, వ్యక్తి ఒత్తిడికీ లొంగకుండా సర్వ స్వతంత్రంగా పని చేయడానికే ఈసీకి రాజ్యాంగ హోదా కల్పించారు. ఎన్నికల నిలువుటద్దంలో ప్రజల తీర్పును యథాతథంగా ప్రస్ఫుటింపజేయవలసిన గురుతర బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు దీనికి అప్పగించారు. అందుకు విరుద్ధంగా అది దూదూ బసవన్న అయిపోవడం ఎంతో ఆవేదన కలిగిస్తున్నది. శేషన్ హయాంలో మితిమించిన కాఠిన్యం, ఇప్పుడు శ్రుతిమించిన దాసోహం. ప్రజాస్వామ్యంలోని సున్నితత్వాన్ని హరించిన శేషన్‌ను భరించగలిగాం గాని, జ్ఞానేశ్ వెన్నెముకలేమి దుర్భరంగా ఉన్నదని ప్రజలు, విజ్ఞులు వాపోతున్నారు.

రాజ్యాంగం 324 అధికరణ ఎన్నికల సంఘానికి ప్రాణం పోసింది. ఈ ఆర్టికల్ ప్రకారం పార్లమెంట్‌కు, రాష్ట్రాల శాసనసభలకు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు నిష్పాక్షిక, నిర్భయ వాతావరణంలో ఎన్నికలు జరిపించడం ఎన్నికల కమిషన్ ప్రధాన బాధ్యత. ఇంకా ఆయా ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడం, ఎన్నికల్లో పార్టీలకు ప్రవర్తనా నియమావళి (కోడ్) విడుదల చేయడం, అభ్యర్థుల ప్రచార ఖర్చుపై పరిమితి విధించడం, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల వంటి ఆధునిక సాంకేతిక సాధనాలను ప్రవేశపెట్టడం, నోటా మాదిరి విధానాలను చేర్చి ప్రజాస్వామ్య నైతిత్యానికి పదునుపెట్టడం, అభ్యర్థుల క్రిమినల్ నేపథ్యాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం ఎన్నికల కమిషన్‌కు గల ఇతర అధికారాలు.

ఈ కమిషన్ 1950లో నెలకొన్నది. 1989లో ఓటింగ్ కనీస వయసును 21ఏళ్లకు బదులు 18 సంవత్సరాలు చేశారు. అప్పుడు తొలిసారిగా ఏకసభ్య కమిషన్ ముగ్గురు సభ్యుల వ్యవస్థగా మారింది. ఎన్నికల కమిషనర్లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఉండే జీతభత్యాలు, సర్వీస్ నిబంధనలు వర్తిస్తాయి. ఎన్నికల నిష్పాక్షికతను కాపాడి ఓటు పవిత్రతకు భంగం వాటిల్లకుండా చూడవలసిన అవసరాన్ని గుర్తించి ఎన్నికల సంఘాన్ని ఇంతటి ఉన్నత స్థానంలో ఉంచారు. ఇప్పుడు అందుకు విరుద్ధమైన పరిస్థితులు తలెత్తడం ఆందోళనకరం. ఎన్నికల కమిషన్ ఎంత నిష్పక్షపాతంగా ఉండాలో సుప్రీంకోర్టు అనేకసార్లు విశదీకరించింది. ఇంత ప్రాధాన్యం కలిగిన ఎన్నికల కమిషన్‌కు కమిషనర్లను నియమించే ప్రక్రియ చాలా కాలం పాటు కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లో ఉంది. దానికి స్వస్తి చెప్పేందుకు సుప్రీంకోర్టు సాగించిన ప్రశంసాపాత్రమైన కృషి విఫలమై తిరిగి కేంద్రం గుత్తాధిపత్యానికే దారితీసింది. ఇదే ప్రస్తుత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌ను ఏరికోరి నియమించుకునే అధికారాన్ని మోదీ ప్రభుత్వానికి ఇచ్చింది.

ఎన్నికల కమిషనర్లుగా సీనియర్ ఐఏఎస్‌లను, కేంద్ర కేబినెట్ సెక్రటరీలుగా పనిచేసిన వారిని, ఆ స్థాయి ఇతరులను నియమించేవారు. అందుబాటులోని ఇటువంటివారిలో తమకు ఇష్టులైన వ్యక్తులను సీఈసీలుగా, ఈసీలుగా ప్రధానమంత్రులు సిఫారసు చేయడం, వారిని రాష్ట్రపతి నియమించడం ఆనవాయితీగా చాలాకాలం పాటు కొనసాగింది. అయితే ఈ విధానాన్ని సవాలు చేస్తూ 2015లో రిటైర్డ్ ఐఏఎస్ అనూప్ బరన్వాల్ దాఖలు చేసిన జనహిత వ్యాజ్యం ఈ వ్యవహారాన్ని కీలకమైన మలుపు తిప్పింది. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ, ఎవరి జోక్యానికీ అతీతంగా, పారదర్శకంగా ఉండేలా చూడాలని ఈ పిటిషన్‌లో కోరారు. అప్పటికున్న నియామక విధానం ఎన్నికల స్వచ్ఛతను, నిష్పాక్షికతను హరిస్తున్నదని పిటిషనర్ వాదించారు. వాస్తవానికి ఎలక్షన్ కమిషనర్ల నియామకానికి అనుసరించవలసిన పద్ధతిని నిర్దేశిస్తూ పార్లమెంటు ప్రత్యేక చట్టాన్ని చేయాలని రాజ్యాంగం 342(2) 53(3)(బి)లు సూచిస్తున్నాయి. అటువంటి చట్టం లేకపోవడాన్ని ఆసరా చేసుకుని కేంద్ర పాలకులు ఇంతటి ముఖ్యమైన విషయంలో నిరంకుశంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ కేసును విచారణకు స్వీకరించిన జస్టిస్ కేఎం జోసెఫ్ ఆధ్వర్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2023లో తీర్పు ఇచ్చింది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి తగినవారిని రాష్ట్రపతికి సిఫారసు చేయడానికి ప్రధాని, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)తో ఒక కమిటీని వేయాలని స్పష్టం చేసింది. పార్లమెంటు ఒక చట్టం చేసేవరకు ఈ కమిటీ కొనసాగాలని చెప్పింది.

స్వేచ్ఛతో కూడిన, స్వచ్ఛమైన ఎన్నికలకు నిష్పాక్షిక సీఈసీ అత్యంత అవసరమన్న ధర్మాసనం సందేశానికి విరుద్ధంగా కేంద్రం అతి తెలివిని ప్రదర్శించింది. కమిషనర్లుగా నియామకానికి తగినవారిని సిఫార్సు చేసే కమిటీ నుంచి సీజేఐని తొలగిస్తూ పార్లమెంటు చేత చట్టం చేయించింది. ఈ చట్టం ప్రకారం ప్రధాని, ఒక కేంద్రమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకానికి పేర్లను సిఫారసు చేస్తుంది. ఆ విధంగా కేంద్ర పాలకులు ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో తమ నిరంకుశ నిర్ణయానికి దారి చేసుకున్నారు. ఈ చట్టాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ మధ్యప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జయా ఠాకూర్ 2024 జనవరిలో సుప్రీంకోర్టులో దావా దాఖలు చేశారు. ఆ తర్వాత 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్' దీనిని (ఏడీఆర్) సవాలు చేసింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించింది. కానీ కేంద్ర చట్టంపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది.


పార్లమెంట్‌కు, న్యాయవ్యవస్థకు పోటీ సృష్టించిన ఈ కేసులో చొరవ చూపడానికి సుప్రీంకోర్టు వెనుకాడుతున్నదని, దానివల్ల ఎన్నికలు కేంద్ర పాలకుల చేతిలో మైనపు ముద్దలా తయారై ప్రజాస్వామ్య ధర్మానికి తీవ్ర విఘాతం కలుగుతున్నదని భావించక తప్పడం లేదు. ఇంత పెద్ద దేశంలో ఎన్నికల వ్యవస్థ పాలకుల పంజరంలో చిలుక కావడం దారుణం. దీని ఫలితమే ప్రస్తుత సీఈసీ నిర్వాకం. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేశారు. మరో కమిషనర్ సతీశ్ చంద్ర పాండే అప్పటికే రిటైర్ అయ్యారు. కేంద్రం ఈ సందును ఉపయోగించుకుని జ్ఞానేశ్ కుమార్‌ను, సుఖ్‌వీర్‌సింగ్‌ను ఎన్నికల కమిషనర్లుగా నియమింపజేసింది. ఆ తర్వాత జ్ఞానేశ్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ చేశారు. ఇంతలోగా జస్టిస్ ఖన్నా విచారణ బాధ్యతల నుంచి తప్పుకోవడం, కేసు మరో ధర్మాసనానికి వెళ్లడం జరిగిపోయాయి. దీనితో ఈ కేసు ఇప్పటికీ ఒక కొలిక్కి రాకుండా, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ కేంద్రం నిరంకుశాధిపత్యంలోనే కొనసాగుతున్నది.

సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ తదుపరి సార్వత్రిక ఎన్నికలకు తెరలేవడానికి ముందు వరకు కొనసాగుతారు. ఎన్నికల కమిషనర్లకు సమాన హోదా లేదు, ముగ్గురినీ రాష్ట్రపతే నియమిస్తున్నప్పటికీ సీఈసీని తొలగించడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఉద్వాసన చెప్పే పద్ధతినే అనుసరించవలసి వుండగా, ఎన్నికల కమిషనర్లను మాత్రం సీఈసీ సిఫార్సుల మేరకు తప్పించాల్సి ఉంటుంది. ఇది కమిషనర్లను సీఈసీ చెప్పుచేతల్లో ఉంచుతుంది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి పార్లమెంట్ చేసిన చట్టంపై ఖన్నా ధర్మాసనం స్టే విధించి ఉన్నా, దానిని రద్దు చేసినా ఈ దుస్థితి తొలగి ఉండేది. ఉన్నత న్యాయమూర్తుల నియామకం విషయంలో ప్రభుత్వం పార్లమెంటు ద్వారా నెలకొల్పిన జాతీయ న్యాయ నియామక కమిషన్‌ను కొనగోటితో తొలగించి కొలీజియంను కాపాడుకున్న సుప్రీంకోర్టు ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐని తిరిగి చేర్పించే విషయంలో ఇంతగా వెనుకాడడం దేశ ప్రజాస్వామ్యాన్ని కంపింపజేస్తున్నది. ఇప్పటికైనా అత్యున్నత న్యాయ స్థానం కర్తవ్య స్పృహతో ఈసీల నియామక నిరంకుశ చట్టాన్ని రద్దు చేసి ఎన్నికల సంఘాన్ని జోక్యానికి, చొరబాటుకు వీలులేని దుర్భేద్య వ్యవస్థగా చేస్తుందని ఎదురు చూద్దాం.

▪ **గార శ్రీరామమూర్తి**
సీనియర్ పాత్రికేయులు

విదేశాంగ విధానంలో మోదీ తడబాట్లు!

భారత్-పాక్ మధ్య తానే యుద్ధాన్ని ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముప్పైసార్లు ప్రకటిస్తే, పార్లమెంట్ వేదికగా జరిగిన చర్చలో ప్రధానమంత్రి మోదీ మాటమాత్రమైనా ట్రంప్ వ్యాఖ్యల్ని ఖండించలేదు. దాయాది దేశమైన పాక్ విషయంలో కానీ, మన కశ్మీర్ విషయంలో కానీ భారత్ ఏనాడూ మూడోదేశం జోక్యాన్ని అనుమతించలేదు. అయితే, ఈ విషయంలో మోదీని వాణిజ్యం సాకుగా చూపి ఒప్పించానని ట్రంప్ పదేపదే చెప్పారు. అయితే, ఏ వాణిజ్య అంశం ఆపరేషన్ సిందూర్ ద్వారా పీఓకేను తిరిగి తెచ్చుకునే అవకాశానికి అడ్డంకిగా మారిందో, ఇప్పుడు ఆ వాణిజ్య ప్రయోజనం కూడా దక్కలేదు. మొన్నటి ఆగస్టు 1 నుంచి 25శాతం సుంకంతో పాటు, ఈ నెల 27 నుంచి మరో 25శాతం జరిమానాను కలిపి, మొత్తం 50శాతం సుంకాలను భారత ఉత్పత్తులపై విధిస్తున్నామన్న ట్రంప్ ప్రకటనతో మన దేశ పరిస్థితి రెంటికీ చెడిన రేవడి అయింది. కరోనా భయాలు పోయి వాణిజ్యం గాడిన పడుతున్నదనుకుంటున్న దశలో పులి మీద పుట్రలా ట్రంప్ సుంకాలు దాపురించాయి. ఒకవైపు ఐటీ కంపెనీల లే ఆఫ్‌లు, ఎంఎస్ఎంఈల మూసివేతలు కొనసాగుతుండగానే ఇప్పుడీ అమెరికా వాణిజ్య సుంకాల బరువుతో మన దేశంలో నిరుద్యోగ పరిస్థితి ఎంత పెరుగుతుందో అన్న ఆందోళన కలుగుతున్నది.



అమెరికా సుంకాల యుద్ధం నుంచైనా మోదీ ప్రభుత్వం తీరు మార్చుకోవాలి. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఎకానమీగా మారబోతున్నాం అన్న పేరుతో ప్రజల కష్టాన్ని దొంగిలించడం కన్నా మన ఎగుమతుల కోసం ప్రపంచవ్యాప్తంగా ఇతర మార్కెట్లను సృష్టించి ఆ మార్పులో నిజమైన భాగస్వామ్యాన్ని పొందాలి. విదేశాంగ విధానమంటే వ్యక్తిగత ఇమేజ్ బిల్డ్ చేసుకున్నంత ఈజీ కాదని తెలుసుకోవాలి.

విదేశాంగ విధానం దేశానికి పట్టుగొమ్మలా ఉండాలి. గతంలో కాంగ్రెస్ పార్టీ అలీన విధానంతో ప్రపంచంలోనే భారత్‌కు ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టింది. తొలి ప్రధాని నెహ్రూ విధానంతో ప్రతీ ఒక్కరూ మన దేశాన్ని గౌరవించారు. నాటి ప్రచ్ఛన్న యుద్ధ కాలంలోనూ మన దేశం అటు సోవియట్ యూనియన్‌తో సన్నిహిత సంబంధాలను నెరుపుతూనే ఇటు అమెరికాతోనూ స్నేహ సంబంధాలను కొనసాగించింది. 1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలోనూ అమెరికా తమ భాగస్వామి పాకిస్థాన్ కోసం మన దేశంపై ఎంత ఒత్తిడి తెచ్చినా, నాటి ప్రధాని ఇందిర ఏ మాత్రం లొంగలేదు. మరో కొత్త దేశంగా బంగ్లాదేశ్ ఆవిర్భవించేదాకా యుద్ధాన్ని విరమించేది లేదని తెగేసి చెప్పి సాధించింది. ఆ తర్వాత పోఖ్రాన్‌లో తొలి అణుపరీక్షల సమయంలోనూ అదే తెగువను అమెరికాకు చూపించింది భారత్. పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాక అమెరికా-రష్యాలతో పాటు ప్రపంచ దేశాలతో మన సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయి. అణు పరీక్షలు వద్దని ఆంక్షలు విధించిన అదే అమెరికా 2008లో మన్మోహన్ సింగ్ హయాంలో మనతో అణు ఒప్పందాలు చేసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వాలు విదేశాంగ విధానంలో అనుసరించిన అత్యద్భుత విధానాలు మనకు అందించిన గొప్ప విజయాలు ఇవి.

కానీ గత పదకొండేళ్లుగా బీజేపీ హయాంలోని కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో కొంత గందరగోళంతో వ్యవహరించింది. ఒక దేశాధినేతగా మరో దేశం అంతర్గత ఎన్నికల అంశాల్లో జోక్యం చేసుకోవడం అవసరం లేనిది. కానీ 2019లో అమెరికాలోని హ్యూస్టన్‌లో 'హౌడీ మోడీ' పేరుతో ఏకంగా అగ్రరాజ్య ఎన్నికల్లో ట్రంప్‌కు, ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా మోదీ ర్యాలీతో ప్రచారం నిర్వహించారు. 2020లో గుజరాత్‌లో 'నమస్తే ట్రంప్' పేర ఆయనతో ర్యాలీ చేయించారు. ఇవి వ్యక్తిగత ప్రతిష్ఠకు, తమ పార్టీ బలోపేతానికి పనికొచ్చాయి కానీ, దేశ ప్రయోజనాలకు కాదన్న సత్యం ఇప్పుడు వారికి బోధపడుతున్నది. మరోవైపు బంగ్లాదేశ్, చివరికి శ్రీలంక, మాల్దీవులు సైతం భారత్‌తో వైరి భావనలో ఉన్నాయి.

ఒకవైపు 'మేకిన్ ఇండియా' అనే నినాదాన్ని ఎత్తుకొని, మరోవైపు మార్కెట్లను మన వస్తువులకు మూసేసే విధంగా విదేశాంగ విధానాలు ఉంటే నష్టపోయేది మన ప్రజలే. ఇప్పటికే జీఎస్టీ వసూలుతో కుదేలయిన భారత వస్త్ర పరిశ్రమ ఇప్పుడు అమెరికా సుంకాల పరిధిలోకి రావడంతో పూర్తిగా దిక్కుతోచని స్థితిలో ఉంది. ఆక్వా రైతులు అల్లల్లాడుతున్నారు. మరోవైపు రష్యా చమురు ద్వారా దక్కుతున్న ప్రయోజనం వినియోగదారుడికి చేరడమే లేదు. బ్యారెల్ ముడి చమురు 150 డాలర్లు ఉన్నప్పుడే యూపీఏ ప్రభుత్వం రూ.60కి లీటరు పెట్రోలు అందించింది. ఇప్పుడు 80డాలర్లకు దొరుకుతున్నా రూ.110కి పెట్రోలు కొంటున్నారు సామాన్యులు. మరోవైపు ఈ లాభాలు అంబానీ, అదానీల రిఫైనరీల కోసమే అనే వార్తల్నీ మనం చూస్తున్నాం. ఇదే నిజమైతే అటు విదేశాంగ విధానంలో విఫలమై, ఇటు ఆప్త మిత్రులైన గుజరాతీ వ్యాపారుల కోసం దేశాన్నే తాకట్టు పెట్టే స్థితికి వెళ్లడం మోదీ నియంతృత్వ, అసమర్థ పోకడలకు తార్కాణం.

అమెరికా సుంకాల యుద్ధం నుంచైనా మోదీ, ఆయన ప్రభుత్వం తీరు మార్చుకోవాలి. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఎకానమీగా మారబోతున్నాం అన్న పేరుతో ప్రజల కష్టాన్ని దొంగిలించడం కన్నా మన ఎగుమతుల కోసం ప్రపంచవ్యాప్తంగా ఇతర మార్కెట్లను సృష్టించి ఆ మార్పులో నిజమైన భాగస్వామ్యాన్ని పొందాలి. విదేశాంగ విధానమంటే వ్యక్తిగత ఇమేజ్ బిల్డ్ చేసుకున్నంత ఈజీ కాదని తెలుసుకోవాలి.

• **పున్నా కైలాస్ నేత**
జనరల్ సెక్రటరీ, టీపీసీసీ

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నదెవరు?

దేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పరిస్థితిని అంచనా వేయడానికి 1978–80లో నాటి ప్రభుత్వం మండల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ సిఫారసులను వ్యతిరేకిస్తూ అద్వానీ కమండల్ రథయాత్ర చేపట్టారు. ఈ యాత్ర వెనుక ఉన్నదెవరో బీసీలకు తెలియదనుకోవడం బీజేపీ భ్రమ. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన రెండు (1.విద్యా, ఉద్యోగాలలో, 2. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు) బీసీ బిల్లులకు అసెంబ్లీలో బీజేపీ మద్దతు ఇచ్చింది. కానీ పార్లమెంటులో మాత్రం మద్దతు ఇవ్వకుండా, 9వ షెడ్యూల్‌ను సవరించడానికి అవకాశం లేదంటూ ద్వంద్వ నాటకాలు ఆడుతోంది. ఇది అమిత్ షా ఆడిస్తున్న డ్రామా. నిజంగా బీసీలపై బీజేపీ సానుకూలంగా ఉంటే ప్రస్తుత పరిస్థితుల్లో 9వ షెడ్యూల్‌ను సవరించే అవకాశం ఆ పార్టీయే తీసుకోవాలి. అది కుదరనప్పుడు బీజేపీ నియమించిన గవర్నర్ చేత బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్సును తీసుకురావాలి. ఇప్పటికే ఈ అంశమై రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఒక విప్లవ జ్యోతిని రగిలించారు.

బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే ఉద్దేశం బీసీ అని చెప్పుకుంటున్న ప్రధానికి, బీజేపీకి లేదు. మండల్ కమిషన్ సిఫారసుల అమలు గురించి చెబుతూ 7, ఆగస్టు 1990లో నాటి ప్రధాని వీపీ సింగ్ పార్లమెంట్‌లో ఒక చరిత్రాత్మక ప్రకటన చేశారు. ఇది అగ్రకులాలకు, బీజేపీకి మింగుడుపడలేదు. ఈ వ్యతిరేకతతో మూడు నెలల్లోనే వీపీ సింగ్ ప్రభుత్వాన్ని బీజేపీ పడగొట్టింది. తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీలందర్నీ కాంగ్రెస్ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. కానీ దాన్ని విచ్ఛిన్నం చేసేందుకు 'హిందూ బీసీలు, మైనార్టీ బీసీలు వేరు వేరు' అంటూ కులాన్ని, మతాన్ని బీజేపీ వేరు చేసి చూపిస్తున్నది. బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లలో మాత్రమే కులాలు, మతాలు వేరు కనిపిస్తున్నాయా? ముస్లింలు మనుషులు కారా! మరి హిందూ మతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి, క్రిస్టియన్ మతంలో చేరిన అవే కులాలకు రిజర్వేషన్లు ఇస్తున్నప్పుడు, ముస్లింలలో ఉన్న పేదలకు రిజర్వేషన్లు ఇస్తే తప్పేంటి?

రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎన్నోసార్లు దాన్ని సవరించారు. ప్రతి ప్రభుత్వమూ ఓట్ల కోసం ఈ విధానాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంది. 50 శాతం పరిమితి దాటి 60 శాతం రిజర్వేషన్లు దేశంలో అమలవుతాయని 2019లో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వానికి, సుప్రీంకోర్టుకు తెలియదనుకోవాలా? ఓబీసీలకు ఒక న్యాయం, అగ్రకులాలకు ఒక న్యాయం ఉంటుందా? ఇదెక్కడి ప్రజాస్వామ్య తీర్పు? ప్రధాని మోదీ మాత్రం తన కులాన్ని ఓసీ నుంచి బీసీగా మార్చుకోవచ్చు కానీ, అసలైన హిందూ ఓబీసీలకు మాత్రం విద్యా ఉద్యోగ, రాజకీయాలలో రిజర్వేషన్లు ఇవ్వరా?! బీసీ, ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బీజేపీ చిత్తశుద్ధితో సహకరించాలి. లేదంటే మున్ముందు ఆ పార్టీకి రాష్ట్రంలో రాజకీయ మనుగడే ప్రశ్నార్థకమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

– **మండ్ల రవి**

హాస్యానికి 'శంకు' తీర్థం!

ప్రముఖ కార్టూనిస్ట్, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్, బుల్లితెర సీరియల్స్ డైరెక్టర్ శంకు మరణం కార్టూన్, టీవీ రంగాలకు తీరని లోటు. బాల్యం నుంచే చిత్రలేఖనం మీద ఆసక్తి ఉన్న శంకు పూర్తి పేరు సంపర భీమ శంకర్ కుమార్. ఆయన సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు. 1946 డిసెంబర్ 16న తెనాలిలో జన్మించారు. తండ్రి సంపర రామచంద్రారావు, తల్లి ప్రభావతి. ఐదుగురు సంతానంలో శంకర్ కుమార్ పెద్దవాడు. ఐదో తరగతి చదువుతున్న సమయంలోనే శంకర్ కుమార్‌కు వడ్డాది పాపయ్య బొమ్మల పట్ల ఆసక్తి కలిగింది. ఆ తర్వాత బాపు రేఖాచిత్రాలు చూసి తానూ కార్టూనిస్ట్ కావాలనుకున్నారు. బాపు కార్టూన్లను సేకరించి, ఓ పుస్తకంలో అంటించుకుని వాటిని ప్రాక్టీస్ చేస్తూ కార్టూన్లు గీయడం మొదలు పెట్టారు. శంకర్ కుమార్ గీసిన తొలి కార్టూన్ 1962లో ఆంధ్ర సచిత్ర వార ప్రతికలో ప్రచురితమైంది. అలా మొదలైన ప్రయాణం 2025 ఆగస్టు 24వ తేదీన శంకు తుదిశ్వాస విడిచే వరకూ కొనసాగుతూనే ఉన్నది. అంటే కార్టూనిస్ట్‌గా ఆయనది 63 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానం.

కుమార్, శంకర్ కుమార్ పేర్లతో కార్టూన్లు గీస్తున్న సమయంలోనే ఆంధ్రజ్యోతి వారపత్రికలో పనిచేస్తున్న పురాణం సుబ్రహ్మణ్యం శర్మ 'శంకర్ కుమార్' పేరులో మొదటి రెండు అక్షరాలైన 'శం.కు'ను తీసుకుని కలం పేరుగా మార్చుకోమని సలహా ఇచ్చారు. అలా 1970 నుంచి శంకర్ కుమార్ 'శంకు'గా మారిపోయారు. తెలుగుతో పాటు వివిధ భాషల్లోని పత్రికల్లో ఆయన కార్టూన్లు ప్రచురితమయ్యాయి. పలు వారపత్రికలకు ముఖచిత్ర కార్టూన్లూ గీశారు. అప్పట్లో పలు పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో బహుమతి పొందిన కథలకు ఆయన ఇల్లస్ట్రేషన్స్ గీశారు. కొన్ని దిన, వార పత్రికల్లో కార్టూన్ ఫీచర్స్ నిర్వహించారు.

ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే తెలుగు కార్టూనిస్టులను ఏకతాటి పైకి తెచ్చేందుకు విశేష కృషి చేశారు శంకు. అప్పటి లబ్ధ ప్రతిష్ఠులైన కార్టూనిస్టుల సలహాతో 1976లో ఖమ్మంలో తొలి తెలుగు కార్టూనిస్టుల సమావేశాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఏపీ క్రోక్విల్ అకాడమీని స్థాపించి, క్రోక్విల్ మేగజైన్‌ను తీసుకొచ్చారు. ఆ తర్వాత దాని పేరును 'క్రోక్విల్ హాస్యప్రియ'గా మార్చారు. పుష్కర కాలం పాటు ఇది మాస పత్రికగా, మరికొంతకాలం పక్ష పత్రికగా వచ్చింది. ఈ పత్రిక ద్వారా కార్టూనిస్టులనే కాకుండా హాస్య రచయితలను సైతం ప్రోత్సహించారు. మద్రాస్‌లో ఉండే డాక్టర్ జయదేవ్ బాబుతో వినూత్నమైన శీర్షికలను నిర్వహించి, కొత్త కార్టూనిస్టులను ప్రోత్సహించారు. కార్టూన్లు గీయడంలో మెళకువలను తెలియచేయడంతో 1980, 90లలో వందలాది మంది యువకులు కార్టూనిస్టులుగా మారిపోయారు. వారందరి తొలి కార్టూన్లు 'హాస్యప్రియ'లోనే ప్రచురితమయ్యాయంటే అతిశయోక్తి కాదు. అందుకే ఆనాటి కార్టూనిస్టులు 'శంకు'లో పోసిన తీర్థంగా తమ కార్టూన్లను చెప్పుకునేవారు. వీరందరినీ పరిచయం చేస్తూ 1984లో తెలుగు కార్టూనిస్ట్ డైరెక్టరీని ప్రచురించారు శంకు.

కుమార్, శంకర్ కుమార్ పేర్లతో కార్టూన్లు గీస్తున్న సమయంలోనే ఆంధ్రజ్యోతి వారపత్రికలో పనిచేస్తున్న పురాణం సుబ్రహ్మణ్యం శర్మ 'శంకర్ కుమార్' పేరులో మొదటి రెండు అక్షరాలైన 'శం.కు'ను తీసుకుని కలం పేరుగా మార్చుకోమని సలహా ఇచ్చారు. అలా 1970 నుంచి శంకర్ కుమార్ 'శంకు'గా మారిపోయారు. కార్టూనిస్ట్‌గా ఆయనది 63 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానం.



కార్టూనిస్టులను ప్రోత్సహించడంతో ఆగిపోకుండా డీడీ నేషనల్ కోసం శంకు 1999లో 'ఎమినెంట్ కార్టూనిస్ట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో దేశంలోని 13 మంది ప్రముఖ కార్టూనిస్టులపై డాక్యుమెంటరీని తీశారు. ఇది అనేకసార్లు దూరదర్శన్‌లో ప్రసారమైంది. దాంతో డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్‌గా ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆ ఉత్సాహంతోనే 2006లో ముని మాణిక్యం నరసింహారావు 'కాంతం కథలు'ను, సత్యం శంకరమంచి 'అమరావతి కథలు'ను ధారావాహికగా తీసుకొచ్చారు. ప్రముఖ దర్శకుడు వంశీ రాసిన 'మా పసలపూడి కథలు'ను, సలీం కథలను కూడా సీరియలైజ్ చేశారు. దీనితో పాటు 'మహదానందం', 'కాదంబరి', 'హాస వికాసం' వంటి సీరియల్స్ నిర్మించారు. ఇవన్నీ చక్కని ఆదరణ పొందాయి. దీంతో ఏకంగా శంకు తొమ్మిది నంది అవార్డులను అందుకున్నారు. శంకు రాసిన తొమ్మిది కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 1992లో నాకీస్ట్ అంతర్జాతీయ కార్టూన్ల పోటీలో అవార్డుకు ఎంపికయ్యారు. ప్రభుత్వ సహకారంతో బెల్జియం వెళ్లి స్వయంగా దానిని స్వీకరించారు. తెలుగు ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్‌గానూ సేవలు అందించారు. 'ఈ కార్టూన్లు మీవే' పేరుతో కలర్‌లో శంకు కార్టూన్ల సంకలనాన్ని తీసుకొచ్చారు.

ప్రముఖ దర్శకుడు బాపుతో ఉన్న సాన్నిహిత్యంతో శంకు ఆయన దర్శకత్వం వహించిన దాదాపు తొమ్మిది చిత్రాలకు సహాయకుడిగా పనిచేశారు. రాజేంద్రప్రసాద్, ఆమని జంటగా నటించిన 'మిస్టర్ పెళ్లాం' సినిమాకు సహ నిర్మాతగా వ్యవహరించారు. 'అల్లరికం' పేరుతో ఓ సినిమా స్క్రిప్ట్ రాసి, రేలంగి నరసింహారావు దర్శకత్వంతో దాన్ని తెరకెక్కించే ప్రయత్నం చేశారు. ప్రతిరోజూ తన స్నేహితులకు, సన్నిహితులకు తాను గీసిన కార్టూన్లను వాట్సప్ ద్వారా, శుభోదయ సందేశంగా పంపడం శంకుకు అలవాటు. ఎనభై ఏళ్ళు సమీపిస్తున్నా నిత్య చైతన్యశీలిగా ఉంటూ, ఉభయ తెలుగు రాష్ట్రాలలోని కార్టూనిస్టులకు గురువుగా, మార్గదర్శిగా వ్యవహరించారు.

చిత్రం ఏమిటంటే– కార్టూనిస్ట్ వాడ్రేవు శ్రీనివాసరావు డీడీ యాదగిరి ఛానెల్‌లోని 'కార్టూన్ కబుర్లు' ప్రోగ్రామ్ కోసం శంకును ఇటీవల ఇంటర్వ్యూ చేశారు. ఆగస్ట్ 23 ఉ.9.00గంటలకు ఇది ప్రసారమైంది. దీన్ని చూసిన వారంతా ఆ తర్వాత 24 గంటలు గడవకముందే శంకు తనువు చాలించారంటే నమ్మలేకపోయారు. శంకు భౌతికంగా దూరమైనా ఆయన కార్టూన్ రంగానికి చేసిన సేవ చిరస్మరణీయం.

◆ **ఓనావ**
కార్టూనిస్ట్

సురవరా.. సకల జనవరా...

ప్రతి దేశానికి ఒక జాతీయ జెండా ఉంటుంది
కానీ, దేశ దేశాల పీడితులకు మాత్రం
ఎర్ర జెండానే!
ఈ దేశపు ఎర్రజెండా సురవరం

సురవరం ప్రతాపరెడ్డి అంటే
గోలకొండ, ఆంధ్రుల సాంఘిక చరిత్ర
సురవరం సుధాకర్ రెడ్డి అంటే
ఎగరేసిన ఎర్రజెండా చరిత్ర

ఎట్టి చాకిరీపై తిరగబడుతున్నప్పుడు
ప్రాణం పోసుకున్నాడు
దేశానికి ఏ స్వాతంత్ర్యం లేనప్పుడు
కళ్ళు తెరిచినోడు

మాకింకా స్వాతంత్ర్యం రాలేదని
కలబడుతున్నోళ్ళ పక్కన నిలబడి
కన్నుమూసే దాకా కలబడ్డోడు
వీర తెలంగాణ పోరు కళ్ళజూసి
తన చూపును
విముక్తిదిశగా మళ్ళించినవాడు



సురవరం
నీ స్వరంలో వున్నదేమో భాస్వరం
నువ్వు గొంతెత్తి మాట్లాడుతుంటే
యుద్ధ శతఘ్నులు పేలినట్లు ఉండేది


మా బుగ్గలను ఎరుపెక్కించిన
సురవరా, సకల పీడిత జనవరా

నోరులేనోళ్లకు శ్వాసవై
నిలువలేనోళ్లకు అండవై
మా విముక్తి దేశానికి స్వాతంత్ర్యం అని
కంచు కంఠం పగిలేలా వినిపించిన
సురవరం నువ్వు లేవంటే
గుండె కలుక్కుమంటుండే

సురవరానికి ఎర్ర ఎర్రని లాల్ సలాం
తనను తాను పీడిత దేశానికే
అంకితం చేసుకున్నోడికి
అరుణారుణ సలాం

– **జూలూరు గౌరీశంకర్**

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
మంగళవారం 26 ఆగస్టు 2025





బీజేపీది దొంగ ఓట్ల రాజకీయం

- వాటితోనే రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు గెలిచారు
- పేదోడికి న్యాయం చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వడం లేదు
- బీసీ రిజర్వేషన్లపై నాటకాలు ఆడుతున్నారు
- పౌరుషాల గడ్డకు రావడం సంతోషంగా ఉంది
- టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్
- వర్ధన్నపేటలో హోరెత్తిన 'జనహిత పాదయాత్ర' సభ
- హాజరైన మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు


వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో జనహిత పాదయాత్రలో పాల్గొన్న మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్

వర్ధన్నపేట రూరల్/వర్ధన్నపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లు నుండి తొలి, మేటి నక్సలైట్లు వచ్చారని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. వరంగల్ జిల్లా రాజకీయాలకు అడ్డా, పౌరుషాల గడ్డకు నిదర్శనమని స్పష్టంచేశారు. కాంగ్రెస్ జనహిత పాదయాత్ర సందర్భంగా వర్ధన్నపేటలోని అంబేడ్కర్ సెంటర్‌లో జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావు అధ్యక్షతన సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. 'కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఫలితం.. మీ ఉత్సాహంలో తెలుస్తోంది... పేదల జీవితాల్లో సొంతింటి కళ కనపడుతోంది.'. అని అన్నారు. రేషన్ కార్డులు పదేండ్ల కాలంలో కేసీఆర్ ఎవరికి ఇవ్వలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ దేశంలో ఎన్నో పార్టీలు పాదయాత్రలు చేశాయన్నారు. పదేండ్లు కేసీఆర్ అడుగడుగున మోసం చేసి ఇంటికి వెళ్లి ఫాంహౌస్‌లో కూర్చున్నాడని, దోచుకున్న సొమ్మును ఇవ్వమంటే సుప్రీం కోర్టుకు వెళ్లాడని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో కనుమరుగవుతోందని, అన్నాచెల్లెల మధ్య వార్ నడుస్తోందన్నారు. బీజేపీ మూడో సారి దేశంలో అధికారంలోకి రావడానికి రాహుల్ గాంధీ ఓట్ల చోరీ జరిగిందని సాక్షాలతో నిరూపిస్తే విచారించకుండా ఎన్నికల కమీషన్ నరేంద్ర మోదీకి వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. ముంబయిలోని ఓ ఇంట్లో 49 ఓట్లు ఉండొచ్చా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో గెలిచిన ఎంపీ సీట్ల వెనక కుట్ర ఉందని, మాకు అనుమానం ఉందని, కుండబద్దలు కొట్టి దాని పై చెప్తున్నామని విమర్శించారు. తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, తెలంగాణలో గెలిచిన బీజేపీ అభ్యర్థుల పట్ల అనుమానాలు ఉన్నాయన్నారు. ఓట్లు దొంగిలించే సంస్కృతి, ఎప్పుడు అధికారంలో ఉండాలని బీజేపీ పార్టీ, ప్రధానమంత్రి

(మిగతా 7వ పేజీలో...)


ఇల్లందలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎర్రబెల్లి స్వర్ణ

మాది పేదల ప్రభుత్వం : ప్రభుత్వ సలహాదారుడు వేం

పేదోని పక్షాన ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజాదరణ వస్తున్న ప్రభుత్వం మనదేనని ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి అన్నారు. ప్రజల వద్దకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలను తెలుసుకోవడానికి వచ్చారని గుర్తు చేశారు. రూ. 70వేల కోట్లు రైతాంగానికి ఖర్చు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్వంగా చెప్పుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ఉన్నాయని తెలిపారు. జనహిత పాదయాత్ర ఉద్దేశమే ప్రభుత్వ పథకాల తీరును గుర్తు చేయడానికని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్రపతి భవన్ వరకు కొట్లాడుతున్నామని స్పష్టం చేశారు. ప్రజల వద్దకు వచ్చిందే మన ప్రభుత్వ కార్యక్రమాలు తెలియచేయాలన్నారు.

వర్ధన్నపేటలో అభివృద్ధి నిల్ : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట నియోజకవర్గంలో పదేండ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆరోపించారు. కాంగ్రెస్ నినాదమే మన కర్తవ్యమని తప్పకుండా అందరూ కాంగ్రెస్ పార్టీ కోసం కార్యకర్తలుగా పనిచేయాలన్నారు. కార్యకర్తలు తనను క్షమించాలని పోలీసులు వారి పని చేశారని, సెక్యూరిటీ పరంగా వారు చేసిన పనులను తప్పుగా భావించకూడదని సూచించారు. వర్ధన్నపేటకు రూ. 200 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరినీ భుజస్కందాల పై వేసుకుని గెలిపిస్తానని తెలిపారు. రైతులకు కాపాడుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీయని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఓట్ చోరీ ఎలా జరిగిందో స్పష్టం చేశారని, బీజేపీ దొంగలు ఓట్లను చోరీ చేశారని ఆరోపించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి కాకుండా చేశారని, మతతత్వ పార్టీని పొలిమేరలకు కూడా రానివ్వద్దని, ఆ పార్టీని తరిమి కొడతామని హెచ్చరించారు. కల్వకుంట్ల కుటుంబం మాత్రమే తెలంగాణలో బాగుపడ్డదని ఆరోపించారు.


వర్ధన్నపేట కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ నేతల అభివాదం


వర్ధన్నపేట కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు



యాత్ర ద్వారా ప్రజల చెంతకు...
మంత్రి కొండా సురేఖ

గతంలో అధికార పార్టీలో ఉన్నవారు ఎవరు పాదయాత్ర చేయలేదని, కానీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉండికూడా పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని తెలంగాణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం కోసం ఎన్నో కార్యక్రమాలు ఈ ప్రభుత్వం తీసుకుంటుందని గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన ప్రభుత్వ పథకాలను తీసుకెళ్తేనే మన పార్టీ గెలుస్తుందని కార్యకర్తలకు సూచించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలుగా గెలవాలంటే ప్రజల్లో మన ప్రభుత్వ కార్యక్రమాలు తీసుకెళ్లాలన్నారు.





స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి..
రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

వర్ధన్నపేట రూరల్/వర్ధన్నపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఏఐసీసీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. కార్నర్ మీటింగులో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అర్హులైన వారందరికీ ఇచ్చే విధంగా పనిచేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకు పోతుందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నారని, ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తున్నారన్నారు. పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరిచి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించే దిశగా కార్యకర్తలు పనిచేయాలన్నారు.

భద్రకాళి గర్భాలయానికి మరమ్మతు



అమ్మవారి గర్భాలయంపై కురువకుండా మరమ్మతులు చేసిన దృశ్యం

వరంగల్ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో భద్రకాళి అమ్మవారి గర్భాలయం కు రుస్తున్న వైనంపై 'కురుస్తున్న గర్భాలయం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ధర్మకర్తలు స్పందించారు.ధర్మకర్త గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి స్పందించి అమ్మవారి భక్తుడు శ్రీనివాస్‌చేత మరమ్మతులు చేయించారు. దాదాపు రూ.2లక్షలకు పైగా ఖర్చు అయినట్లు తెలిసింది. గతంలో అధికారులు మరమ్మతుల కోసం రూ.4 లక్షలకు పైగా డబ్బులు చెల్లించినట్లు సమాచారం. కాని కాంట్రాక్టర్ ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో నిధులు ఎటు పోయాయో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఈ సమస్యను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని చెప్పినా స్పందన కానరాలేదు. గత శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున గర్భాలయంపై నుంచి బాగా కురవడంతో 'ఆంధ్రజ్యోతి' ఈ సమస్యను బహిర్గతం చేయడంతో ధర్మకర్తలు స్పందించి చర్యలు తీసుకున్నారు.

సెంట్రల్ జైలు టైపిస్టు సస్పెన్షన్

మామునూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా కేంద్ర కారాగారంలో టైపిస్టుగా పనిచేస్తున్న మజార్ హుస్సేన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. జిల్లా సబ్ జైలు కార్యాలయంలో పనిచేస్తున్న సయ్యద్ మసూద్ అనే వ్యక్తికి ప్లాట్ అమ్ముతానని చెప్పి రూ.9 లక్షలు అడ్వాన్స్ తీసుకుని ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితుడు సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మజార్ హుస్సేన్ పై కేసు నమోదైంది. దాని ఆధారంగా సోమవారం విధుల నుంచి తొలగించినట్లు వరంగల్ జిల్లా కేంద్ర కారాగారం ఇన్‌చార్జి సపరింటెండెంట్ సంపత్ తెలిపారు.

ఓం గం గణపతయే నమహః

రేపటి నుంచే నవరాత్రి వేడుకలు


- వాడ వాడలా మండపాల సందడి
- తొమ్మిది రోజుల పాటు పూజలు, అన్నదానాలు




వరంగల్‌లో సిద్ధమవుతున్న మట్టి గణనాథులు



వరంగల్ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మొదటి పూజలందుకునే వినాయకుడు, విఘ్నాలనుబాపే గణనాథుడు, పార్వతీ పుత్రుడు, భక్తులకు సులభుడు, లంబోధరుడు, సర్వసిద్ధి వినాయకుడు గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పూజలందుకోవడానికి సిద్ధమయ్యాడు. జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రిఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ నెల 27న బుధవారం గణేశ్ చతుర్థి వేడుకలు ప్రారంభం అవుతున్నాయి. పండుగ సందర్భంగా పూజ సామానులు, మండపానికి డెకరేషన్ సామానులు, లైటింగ్ అమ్మకాలు కొనసాగాయి. వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, అండర్‌బ్రిడ్జి, బట్టల బజార్, పాపయ్యపేట చమన్, ఎంజీఎం సెంటర్, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ ప్రాంతాలలో అలరించే రంగుల్లో గణపతులు సిద్ధంగా ఉన్నారు.


వరంగల్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

తొమ్మిది రోజుల పాటు

ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4 వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు. వినాయక మండపాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోంది. ఈ మేరకు జీవో జారీ చేసింది. దీంతో ఉత్సవ కమిటీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మండపాల వద్ద ప్రతీ రోజు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, హోమాలు, అన్నదానాలు, భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మండపాలను అందంగా తీర్చి దిద్దడానికి జెండాలు, లైట్లు, కాషాయ వస్త్రాలు, పూల దండలు, తదితర అలంకరణ సామానులు విక్రయించే దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. బట్టల బజార్, పిన్నవారి వీధిలో బిజీగా కనిపించాయి. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టిగణపతులనే ఏర్పాటు చేయాలని పర్యావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. రంగుల వినాయక విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు దృష్ట్యా ఇళ్లల్లో కాని, మండపాల్లో గాని మట్టి గణపతులనే ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

అసభ్యకర ప్రవర్తన.. ఏడాది జైలు

వరంగల్ లీగల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రావణ స్వాతి సోమవారం తీర్పు చెప్పారు. కాజీపేట బోడగుంట ప్రాంతానికి చెందిన ఓ మహిళ... అదే ప్రాంతానికి చెందిన యాకూబ్ పాషాకు రూ. 2 లక్షల 50 వేలు అప్పుగా ఇచ్చింది. ఆ తర్వాత తనకు అవసరం ఉన్నాయని డబ్బులు తిరిగి ఇవ్వాలని ఎన్ని సార్లు అడిగినా వాయిదా వేశాడు. ఈ క్రమంలో తాను అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలని యాకూబ్‌పాషా ఇంటికి వెళ్లి అడిగింది. దీంతో తన ఇంటికొచ్చి తననే డబ్బులు అడుగుతావా అంటూ ఆమె జుట్టు పట్టుకొని అనుచితంగా, అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో మహిళ ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి ఏడాది జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కాగా, దర్యాప్తు అధికారులుగా ఎస్సై నాగేశ్వర్‌రావు, సీఐ కిషన్ వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. దుర్గాబాయి కేసు వాదించారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి..

'ప్రజావాణి'లో కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దని సంబంధిత అధికారులను కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంట వరకు నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 177 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారిని పిలిచి సమస్యను ఎంక్వైరీ చేసి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, డీఆర్‌డీవో పీడీ మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్డీఓలు నారాయణ, రాథోడ్ రమేష్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కమీషన్ డబ్బులు చెల్లించాలి

రాష్ట్రంలోని రేషన్‌డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు మొత్తం 5నెలల కమీషన్ డబ్బులు వెంటనే చెల్లించాలని రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు బత్తుల రమేష్‌బాబు ఆధ్వర్యంలో రేషన్‌డీలర్లు జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన రూ.5వేల గౌరవ వేతనం, కమీషన్ పెంపు వెంటనే ప్రకటించాలన్నారు. రేషన్ డీలర్ల ఆవేదనను తెలిపేందుకు సెప్టెంబరు 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా బంద్ పాటిస్తున్నామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు పోతరాజు రమేష్, బత్తుల మహేష్, కొలిపాక రాజసాంబయ్య, నిర్మలబాబు తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

సర్టిఫైడ్ కాపీ ఇప్పించండి

భీమారం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 494లోఉన్న తన భూమిని పోగుల సారయ్య అతడి కుమారుడు నరేందర్ ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, మా భూమిని కాపాడి మాకు సర్టిఫైడ్ కాపీ ఇప్పించాలని నమిండ్ల కృప తన కూతురు కల్పనతో కలిసి కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఫిర్యాదు చేశారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్‌లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేల ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి ఆశావర్కర్లు ధర్నాగా కలెక్టరేట్ వరకు వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్1వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు రమేష్, ఆశా యూనియన్ జిల్లా నాయకులు కె. పద్మ, సీహెచ్ రాజేశ్వరి, యాకుబి, శోభ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బెయిల్ నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తి అరెస్టు


సైబర్ నేరస్తుడు సంజీత్‌కుమార్

వరంగల్ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బెయిల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రతీ ఆదివారం సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు హాజరుకాని ఉత్తరప్రదేశ్‌కు చెంది న సంజీత్‌కుమార్ సింగ్‌ను అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు పరకాల సబ్‌జైలుకు తరలించినట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ డీఎస్పీ గిరికుమార్ తెలిపారు. తిరుమల హాచరిస్‌లో పనిచేసే మేకల శ్రీనువాస్‌ను 2025 సంవత్సరం మార్చి నెలలో మోసం చేసి సంజీత్‌కుమార్ డబ్బులు లూటీ చేయగా శ్రీనువాస్ ఫిర్యాదు మేర కు వరంగల్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ మేరకు సం జీత్‌కుమార్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించగా షరతులతో కూడిన బెయిల్‌పై బయటికి వచ్చాడు. షరతులను దిక్కరించడంతో ఈ నెల 3న కోర్టులో మెమో వేయడంతో 19 అరెస్టు చేయాలని ఆదేశించింది. ఈ మురకు 24న ఆదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు పరకాల సబ్‌జైలుకు తరలించామన్నారు. కాగా, బెయిల్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిని తిరి గి జైలుకు పంపించేలా చర్యలు తీసుకున్న డీఎస్పీ గిరికుమార్ ను టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ అభినందించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

మడికొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మడికొండ స్పెషల్ యూనిట్ నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. ఎన్నికల అధికారి గోపాల్‌రావు సమక్షంలో స్థానిక టీఎన్‌జీవోస్ కాలనీలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పెట్టెం సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.అశోక్, కోశాధికారిగా సోమేశ్వర్, అసోసియేట్ అధ్యక్షులుగా రమాజ్యోతి క్రిష, ఉపాధ్యక్షులుగా రాజయ్య, మహబూబి, సంయుక్త కార్యదర్శిగా యాదగిరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రకాశం, పబ్లిసిటీ కార్యదర్శిగా వెంకటాద్రి, జిల్లా కౌన్సిలర్‌గా బగులారెడ్డి, నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

199 మందికి ఎస్‌ఏలుగా పదోన్నతులు

● వరంగల్‌లో 95, హనుమకొండలో 104 మందికి..

● 68 పోస్టులకు అర్హులే లేరు..

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వివిధ కేటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందుతున్న ఎస్జీటీ ఉపాధ్యాయుల లెక్క తేలింది. వరంగల్ జిల్లాలో 130 పోస్టులు ఖాళీలు ఉండగా హనుమకొండ జిల్లాలో 137 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. సోమవారం రాత్రి వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఇచ్చారు. దీంతో పాటు అర్ధరాత్రి వరకు ఆప్షన్లను మార్చుకునే అవకాశాన్ని కల్పించారు. మంగళవారం ఉదయానికల్లా వివిధ కేటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన ఎస్జీటీలకు ఉత్తర్వులు అందనున్నాయి. ఎస్జీటీలకు పదోన్నతుల ప్రక్రియలో భాగంగా రూపొందించిన ఖాళీలలో అర్హత లేక కొన్ని పోస్టులు ఖాళీలుగా మిగిలిపోనున్నాయి. కొన్ని కేటగిరీల్లో సరైన అర్హతగల ఎస్జీటీలు లేకపోవడంతో అవి ఖాళీలుగానే మిగిలిపోనున్నాయి. వరంగల్ జిల్లాలో మొత్తం 130 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉండగా ప్రస్తుతం చేపడుతున్న పదోన్నతుల్లో 95 మంది ఎస్జీటీలు మాత్రమే వివిధ కేటగిరీల్లో అర్హత సాధించి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందనున్నారు. 35 పోస్టులు ఖాళీలుగానే ఉండనున్నాయి. ఇక హనుమకొండ జిల్లాలో 137 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉంటే 104 మంది మాత్రమే అర్హత సాధించి వివిధ కేటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందనున్నారు. 33 పోస్టులు ఖాళీలుగానే ఉండనున్నాయి. ఈ పదోన్నతుల ప్రక్రియ మంగళవారంతో ముగియనున్నది.

‘ప్రజావాణి’ ఫిర్యాదులపై అలసత్వం తగదు

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

● 88 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం తగదని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కరించాలని ఆయా విభాగాల ఉన్నతాధికారులకు కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. నగంరలో శానిటేషన్ సమస్య చాలా చోట్ల కనిపిస్తుందని ప్రజలు ఫిర్యాదులు అందుతున్నాయని ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రధానంగా శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగాలపై ప్రతీ వారం తరుచుగా ఫిర్యాదులు అందుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు రిపీట్ కాకుండా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా విభాగం సిబ్బంది దోమలపై స్పెషల్ డ్రైవ్ చేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 88 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, వెటర్నరీ అధికారి గోపాల్‌రావు, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డితో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ - 34 హెల్త్, శానిటేషన్ - 6, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 1, టౌన్‌ప్లానింగ్ - 45, మంచి నీటి సరాఫరా - 2 ఇలా మొత్తం 88 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

● గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలో అమర్‌నాథ్ అనే వ్యక్తి 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నాడు. దీనిపై తమ కాలనీవాసులు పిలిచి సదరు వ్యక్తిని నిలదీయగా అసభ్య పద జాలంతో దాడి చేసేందుకు వస్తున్నాడు. కార్పొరేషన్ అధికారులు ఆక్రమిత రోడ్డు ను గుర్తించి కాలనీ ప్రజలకు న్యాయం చేయాలని స్థానికులు ఫిర్యాదు చేశారు.

● గ్రేటర్ 2వ డివిజన్ వంగపహాడ్ లో రాజ్‌కుమార్ అనే రియల్టర్ గ్రామ శివారులోని సుమారు రూ. 3 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా చేసి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నాడు. గ్రామ ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ భూమి విక్రయిస్తున్న వ్యక్తిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన అరికిల్ల సుమన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

● వరంగల్ 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్‌తోట కరీమాబాద్‌లో చాలా కాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. దీనిపై గతంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

● హనుమకొండ కాపువాడలో స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా తమ కాలనీకి రెండు రోడ్లు ఆర్-2, ఆర్-3 (మట్టి రోడ్లు) వేసి ఐదు సంవత్సరాలు అవుతుంది. కానీ ఇప్పటి వరకు పూర్తి స్థాయి సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరారు.


శాస్త్ర చికిత్స చేసి బిడ్డను తీస్తున్న వైద్యులు

ప్రభుత్వ ఆస్పత్రిలో మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ ప్రసవం

వర్ధన్నపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ అంగోత్ అరుణ సోమవారం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శిశువు 3 కిలోల బరువుతో ఆరోగ్యంగా, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి ఆధ్వర్యంలో సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ పూర్ణిమ, ఆనస్థీసియా డాక్టర్‌లు విద్య, పంకజ్‌కుమార్, వోటీ స్టాఫ్ శంకర్, సలీం, భాస్కర్, సిస్టర్ రెహానా, కౌసర్, సుభద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం


శిశువును చూపుతున్న 108 సిబ్బంది

పర్వతగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన గౌరారపు ప్రభ 108 అంబులెన్స్‌లో సోమవారం తెల్లవారు జామున 2 గంటలకు ప్రసవించింది. పురిటినొప్పులు రావడంతో 108లో వరంగల్ సీకేఎం ఆస్పత్రికి తరలిస్తుండగా నక్కలపల్లి గ్రామ శివారులో ప్రసవం కాగా, రెండవ కాన్పులో మగ బిడ్డ పుట్టినట్లు ఈఎంటీ శ్యాంసుందర్, పైలెట్ రమేశ్ తెలిపారు. తల్లి, బిడ్డను సీకేఎం హాస్పిటల్‌లో అడ్మిట్ చేసినట్లు వారు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కుకు బస్సు సర్వీస్

ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


టెక్స్‌టైల్‌పార్కులో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న రేవూరి, కలెక్టర్

గీసుగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గీసుగొండ, సంగెం మండలాల పరిధిలో శాయంపేట హవేలి శివారులో నిర్మిస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కలెక్టర్ సత్యశారదతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందన్నారు. ప్రయాణ సౌకర్యాలు మెరుగైతేనే పరిశ్రమలకు, అందులో పనిచేసే కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. హనుమకొండలో ఉదయం 6.20కి బస్సు బయలుదేరి వరంగల్‌కు ఉదయం 6.45కు వస్తుందన్నారు. వరంగల్ లేబర్‌కాలనీ, జాన్‌పాక, ధర్మారం, కొనాయిమాకుల, ఊకల్, చింతలపల్లిస్టేషన్ మీదుగా టెక్స్‌టైల్‌పార్కుకు చేరుకుంటుందని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు పార్కు నుంచి బస్సు బయలుదేరి హనుమకొండకు చేరుకుంటుందన్నారు. అదేవిధంగా వరంగల్, రంగశాయిపేట నుంచి సంగెం మీదుగా పార్కుకు, నర్సంపేట డిపో నుంచి పార్కుకు మరిన్ని బస్సులు నడిపేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. పార్కులో పనిచేసే కార్మికులతో పాటు ఆయా గ్రామాల మహిళలు ఉచితంగా ప్రయాణించటానికి ఈ బస్సులు సౌకర్యంగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామినాయక్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, యంగ్‌వన్, గణేశా కంపెనీల మేనేజర్‌లు కృష్ణమూర్తి, ఎం.వీ.రెడ్డి, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో శ్రీనివాస్, నాయకులు చాడా కొమురారెడ్డి, భీమగాని సౌజన్య, తుమ్మనపల్లి శ్రీనివాస్, నాగరాజు, గోదాసి చిన్న అంజన్ రావు, నరహరి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఆధ్యాత్మిక భావనతో జరుపుకోవాలి

దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ రామాల సునీత


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సునీత, తదితరులు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోనే గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ప్రధానంగా పెట్టిందిపేరైన వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంతోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాల్లోనూ, మండపాల్లోనూ గణేష్ నవరాత్రి వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వహించుకోవాలని దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ రామాల సునీత పిలుపునిచ్చారు. శివప్రీతికర సోమవారం వేయిస్తంభాల కల్యాణ మండపంలో ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే గణేష్ నవరాత్రి వేడుకల ఆహ్వాన పత్రికను ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ నాయ కులు గట్టు మహేశ్‌బాబు, అమ్మవారి ఉపాసకురాలు హిందు మాతాజీ, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఈవో అనిల్ కుమార్, ఈవి శ్రీనివాసరావు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. తొమ్మిది రోజులపాటు ఆలయంలో వైభవంగా జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రతి నిత్యం వాహన సేవలు, నిత్య అన్నదానం తదితర కార్యక్రమాలను వేముల సత్యమూర్తి, లయన్స్ మల్టీపుల్ నాయకులు నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, సాంస్కృతిక కార్యక్రమాలు వద్దిరాజు వెంకటేశ్వర్లు సహకారంతో నిర్వహించనున్నట్లు, దేవాదాయ శాఖ కూడా సంపూర్ణంగా సహకరించనున్నట్లు ఈవో అనిల్ కుమార్ ఈ సందర్భంగా చెప్పారు. గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ సుమారు 6 ఫీట్ల మట్టి గణపయ్యను ప్రతిష్ఠింపజేసి పూజాధికారలు నిర్వహింపజేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం పర్యావరణాన్ని కాంక్షిస్తూ 300 మట్టి విగ్రహాలను భక్తు లకు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రుద్రేశ్వర సేవా సమితి సభ్యులు చొల్లేటి కృష్ణమాచారి, పులి రజనీకాంత్, గంద్రాతి రాజు, ఎన్.మధుకర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలలపై లైంగిక దాడిని నిర్మూలించాలి

కమిషనరేట్ అడిషనల్ డీసీపీ రవి


కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషినల్ డీసీపీ ఎన్ రవి

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): బాలలపై లైంగిక దాడిని నిర్మూలించాలని కమిషనరేట్ అడిషనల్ డీసీపీ ఎన్ రవి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో సోమవారం చిల్డ్రెన్ ఆఫ్ ఇండియా ఈ ఫౌండేషన్ బెంగళూరు, ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ సంయుక్తంగా రాష్ట్రంలోని ఎంపిక చేయబడిన ఎన్జీవోలకు ఆన్‌లైన్‌లో ‘బాలల లైంగిక దాడిని నిర్మూలించుటలో ఎన్జీవోల పాత్ర’ అనే అంశంపై రెండు రోజుల రాష్ట్ర కన్సల్టేషన్‌ను సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్. రవి మాట్లాడుతూ సమాజంలో పిల్లల పట్ల ఆన్‌లైన్‌లో అత్యధికంగా నేరాలు జరుగుతున్నాయని, అదేవిధంగా పిల్లలు సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా కూడా కొన్ని సందర్భాలలో నేరాలు పెరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఆన్‌లైన్‌లో లైంగిక వేధిం పులకు గురవుతున్నారని, అందరు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫౌండేషన్ బెంగళూరు ఇండియా ప్రోగ్రాం మేనేజర్ శుభ్రత్ వర్క్‌షాపులో పాల్గొన్న ఎన్జీవోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆన్‌లైన్ లో బాలల లైంగిక దోపిడీ ని నిరోధించేందుకు రూపొందించిన వివిధ ప్రచార సామాగ్రిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గిరికుమార్, హను మకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ అన్నమనేని అనిల్‌చందర్‌రావు, మహబూబాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.నాగమణి, ఎఫ్ఎం శ్రామిక వికాస కేంద్రం డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, సైబర్ క్రైం సబ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

గౌరవ అధ్యక్షుడిగా తిప్పారపు లక్ష్మణ్ మాదిగ

బాలసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా తిప్పారపు లక్ష్మణ్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన జనగామ జిల్లా రఘునాథపెల్లి మండలం నిడిగొండ గ్రామానికి చెందిన వారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు.

గత మూడు దశాబ్దాలుగా దళి త ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయనను సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఎస్సీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కె.బాబు మోజెస్ తెలిపారు. అలాగే జనగామ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలతను యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వారి ఎన్నిక పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా దళిత సంఘాలతో పాటు ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎరువులు అమ్మి.. సొమ్ము చేసుకున్న తాత్కాలిక ఉద్యోగి

గ్యారెంటీ పడిన వ్యక్తులు చెల్లింపు

కాపులకనపర్తి సొసైటీలో ఘటన

ఉద్యోగం నుంచి తొలగించినట్లు చైర్మన్ వెల్లడి


విలేకరులకు వివరిస్తున్న పాలకవర్గం

సంగెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాపులకనపర్తి సొసైటీ తాత్కాలిక ఉద్యోగి తన చేతివాటంతో సుమారు రూ.6లక్షల వరకు కాజేసిన సంఘటనపై సొసైటీ చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో సొసైటీ చైర్మన్ దొమ్మటి సంపత్‌తో పాటు పాలకవర్గ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. సొసైటీలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న పసునూరి రమేశ్ ఎరువుల అమ్మకానికి నియమించబడ్డాడన్నారు. జూన్ 21న 220 బస్తాలు అమ్మకాలు చేసిన సొమ్ము రూ.లక్షను సొంతానికి వాడుకొని లెక్క చెప్పకపోవడంతో ఆయనపై అనుమానం వచ్చి గోదాంలోని మిగతా బస్తాలను పాలక వర్గ సభ్యులు, పోలీసుల సమక్షంలో లెక్కించగా మరో 432 బస్తాల విలువ రూ5లక్షల 96వేల 389లను సైతం అమ్మకాలు చేసి రైతులకు ఎలాంటి రశీదులు ఇవ్వక సొమ్మును మాయం చేసినట్లు తెలిపోయిందని అన్నారు. దీంతో సంగెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చైర్మన్ తెలిపారు. తాత్కాలిక ఉద్యోగంలో చేరిన సమయంలో రమేశ్‌కు హామీ పడిన ఇద్దరు సోమవారం రూ.లక్ష చెల్లించినట్లు తెలిపారు. మిగతా రూ5లక్షల 96వేల 389లను రెండు వాయిదాల్లో చెల్లించే విధంగా ఒప్పందం చేశారని వివరించారు. రమేష్‌ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కిషన్‌నాయక్, భాస్కర్, రవీందర్, భిక్షపతి, రాజు, సొసైటీ సీఈవో రమణచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

హనుమకొండ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రం అంబేద్కర్ నగర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని కాలనీ వాసులు సోమవారం ఆందోళన చేశారు. గత కొంత కాలంగా అంబేద్కర్ నగర్‌లో తప్పుడు పత్రాలతో ప్రభుత్వభూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కాలనీలో ఉన్న ఖాళీ ప్రభుత్వ భూమిపై కొంత మంది అక్రమంగా నిర్మాణాలకు యత్నిస్తున్నారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీ ప్రజలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అధికారులను కోరారు. కాలనీ వాసులు పల్లపు శంకర్, ఆలకుంట అశోక్, గుంజ రాజు, చేపూరి రాజు, పెండ్యాల నరేష్, బొమ్మకంటి రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

వరంగల్ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్క్రాప్ షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని హనుమకొండ సీఐ మచ్చ శివ కుమార్ సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాపు నిర్వాహకులతో మంగళవారం సమావేశం ఏర్పా టు చేసి పలు సూచనలు చేశారు. స్క్రాప్ షాపుల్లో అనుమతులు వెహికల్స్, ఐరన్, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకొచ్చి విక్రయించడానికి ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంతేకాకుండా గుర్తింపు లేని వస్తువులు కొనుగోలు చేయకూడదన్నారు. తప్పనిసరిగా రిజిస్టర్ నిర్వహించాలని హెచ్చరించారు. నిబంధనలు పాటించని షాపులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7750	5300
మక్కలు	2232	1521
కందులు	5753	3022
పెసళ్లు	6222	3022
పల్లికాయ (సూక)	6210	5500
పల్లికాయ (పచ్చిది)	3200	2400
పసుపు (కాడి)	9999	7889
పసుపు (గోల)	10288	8996
తేజ మిర్చి	13000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15500	12000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్341ఏసీ	14800	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

\- వరంగల్ వ్యవసాయం

ప్రజల రుణం తీర్చుకుంటున్నాం..



వర్ధన్నపేటలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

వర్ధన్నపేట రూరల్/వర్ధన్నపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జనహిత పాదయాత్ర సందర్భంగా వర్ధన్నపేటలో సోమవారం రాత్రి జరిగిన కార్నర్ మీటింగ్‌లో పలువురు కాంగ్రెస్ నేతలు బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కారు నెరవేరుస్తున్న హామీలను, చేపట్టిన పథకాలను వివరించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో తమను గెలిపించారని, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్ములను గెలిపించి తీరుతామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ హయాంలో అభివృద్ధియే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు పని చేస్తున్నారని తెలిపారు. యూరియా బస్తాలను బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్ ఇంట్లో దాచుకున్నాడని, తిరిగి కాంగ్రెస్ పార్టీ వల్లనే యూరియా కొరత ఏర్పడిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజా ధనం దుర్వినియోగం...
ఎమ్మెల్యే రామచంద్రు నాయక్

డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోదీ ఆధ్వర్యంలో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ అంబానీ, ఆదానీ కుటుంబాలకు దోచి పెడుతున్నారని విమర్శించారు.


మాట్లాడుతున్న మంత్రి సురేఖ

- ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం
- బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కయ్యాయి..
- జనహిత యాత్రలో కాంగ్రెస్ నేతలు

బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ ప్రజా ధనాన్ని దండుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని అభివృద్ధి చేసుకుని ఆదర్శంగా నిలిచాడన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు.


నినాదాలు చేస్తూ అభివాదం చేస్తున్న మీనాక్షి, మహేశ్‌కుమార్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు

హిందూ-ముస్లింల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ
ప్రభుత్వ విప్ మురళీనాయక్

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ బీజేపీ హిందూ- ముస్లింల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకుంటుందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేద ప్రజలకు సన్న బియ్యం అందించారని గుర్తు చేశారు. బీజేపీ ఓటు చోరీతో మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. బీహార్‌లో రాహుల్ గాంధీ పాదయాత్రకు ప్రజల నుండి అపూర్వ మద్దతు లభిస్తుందన్నారు.

హామీలను నెరవేర్చుతున్నాం..
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన వారందరికీ అందజేస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుంటే కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక కండ్లుండి కబోదిలా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ కుటుంబం త్యాగాల ఫలితంగానే దేశ అభివృద్ధి జరిగిందన్నారు.


వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో జనహిత పాదయాత్రలో పాల్గొన్న మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్

బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కు.
జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీని విమర్శించడమే లక్ష్యంగా పని చేస్తున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉండడంతో పాటు విధ్వంసం జరిగిందన్నారు. రెండు దఫాలుగా రాహుల్ గాంధీకి ప్రధానమంత్రిగా అవకాశం వచ్చినా వాటిని త్యాగం చేసిన మహనీయుడని గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు.


కాంగ్రెస్ జనహిత పాదయాత్రలో నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

ఆలస్యంగా జనహిత పాదయాత్ర

- ట్రాఫిక్‌లో చిక్కుకున్న మీనాక్షి, మహేష్ గౌడ్
- పోలీసులు, కార్యకర్తలకు మధ్య తోపులాట
- ఫొటోలు దిగేందుకు ఎగబడిన నాయకులు
- బోనమెత్తుకొని నృత్యం చేసిన మంత్రి సురేఖ

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట నియోజకవర్గంలో తలపెట్టిన కాంగ్రెస్ జనహిత పాదయాత్ర 2 గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కావాల్సిన యాత్ర కరీంనగర్ జిల్లా నుంచి రావాల్సిన ఏఐసీసీ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లు ఆలస్యంగా బయలుదేరారు. దీంతో వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై భారీగా నాయకులు మోహరించారు. వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో వాహనాలు కిక్కిరిసిపోయాయి. దాదాపు నాయుడు పంపు నుంచి ఇల్లంద వరకు భారీగా ట్రాఫిక్ జామైంది. గంట పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి క్లియర్ చేస్తున్న తరుణంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. దీంతో జెండా ఎత్తే సమయం దాటిపోతుందని ఆలోచనతో మహేష్ కుమార్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావు ఆవిష్కరించారు. వందేమాతర గేయం, జాతీయ గీతం, తెలంగాణ గీతం ఆలపించారు.

ఇక కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులు ఏర్పాటు చేసిన రోప్ పార్టీ లోపలికి వచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. తమ నాయకుడిని కలవడానికి వస్తున్న వారిని నిలువరిస్తున్న తరుణంలో పోలీసులకు, కార్యకర్తలకు వాగ్వాదం తోపులాట జరిగింది. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పాదయాత్ర చేస్తున్న తరుణంలో సైతం విపరీతమైన తోపులాట, ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇల్లంద ఎస్సీ కాలనీకి వచ్చిన తర్వాత కాస్తా పాదయాత్ర సజావుగా సాగడం మొదలైంది. ఇల్లంద శివారులో ఉన్న శ్రీ కంఠమహేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ నివాళులర్పించారు. గీత కార్మికులతో ఆత్మీయంగా మాట్లాడి వారితో ఫొటోలు దిగారు. పాదయాత్రకు వచ్చిన ముఖ్య అతిథులను మహిళలు కోలాటం, బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. డప్పు కళాకారులు, గిరిజనుల నృత్యం అలరించారు. మంత్రి కొండా సురేఖ బోనమెత్తుకొని నృత్యం చేయడం అందరిలో ఉత్సాహాన్ని నింపింది. నియోజవర్గాల వారీగా వచ్చిన ఎమ్మెల్యేలతో ఫొటోలు దిగేందుకు కార్యకర్తలు ఎగబడ్డారు.

పాదయాత్ర సైడ్‌లైట్స్..

6.00 గం. ఇల్లంద గ్రామంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

7.10 గం. కాంగ్రెస్ జనహిత పాదయాత్ర ఇల్లంద నుంచి ప్రారంభమైంది.

8.10 గం. ఇల్లందలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పించారు.

8.20 గం. వర్ధన్నపేట కొత్త బస్టాండ్ వరకు చేరుకున్నారు.

8.26 గం. అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్నారు.

8.30 గం. కార్నర్ మీటింగ్ సభా ప్రాంగణం పైకి వచ్చారు.

9.30 గం. మీటింగ్ ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

-ఆంధ్రజ్యోతి, వర్ధన్నపేట రూరల్

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు

- టీపీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మల దహనం
- మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ హౌస్ అరెస్టు


ఎల్కతుర్తిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్కతుర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద సోమవారం టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రెండవ విడత జనహిత పాదయాత్రలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నిరసన వ్యక్తం చేశారు. ఎలాంటి ఘటనలు చేటుచేసుకోకుండా ఎల్కతుర్తి పోలీసులు బీజేపీ మండల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అయినప్పటికి కొందరు నాయకులు పోలీసుల కళ్లు కప్పి చౌరస్తాకు చేరుకుని మహేష్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దిష్టిబొమ్మను పక్కకు లాగేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాకేష్, అల్లి కుమార్, పోలు కోటి, శివసేన పాల్గొన్నారు. పాదయాత్ర సందర్భంగా ఎలాంటి సంఘటనలు చేసుకోకుండా ఉండేందుకు మండల పార్టీ నాయకులను ఎల్కతుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచుకుని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్‌యాదవ్, నాయకులు కుడితాడి చిరంజీవి, జనగం కిష్టయ్య, చిదురాల వెంకటేష్, ఎర్రగోల్ల రాజు తదితరులున్నారు.

ముల్కనూర్‌లో..

భీమదేవరపల్లి(ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు సోమవారం దహనం చేశారు. విషయం తెలుసుకున్న ముల్కనూర్ ఎస్‌ఐ రాజు సిబ్బందితో వచ్చి అడ్డుకున్నారు. అనంతరం బీజేపీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ జనహిత పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ తప్పుడు ఆరోపణలు చేస్తూ పాదయాత్ర చేస్తున్నారని, ఇలా ఇస్తే బీజేపీ నాయకులు తిరగబడుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడిపల్లి పృథ్వీరాజ్, మండలాధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్, దొంగల కొంరయ్య, దుర్గాసింగ్, అయిత సాయి, దొంగల రాణా, మొలుగు సంపత్, సదానందం, రాజేందర్, వైకుంఠం, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొండేటి హౌస్ అరెస్టు

వర్ధన్నపేట (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన జనహిత యాత్రను అడ్డుకుంటామని బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ప్రకటించడంతో సోమవారం ఉదయం నుంచి హన్మకొండ హంటర్ రోడ్డులోని ఆయన గృహంలో సుబేదారి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

వర్ధన్నపేట మండలంలో..

వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్య్రాల, కడారిగూడెం గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జడ సతీష్‌లతో పాటు పలువురికి స్టేషన్‌కు తరలించారు. జనహిత పాదయాత్ర సందర్భంగా ఎలాంటి ఆందోళనలు, నిరసనలు తెలియచేయకుండా ఉండాలని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను నొక్కడం సరైన పద్ధతి కాదన్నారు.


ముల్కనూర్‌లో టీపీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

బీజేపీది దొంగ ఓట్ల రాజకీయం

(5వ పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ చూస్తున్నారని తెలిపారు. మోదీ, అమిత్ షా చేసిన పన్నాగం వల్లనే మహారాష్ట్రతో పాటు బీహార్ లాంటి రాష్ట్రాలలో ఓడిపోయామన్నారు. డీకే అరుణ, బండి సంజయ్ లాంటి వారు తన సవాల్ పై విమర్శలు చేస్తున్నారని చిత్తశుద్ధి ఉంటే బీసీల కోసం మాట్లాడాలని హితవు పలికారు. ఎలక్షన్ కమిషన్ స్వయం ప్రతిపత్తి గల సంస్థ, ఏ పార్టీకి వత్తాసు పలకొద్దు కానీ బీజేపీకి అనుకూలంగా ఉందన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు ఎంతో మంది మహారాష్ట్రలో ఉన్నారు. వారు ఇక్కడ, అక్కడ ఓటేస్తారని అలా వేయొచ్చా అని ప్రశ్నించారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ పెంచి బహుజన వర్గాల కోసం తీర్మానం చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. కిషన్ రెడ్డికి భయపడి బండి సంజయ్ లాంటి వారు ప్రశ్నించకుండా భయపడతున్నారని తెలిపారు. పుట్టుకతో బీసీనంటే కాదని, మనం చేసే విధానంలో, మన చేసే పనిలో ఉండాలని బండి సంజయ్ గుర్తు పెట్టుకోవాలన్నారు. బీసీలుగా ఎదిగి, బీసీలు చెప్పుకుని తిరుగుతూ నేడు బీసీలకు అన్యాయం చేస్తున్న వీరు రేపు బీసీలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అట్టడుగున ఉన్న వారిని కూడా పైకి తీసుకురావాలనే ఆలోచనతో పనిచేస్తున్నామని స్పష్టంచేశారు. వర్ధన్నపేటలో కొన్ని వేల ఇందిరమ్మ ఇండ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. పదేండ్లలో ఎవరికి ఇండ్లు రాలేదని, కానీ ఇప్పుడు అందరికీ అందరికీ వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షమే లేదని, కాంగ్రెస్ పార్టీ అంటేనే భయాందోళనకు గురై దిక్కుతోచక తిరుగుతున్నారని ఆరోపించారు.

ఈ పాదయాత్రలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ మురళీ నాయక్, మహబూబాద్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నల్గొండ ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పార్టీ నేతలు దొమ్మటి సాంబయ్య, ఝాన్సీరెడ్డి, వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్‌లను గజమాలతో సన్మానిస్తున్న మంత్రి కొండా సురేఖ-మురళీధర్‌రావు దంపతులు

స్వాగతం పలికిన కొండా దంపతులు

వరంగల్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జనహిత పాదయాత్ర చేపట్టి వర్ధన్నపేటకు వెళుతున్న కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌లకు సోమవారం సాయంత్రం హంటర్‌రోడ్‌లో మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు దంపతులు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచి అందరూ కలిసి వర్ధన్నపేటకు తరలివెళ్లారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో..


కేయూ సెకండ్ గేట్ వద్ద స్వాగతం పలుకుతున్న నాయకులు

హనుమకొండ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జనహిత యాత్ర జరుగుతున్న సంగతి విదితమే. సోమవారం వర్ధన్నపేటలో జరిగే జనహిత యాత్రలో పాల్గొనేందుకు వెళ్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్‌కు హనుమకొండ కేయు సెకెండ్ గేట్ వద్ద నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగత కార్యక్రమం జరిగింది. బాణసంచా పేల్చారు. మహేశ్‌కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్‌ను పూల మొక్కలు అందించి రాజేందర్ రెడ్డి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, ఎస్‌సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టరు పెరుమాండ్ల రామకృష్ణ, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, టీపీసీసీ నాయకుడు బత్తిని శ్రీనివాస్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, పోతల శ్రీమాన్, రాష్ట్ర ఫిషరీస్ కమిటీ సభ్యుడు మండల సమ్మయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో ..

ఎల్కతుర్తి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌లకు ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, హుస్నాబాద్ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. చొప్పదండి నియోజకవర్గంలో జనహిత పాదయాత్ర ముగించుకుని వర్ధన్నపేటకు వెళ్తూ మార్గమధ్యలోని ఎల్కతుర్తిలో ఆగారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణసంచా పేల్చి శాలువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, నాయకులు సంతాజీ, గొలి రాజేశ్వర్ రావు, అంబాల శ్రీకాంత్, బొల్లేపోగు రమేష్‌బాబు, బచ్చు శ్రీధర్‌రావు, పెండ్యాల తిరుపతి, శనిగరపు సాహు, పుల్లూరి శ్రీధర్‌రావు, మండ సుమన్, దూలం ప్రభాకర్‌గౌడ్, బత్తిని రవీందర్‌గౌడ్, రంజిత్‌రెడ్డి, ముప్పు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడు, ఆభరణాలను మీడియాకు చూపుతున్న పోలీసులు

గిర్మాజీపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్, నెక్కొండ రైల్వేస్టేషన్‌లలో ప్రయాణీకుల అభరణాలు చోరీ చేసిన పల్లపు గోపిని సోమవారం వరంగల్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ఆర్‌పీఎఫ్ సీఐ కె.శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ మీడియాతో మాట్లాడారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సోమవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన గోపిని అదుపులోకి తీసుకుని విచారించగా తను వరంగల్, నెక్కొండ రైల్వేస్టేషన్‌లలో బంగారు అభరణాలు దొంగిలించినట్లు అంగీకరించాడని అన్నారు. విజయవాడకు చెందిన గోపి ప్రస్తుతం మహబూబాబాద్ పట్టణంలో కూలీ పనిచేసుకుంటూ రైల్వేస్టేషన్‌లలో దొంగతనాలకు పాల్పడుతున్నాడని అన్నారు. అతడి వద్ద రూ.5 లక్షల 50 వేల విలువైన 56.083 గ్రాముల బంగారు నెక్లెస్, బంగారు గొలుసు, రెండు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కాజీపేట రైల్వేకోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు పంపించారని వారు వివరించారు. తనిఖీలో జీఆర్‌పీ కానిస్టేబుళ్లు, డి.రాము, ఎం.డి.రియాజుద్దీన్, ఎం.నాగరాజు, ఆర్‌పీఎఫ్ ఎఎస్సై బి.రామకృష్ణ, కానిస్టేబుల్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసమే హత్య

- భార్యను చంపిన కేసులో భర్త అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ ప్రకాశ్

మట్టెవాడ ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కావాలన్న ఆపేక్షతో కట్టుకున్న భార్యను కడతేర్చిన భర్తను వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ సోమవారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్య తండాకు చెందిన బానోత్ గణేశ్‌కు సూర్యాపేట జిల్లా నూతనకల్లు మండలం దర్శినపల్లికి చెందిన బాదావత్ గౌతమిని ఇచ్చి గత మే నెలలో వివాహం చేశారు. వరకట్నం కింద రూ.2.5 లక్షల నగదు, రెండు తులాల బంగారు చైన్, ఉంగరం ఇచ్చారు. దీంతో పాటు గణేశ్ తల్లికి తులం బంగారు పుస్తెలు, మరో 15 తులాల బంగారు అభరణాలను గౌతమికి చేయించారు. అంతేగాకుండా 150 గజాల స్థలాన్ని గణేశ్ పేరు మీద చేయిస్తామని ఒప్పుకున్నారు. గణేశ్ గౌతమిల కాపురం నెల రోజుల పాటు సజావుగా జరిగింది. తర్వాత భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ అదనపు కట్నం కావాలని ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో రూ. లక్ష ఇచ్చి ఫైనాన్స్‌లో ఆటో కొనిచ్చారు. గత జూలై నుంచి వరంగల్ హంటర్‌రోడ్డులోని పద్మావతి గార్డెన్ పక్కన అద్దెకు ఉంటూ గణేష్ ఆటో నడుపుతున్నాడు. అయినా డబ్బులు సరిపోవడం లేదని గొడవ చేయడంతో గౌతమి తల్లిదండ్రులు మరో రూ.లక్ష ఇచ్చారు. అయినా తృప్తి చెందని గణేశ్ గౌతమితో సక్రమంగా కాపురం చేయకుండా తన క్లాస్‌మేట్ అయిన మరో యువతిని పెళ్ళి చేసుకోవాలని భావించి గౌతమిని చంపాలని నిర్ణయించుకున్నాడు. తనకు ఇస్తానని చెప్పిన 150 గజాల స్థలం ఇవ్వడం లేదనే నెపంతో గౌతమిని హింసించేవాడు. దీంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి సర్ది చెప్పారు. ఐనప్పటికీ తీరు మార్చుకోని గణేశ్ ఆగస్టు 23న శనివారం రాత్రి గౌతమి నిద్రలో ఉండగా బెడ్‌షీట్‌తో ఊపిరి ఆడకుండా చేసి గౌతమిని చంపేశాడు. తర్వాత తను పిలిచినా పలుకడం లేదంటూ బంధువులకు ఫోన్ చేశాడు. వారు వచ్చి గౌతమిని ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం గణేశ్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. 24 గంటల్లోనే కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన మట్టెవాడ ఇన్స్‌పెక్టర్ ఎం.కరుణాకర్, ఎస్సై ఎస్.శివకృష్ణ, కానిస్టేబుళ్లను ఏఎస్పీ అభినందించారు.


నిందితుడు గణేశ్ అరెస్టును చూపుతున్న ఏఎస్పీ శుభం ప్రకాశ్

సీజన్ వ్యాధుల నివారణపై అవగాహన అవసరం

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో ఇటీవల కురిసిన వర్షాలకు సీజన్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, సీజన్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయం నుంచి మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కళాజాతను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ నుంచి అమలవుతున్న అన్ని పథకాలపై 66 డివిజన్ ప్రజలకు కళాకారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, సూపరింటెండెంట్ ఉమాదేవేందర్, శానిటరి సూపర్‌వైజర్లు భాస్కర్, శ్రీను, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్, భీమయ్య, అనీల్, సురేష్ పాల్గొన్నారు.



కుక్కల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది

కుక్కల కళేబరాల బ్యాగ్ కలకలం

కేయూ క్యాంపస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కేయూలో మృతి చెందిన కుక్కల బ్యాగ్ (సంచి) కలకలం రేపింది. సోమవారం ఉదయం వర్సిటీలో హైరానా నెలకొంది. వర్సిటీ దూరవిద్య కేంద్రం సమీపంలో మృతి చెందిన 2 కుక్కలను సంచిలో మూటా కట్టి వర్సిటీ ఆవరణలో పడేశారు. దీంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసి పడేశారని వదంతులు షికారుతో వర్సిటీలో ఉత్కంఠ నెలకొంది. వర్సిటీ ఉద్యోగులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. చివరకు సంచిలో మృతి చెందిన 2 కుక్కలను గుర్తు తెలియని వ్యక్తులు సంచిలో మూటలో కట్టి వర్సిటీ క్యాంపస్‌లో పడేశారని పోలీసులు తేల్చారు. దీంతో మృతి చెందింది మనిషి కాదు.. కుక్కలని తేలింది. కుక్కలను చంపి ఎవరో వర్సిటీలో పడేశారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి

హసన్‌పర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అవయవ దానంపై అవగాహన కలిగి ఉండాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ మంత్రపురి కాలనీకి చెందిన నేత్రదాత కనపర్తి సరోజన సంస్మరణ సభ సోమవారం సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శంకర్‌రావు అధ్యక్షతన దాత స్వగృహంలో జరిగింది. దాత కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ ప్రతినిధులకు శ్రవణ్‌కుమార్ అభినందించారు. అనంతరం అవయవ దానంపై అవగాహన కల్పించి వారి కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందజేశారు. దాత సరోజన నేత్రాలతో ఇద్దరు అంధులకు చూపు దక్కడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో దాత కుమారులు కనపర్తి శ్రీనివాస్, సమ్మయ్య, శంకర్, కుమార్తె స్వరూప, ఫౌండేషన్ పట్టణ ప్రచార కార్యదర్శి వి.శ్రీనివాస్, బంధుమిత్రులు పావుశెట్టి శ్రీధర్, సదానందం, రాకేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

» కలెక్టర్ స్నేహ శబరీష్ » ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల తనిఖీ » మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

వరంగల్ మెడికల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ సేవలు, డెలివరి కేసుల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. లేబర్‌రూమ్‌ను పరిశీలించి ఎంతమంది వైద్యులు, సిబ్బంది షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారని తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ కేసులకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తారని, డెలీవరి అయిన తరువాత ఎన్ని రోజులకు డిశ్చార్జి చేస్తారని సెక్షన్ ఆపరేషన్లు, హైరిస్క్ కేసుల ట్రీట్‌మెంట్ గురించి కలెక్టర్ ఆరా తీశారు. పలు వార్డులను సందర్శించి ఆస్పత్రిలో అందుతున్న వైద్య గురించి గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్ మోహన్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలి

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి) : వినాయక మండపాల నిర్వాహకులు మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై మట్టి వినాయకులను పంపిణీ చేసి మాట్లాడారు. 'మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజిద్దాం' అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పేషెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ధర్నా



కాజీపేటలో ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు

కాజీపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ పథకంలో మురికి వాడలు, దళిత వాడల సమస్యల పరిష్కరించాలని కోరుతూ కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య హాజరై మాట్లాడారు. కాజీపేట మండలాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నారు. నగరాభివృద్ధికి స్మార్ట్ సిటీ పథకం కింద వేలాది కోట్ల రూపాయల నిధులు వస్తున్నా మున్సిపాలిటీ మాత్రం ఆ నిధులను ధనిక కాలనీల్లో వెచ్చిస్తుందన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కారు ఉపేందర్, నాయకులు తొట్టె మల్లేశం, సంటి రవి, జంపాల రమేశ్, ఎండీ మజాహర్, రామంచ సారంగపాణి, దార్న ప్రభాకర్, పెండ్యాల లక్ష్మణ్‌తో పాటు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుపతిలో కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న నీలిమ

కాజీపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దేవాలయంలో ఆదివారం కళాప్రదర్శన నిర్వహించిన కాజీపేట కళాకారులను సోమవారం స్థానికులు ఘనంగా సన్మానించారు. కళాప్రదర్శన చేసిన 20 మంది కళాకారులకు మెమొంటోలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ హాజరై సదాశ్రీ కూచిపూడి కళాక్షేత్రం గురువు దువ్వ రేవతిరాజులను, వారి బృందానికి శాలువాలు కప్పి, మెమొంటోలు ఇచ్చి సన్మానించారు. చిన్నారులు చదువుతో పాటు కళాప్రదర్శనల్లో ముందుండాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ అజ్గర్, దువ్వ వీరవెంకటరాజులు, ఇప్ప శ్రీకాంత్, మానస, మధు, ఎంపీ రాజు, సమత, ఎంఏ షబ్బీర్, బబ్లూ, ఇమ్మడి రవి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు మన సంస్కృతికి దర్పణాలు

కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

హసన్‌పర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పండుగలు మన సంస్కృతికి దర్పణాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో సోమవారం మట్టి వినాయక విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారం కర్ణ అధ్యక్షతన జరిగింది. ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ హాజరై మాట్లాడారు. భారతీయ ధర్మాన్ని అనుసరించి పండుగలను నిర్వహించుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్వహించే వినాయక నవరాత్రోత్సవాల్లో మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలన్నారు. రసాయన విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై చెరువులో ఉండే ప్రాణులకు హాని జరగడమే కాకుండా పశుపక్ష్యాదులు, క్రిమికీటకాలకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. అనంతరం సుజాత విద్యానికేతన్ పాఠశాల పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులతో తయారు చేయించిన 1,700 మట్టి వినాయక విగ్రహాలను తల్లిదండ్రులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

కాజీపేట (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ వైసుధాకర్ రెడ్డి అన్నారు. కాజీపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం పీస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడారు. వినాయక నవరాత్రుల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని మతాలు కలిసికట్టుగా ఉత్సవాలు జరుపుకోవాలని, శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సైలు నవీన్, లవన్, శివ, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సురవరం.. విప్లవ శిఖరం

సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

మడికొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సమ సమాజం కోసం జీవిత పర్యంతం పోరాడిన విప్లవ శిఖరం సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మడికొండ చౌరస్తాలో పార్టీ మండల కార్యదర్శి మాలోత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా భిక్షపతి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మునిగాల భిక్షపతి, రాసమల్ల దీన, భూక్య స్వరూప, కుడి స్వామి, బొట్టు భిక్షపతి, మంద సుమన్, స్వామి, మునిగాల ఐలయ్య, రాసమల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీల ఏర్పాటుకు అంచనాలు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్




జూపార్క్‌లో అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ చహత్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జూ పార్క్‌లో సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)ల ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని జూ పార్క్‌లో అక్కడి సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంకా స్మార్ట్‌రోడ్డు, జూపార్క్ నుంచి భద్రకాళి బండ్ వరకు వెళ్లే రోడ్డును పరిశీలించారు. జూపార్క్‌లో ఎస్‌టీపీలకు కావలసిన ఏర్పాట్లను పరిశీలించి అంచనాలు రూపొందించాలని అధికారులకు తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా పద్మాక్షి చెరువు, సిద్ధేశ్వర గుండం, హసన్‌పర్తి చెరువు, కట్టమల్లన్న చెరువులను పరిశీలించారు. అక్కడి లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. వినాయక చవితి పండగ మొదలు నుంచి నిమజ్జనం వరకు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్‌జోషి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ మహేందర్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మాధవిలత, కుడా ఈఈ భీంరావు, డీఈ రవికిరణ్, కార్తీక్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మాస్టర్జీ పాఠశాలలో ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్



మాట్లాడుతున్న రిటైర్డ్ డీఎస్పీ రవీంద్రకుమార్

మడికొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రిటైర్డ్ డీఎస్పీ రవీంద్రకుమార్ అన్నారు. మడికొండలోని మాస్టర్జీ పాఠశాలలో సోమవారం జరిగిన ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువు విజ్ఞానాన్ని అందిస్తే.. క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయన్నారు. మాస్టర్జీ విద్యాసంస్థల చైర్మన్, కు డా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి చేరుకొని పాఠశాల, తల్లిదండ్రులు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షీలో, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఏవో రమేష్‌బాబు, సుధాకర్, పీఈటీ పాల్గొన్నారు.

విలువల విద్యతో ఉన్నత లక్ష్యాలు

కేయూ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి

హసన్‌పర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విలువల విద్యతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధిస్తారని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్, కేయూ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన ఓరియంటేషన్ ఫర్ ఫ్రెషర్స్ కార్యక్రమానికి హాజరయ్యారు. లైఫ్ స్కిల్స్, యాంటీ ర్యాగింగ్, మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ ఓరియంటేషన్ కార్యక్రమాలు విద్యార్థుల అభివృద్ధికి బాటలుగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు సమస్యలను ఎలా ఎదుర్కోవాలో తెలుస్తుందన్నారు. విద్య, జీవితం విలువ తెలుసుకొని లక్ష్యం తో చదివి ఉపాధి అవకాశాలను దక్కించుకోవాలన్నారు. విద్యార్థినులు వేధింపులకు గురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి, శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఓయూకు వచ్చే హక్కు లేదు

కేయూ విద్యార్థి సంఘాల నేతలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా వర్సిటీ క్యాంపస్‌కు వచ్చే నైతిక హక్కు లేదని కేయూ విద్యార్థి సంఘాల నేతలు అన్నారు. సోమవారం కేయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, కలకోట సుమన్, జాగృతి జిల్లా అధ్యక్షుడు పర్లపల్లి శ్రీశైలంలు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయలేదన్నారు. యువతను నయవంచనకు గురిచేశారన్నారు. విద్యకు 15 శాతం నిధుల కేటాయింపు ఏమైందన్నారు. 420 హామీలతో మోసం చేశారన్నారు. విద్యార్థి నేతలను ముందస్తు అరెస్టు చేశారని ఆరోపించారు. దీన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిన కాంగ్రెస్ నాయకులు

కాజీపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేటలో సోమవారం నిర్వహించిన టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌గౌడ్, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జనహిత పాదయాత్రకు కాజీపేట నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాజీపేట చౌరస్తాలో స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీలు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. యాత్రకు తరలిన వారిలో నాయకులు ఆరూరి సాంబయ్య, దొంగల కుమార్, అజ్గర్, నీలక్క, లలిత, ఇప్ప శ్రీకాంత్, మంతుర్తి బొంద్యాలు, సంతోష్, స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి

బాలసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : బీపీ మండల్ స్ఫూర్తితో రాజకీయ రిజర్వేషన్లు సాధించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్ అన్నారు. బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 107వ జయంతి సందర్భంగా 'సామాజిక న్యాయం - రాజకీయ పార్టీలు' అనే అంశంపై హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. ఈ సదస్సుకు మండల పరశురాములు అధ్యక్షత వహించారు. పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా ఐక్య ఉద్యమాలు చేసినప్పుడే బీసీలకు సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. బీసీ మహాసేన రాష్ట్ర కోకన్వీనర్ గొల్లపల్లి వీరస్వామి మాట్లాడుతూ బీపీ మండల్ దేశమంతా పర్యటించి బీసీలపై సమగ్ర నివేదికను అందించారన్నారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో బీసీల అభ్యున్నతికి 340 ఆర్టికల్ పొందుపర్చారని, దాని ప్రకారంగా రాజ్యాంగబద్ధమైన కమిషన్ వేసి ప్రభుత్వం బీసీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రధాన పార్టీలు ఎవరి ఆట వారు ఆడుతున్నారన్నారు. సదస్సులో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ కొంగ వీరస్వామి, న్యాయవాదులు వలస సుధీర్‌కుమార్, చిల్లా రాజేంద్రప్రసాద్, కే రమేష్‌బాబు, తీగల జీవన్‌గౌడ్, వివిధ సంఘా ల నాయకులు సోమ రామ్మూర్తి, జిలుకర శ్రీనివాస్, సాంబారి సమ్మారా వు, తిరునహరి శేషు, శోభారాణి, గైనేని రాజన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్ : బీపీమండల్) ఆశయాలను కొనసాగించా లని ఓబీసీ అధ్యక్షుడు, మాస్టర్జీ విద్యా సంస్థల అధినేత సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. బీపీ మండల్ జయంతి వేడుకలు సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మాస్టర్జీ కళాశాలలో మండల్ చిత్రపటానికి సుందర్‌రాజ్ యాదవ్, బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ సెక్రెటరీ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటలక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మీ, కేయూపాలక మండలి సభ్యులు చిర్ర రాజు, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, బీసీ మహాసేన రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్, యాదగిరిగౌడ్, పాల్గొన్నారు.



హరిత కాకతీయ హోటల్‌లో బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇంటలెక్చువల్ ఫోరం నాయకులు

హనుమకొండ టౌన్ : మండల్ జయంతిని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బుద్దె వెంకన్న, మూటిక రాజు యాదవ్, అభిలాష్, కోటి, రాజ్‌కుమార్, రాజు, మనోజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్ : బీపీ మండల్ చిత్రపటానికి రిజిస్ట్రార్ రామచంద్రం, కేయూ బీసీ సెల్ డైరెక్టర్ బి. సతీశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యుడు చిర్రా రాజు గౌడ్, సోషియాలజీ విభాగాధిపతి స్వర్ణలత, బీవోఎస్ కుంట అయిలయ్య, వివిధ విభాగాధిపతులు, ఆకుతోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాంనగర్ : హైకోర్టు ఆదేశానుసారం బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ సెక్రటరీ నీలారపు రాజేందర్ డిమాండ్ చేశారు. బీపీ మండల్ జయంతిని సోమవారం విద్యుత్ గెస్ట్ హౌస్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ సీఈ పీ సత్యనారాయణ, కంపెనీ అధ్యక్షుడు నాగెల్లి సదానందం, వెంకటేశ్, సీఎస్, డీఈ, ఏడీఈ, జీఎం, ఏవో, జేఏవో, పీవోలు పాల్గొన్నారు.

వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి జీవితాంతం ఉద్యమించిన నేత బిందేశ్వర్ ప్రసాద్ మండల్(బీపీ మండల్) అని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, కోకన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్ అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీపీ మండల్ జయంతిని తెలంగాణ బీసీ మహాసేన, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

కేయూలో అంతర్గత బదిలీలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో 19 మంది ఎన్జీవోస్, క్లాస్-4 , రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పరిపాలన సౌలభ్యం కోసం అంతర్గత బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్డీ యూనస్, సయ్యద్ అక్రమ్ అహ్మద్, జి.సేవ్య, నరేశ్, రాధ, వెంకటరాజం, యాదగిరి, కృష్ణంరాజ, అక్బర్, నరేశ్, హరీశ్, మధు, వెంకన్న, వి ద్యాసాగర్, శోభ, శోభారాణి, స్వప్నలు న్నారు. వీరు బదిలైన స్థానల్లో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తి అదృశ్యం



బృష భానుభాగ్ (ఫైల్)

కాజీపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. రైల్వే ఎస్సై ఎం.అభినవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఒడిశాకు చెందిన 43 సంవత్సరాల బృష భాను వరంగల్ జిల్లా పర్వతగిరిలో అరటి తోటలో పనిచేస్తుంటాడు.

ఒడిశాకు వెళ్లేందుకు ఈనెల 1న కాజీపేట రైల్వేస్టేషన్ వచ్చి రైలెక్కివెళ్లాడు. కానీ, అతను ఇంతవరకు సొంత ఊరికి వెళ్లలేదు. అతని భార్య రష్మిక బాగ్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 87126 58609 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్సై కోరారు.

అవగాహన

దుప్పట్లు శుభ్రమేనా?

వారానికోసారి దుప్పట్లు శుభ్రం చేసుకోకపోతే, వాటి మీద పేరుకుపోయే మృత చర్మ కణాలు, బ్యాక్టీరియా, ఫంగస్, డస్ట్ మైట్స్‌తో కలిసి నిద్రిస్తున్నట్టు లెక్క. వినడానికి విచిత్రంగా ఉన్నా, ఇదే నిజం. మనం నిద్రకు ముందు స్నానం చేస్తూ ఉంటాం. అయినా ప్రతి రాత్రీ మన శరీరం వందలు, వేల మృత కణాలను, నూనెలనూ, స్వేదాన్నీ విసర్జిస్తూనే ఉంటుంది. ఇవన్నీ వాటిలో వృద్ధి చెందే డస్ట్ మైట్స్‌కు అనుకూలమైన పర్యావరణాలు. అయితే డస్ట్ మైట్స్‌తో మనకెలాంటి ఉండకపోవచ్చు కానీ వాటి విసర్జకాలు అలర్జీలు, ఉబ్బసం, ఎగ్జిమాలకు దారి తీస్తాయి. దుప్పట్ల మీద ఫంగస్ కూడా పెరగవచ్చు. మరీ ముఖ్యంగా దిండ్ల మీద పెరిగే కొన్ని ఫంగస్ జాతులు, రోగనిరోధకశక్తి బలహీనంగా ఉన్న వారిలో తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ల పెరుగుదలకు దోహదపడవచ్చు. అదే మంచాన్ని పెంపుడు జంతువులతో పంచుకునే అలవాటున్నవాళ్లు, అదనపు ఆరోగ్య సమస్యలకు సిద్ధపడాలి. వాటితో పడక మీదకు చేరే అదనపు ధూళి, రోమాలు, చుండ్రు, విసర్జకాల అవశేషాలు మరికొన్ని ఆరోగ్య సమస్యలను తెచ్చి పెడతాయి. కాబట్టి దుప్పట్లు, దిండు కవర్లను వారానికోసారి తప్పనిసరిగా శుభ్రం చేస్తూ ఉండాలి. సుస్తీ చేసినా, ఎక్కువ స్వేదం వెలువరిచే గుణం కలిగి ఉన్నా, ఇంట్లో పెంపుడు జంతువులున్నా ప్రతి నాలుగు రోజులకోసారి దుప్పట్లు, దిండ్ల కవర్లను శుభ్రం చేసుకుంటూ ఉండాలి. అలాగే మందపాటి బ్లాంకెట్లను ప్రతి రెండు వారాలకూ, డ్యువెట్ కవర్లను ప్రతి 3 నుంచి 4 నెలలకూ శుభ్రపరుస్తూ ఉండాలి. దిండ్లను ప్రతి నాలుగు నెలలకు శుభ్రపరుస్తూ, పరుపులను వారానికోసారి వ్యాక్యూమ్ క్లీన్ చేయాలి. తరచూ ఆరుబయట ఎండకు అరబెడుతూ ఉండాలి.



ఆహారం- ఆరోగ్యం

మఖ్‌నా మతలబు

మఖ్‌నా కచ్చితంగా ఆరోగ్యకరమైన ఆహారమే! పొట్ట కదలికలను క్రమబద్ధీకరించి, జీర్ణశక్తిని పెంచే మఖ్‌నా, పేగుల ఆరోగ్యంతో పాటు శక్తి ఖర్చయ్యే వేగాన్ని కూడా పెంచుతాయి. అయితే ఈ ఆరోగ్యకరమైన పదార్థాన్ని తినకూడని వాళ్లూ ఉన్నారు. వాళ్లెవరంటే....


మూత్రపిండాల్లో రాళ్లు: వీటిలోకి ఆక్సలేట్స్, క్యాల్షియం, మెగ్నీషియం శోషణను కుంటుపరచడంతో పాటు మూత్రపిండాల్లో రాళ్ల ఏర్పడడానికి తోడ్పడతాయి. కాబట్టి మూత్రపిండాల్లో రాళ్ల ముప్పు ఉన్నవాళ్లు మఖ్‌నాలను తినకపోవడమే మేలు.



జీర్ణ సమస్యలు: ఇర్రిటబుల్ బోవెల్ సిండ్రోమ్ లేదా ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్ సమస్యలున్నవారు, మఖ్‌నా లాంటి అత్యధిక పీచు పదార్థాలను జీర్ణం చేసుకోలేరు. దాంతో కడుపుబ్బరం, పొత్తికడుపులో అసౌకర్యం తలెత్తుతాయి

యూరిక్ యాసిడ్: మఖ్‌నాల్లో ప్యూరిన్స్ అనే సమ్మేళనాలుంటాయి. ఇవి శరీరంలో యూరిక్ యాసిడ్‌ను పెంచుతాయి. కాబట్టి గౌట్ సమస్య ఉన్నవారు, అత్యధిక యూరిక్ యాసిడ్ మోతాదులున్నవారు మఖ్‌నాకు దూరంగా ఉండాలి

రక్తం పలుచనయ్యే మందులు: మఖ్‌నాలో విటమిన్ కె ఉంటుంది. రక్తం గడ్డకట్టడానికి తోడ్పడే కె విటమిన్ అధికంగా ఉండడం వల్ల వీటిని తిన్నప్పుడు, వార్ఫారిన్ లాంటి రక్తం పలుచనయ్యే మందుల ప్రభావం తగ్గుతుంది. కాబట్టి ఇలాంటి మందులు వాడుకుంటున్నవారు మఖ్‌నా తినడం మానుకోవాలి.



మెదడులో కణుతులకు వయసుతో సంబంధం లేదు. అవి క్యాన్సర్ కణుతులు కావచ్చు, కాకపోవచ్చు. అవి ఏ కోవకు చెందినవైనా వాటిని తొలగించే అత్యాధునిక సర్జరీలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. మెదడులో క్యాన్సర్ కణుతులు, వాటి చికిత్సల గురించి వైద్యులేమంటున్నారో తెలుసుకుందాం!

బ్రెయిన్ ట్యూమర్

మెదడు కణుతులకు సమర్థ సర్జరీలు

40 ఏళ్ల లోపు వారిలో తలెత్తే మెదడు క్యాన్సర్లు, శరీరంలో వేరొక చోటు నుంచి అక్కడకు వ్యాపిస్తాయి. 40 ఏళ్ల పైబడిన వారిలో నేరుగా మెదడుకే సోకుతాయి. అయితే ఈ క్యాన్సర్ ఫలానా వయసు వారికే వస్తుందని కచ్చితంగా చెప్పడానికి కూడా వీల్లేదు. ఇది ఎవరికైనా రావచ్చు. న్యూరోఫైబర్ మెటోసిస్ టైప్2 కోవకు చెందిన వారికి క్యాన్సర్ రహిత గడ్డలు మెదడుతో సహా శరీరంలో ఎక్కడైనా రావచ్చు. వీటిలో క్యాన్సర్ గడ్డలు కూడా ఉండొచ్చు. మెదడులో క్యాన్సర్ ప్రధానంగా, పలు రకాల లక్షణాలతో బయల్పడుతూ ఉంటుంది. అవేంటంటే..


- తలనొప్పి, వాంతులు
- కంటిచూపు సమస్యలు
- మాటలు తడబడడం, మాట్లాడడంతో ఇబ్బందులు
- శరీరం తూలడం
- కాళ్లూ, చేతుల్లో బలహీనత
- ప్రవర్తనా సమస్యలు (దురుసుగా ఉన్నవారు మందకొడిగా మారడం, మందకొడిగా ఉన్నవారు దురుసుగా ప్రవర్తించడం). సాధారణంగా మెదడు కణుతులతో తలెత్తే ప్రవర్తనా మార్పులను మానసిక సమస్యలుగా పొరబడుతూ ఉంటారు. కానీ తలనొప్పి, వాంతులతో పాటు ప్రవర్తనలో స్పష్టమైన మార్పులు కనిపించినప్పుడు, తప్పనిసరిగా న్యూరాలజిస్టులను సంప్రతించాలి.

నిర్ధారణ పరీక్షలు ఇవే!

మెదడులోని కణుతుల గురించి స్పష్టమైన అవగాహన కోసం మెదడు ఎమ్మారై విత్ కాంట్రాస్ట్ పరీక్ష చేయవలసి ఉంటుంది. అలాగే ఈ పరీక్షతో కణితి ఉన్న ప్రదేశం నిర్ధారించుకున్న తర్వాత, జనరల్ అనస్థీషియా ఇచ్చి సర్జరీ చేయాలా? లేదంటే అవేక్ సర్జరీ చేయొచ్చా? అన్నది వైద్యులు నిర్ధారిస్తారు. కణితి ఇంద్రియాలను నియంత్రించే మెదడులోని ప్రదేశాలకు దూరంగా ఉన్నప్పుడు జనరల్ ఎనస్థీషియాతో సర్జరీ చేయవచ్చు. బదులుగా కణితి ఇంద్రియాలతో అనుసంధానమై ఉన్న ప్రదేశాలకు దగ్గరగా ఉన్నప్పుడు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉండడం కోసం రోగిని మెలకువగా ఉంచి చేసే సర్జరీని వైద్యులు ఎంచుకోవలసి వస్తుంది.

అవేక్ సర్జరీ అంటే?

మెదడులో 'ఎలోక్వెంట్ కార్టెక్స్' అనే ప్రదేశం ఉంటుంది. ఈ ప్రదేశం శరీర కదలికలు, ఇంద్రియాలు, చూపు, వినికిడి, భాష, జ్ఞాపకశక్తులకు సంబంధించినది. ఈ ప్రదేశంలో ఏర్పడే కణుతులతో సంబంధిత అవయవాలు, ఇంద్రియాల్లో సమస్యలు తలెత్తినప్పుడు, ఆ ప్రాంతం దెబ్బతినకుండా కణితిని సమూలంగా తొలగించడం కోసం వైద్యులు అవేక్ సర్జరీని ఎంచుకుంటారు. మెదడు కణితి వల్ల మాట్లాడడంలో సమస్య ఉన్నప్పుడు, సర్జరీ చేసే సమయంలో సదరు రోగికి కొన్ని చిత్రాలు చూపిస్తూ, మాట్లాడిస్తూ, మెదడులోని సంబంధిత ప్రదేశం దెబ్బతినకుండా సురక్షితంగా కణితిని తొలగిస్తారు. బదులుగా జనరల్ అనస్థీషియాలో ఇదే సర్జరీ చేసినప్పుడు, కణితిని సమూలంగా తొలగించే వీలుండకపోవచ్చు. అలాగే స్పీచ్‌తో అనుసంధానమై ఉన్న మెదడు ప్రదేశం దెబ్బతినే ప్రమాదం కూడా ఉండొచ్చు. కాబట్టి అవేక్ సర్జరీని ఎంచుకోవడం ద్వారా సదరు ప్రదేశానికి బదులుగా దాని పక్క నుంచి నేరుగా కణితిని చేరుకుని, పూర్తిగా తొలగించగలిగే వీలుంటుంది. కంటిచూపు, అవయవాలు, వినికిడికి సంబంధించిన మెదడులోని క్యాన్సర్ కణుతులన్నిటికీ వైద్యులు అవేక్ సర్జరీనే ఎంచుకుంటారు. ఇంద్రియాలతో అనుసంధానమై ఉన్న మెదడు ప్రదేశాలకు బదులుగా ఇతర ప్రదేశాల్లో కణుతులు ఉన్నప్పుడు పూర్తిగా మత్తిచ్చి చేసే సర్జరీని వైద్యులు ఎంచుకుంటారు.



అత్యాధునిక సాంకేతికతలతో...

మెదడు సర్జరీ అనగానే విపరీతంగా భయపడిపోయే వాళ్లే ఎక్కువ. కానీ నేడు మెదడు సర్జరీలపరంగా అత్యంత సురక్షితమైన, ప్రభావవంతమైన సాంకేతికతలు అందుబాటులోకొచ్చాయి.

ఎమ్మారై: సర్జరీకి ముందు చేసే ఎమ్మారైలోనే కణితి కచ్చితమైన ప్రదేశం తెలుస్తుంది

న్యూరో నావిగేషన్: ఇది వైద్యులకు జిపిఎస్‌లా సహాయపడుతుంది. దీని సహాయంతో సర్జరీ సమయంలో వైద్యులు క్యాన్సర్ కణితిని సూటిగా చేరుకోగలుగుతారు. సర్జరీ తదనంతరం కణితిని పూర్తిగా తొలగించినట్టు నిర్ధారించుకోవడం కూడా వైద్యులు న్యూరో నావిగేషన్ మీదే ఆధారపడతారు.

ఇంట్రా ఆపరేటివ్ మానిటరింగ్: సర్జరీ సమయంలో మెదడుతో పాటు దాన్లోని క్రియలన్నీ సక్రమంగా పని చేస్తున్నట్టు నిర్ధారించుకోడానికి ఇంట్రా ఆపరేటివ్ మానిటరింగ్ తోడ్పడుతుంది

హై ఎండ్ మైక్రోస్కోప్: సూక్ష్మ రక్తనాళాలను కనిపెట్టి, రక్తస్రావాన్ని నివారించడం కోసం ఇది సహాయపడుతుంది

అల్ట్రాసోనిక్ ఆస్పిరేటర్: మెదడులోని క్యాన్సర్ గడ్డను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి, బయటకు లాగే పరికరం ఇది

కీమో థెరపీ, రేడియేషన్

సర్జరీతో మెదడులోని క్యాన్సర్ గడ్డను తొలగించిన తర్వాత, ఆ క్యాన్సర్ దశ ఆధారంగా వైద్యులు కీమోథెరపీ, రేడియేషన్ కాలాన్ని నిర్ణయిస్తారు. మెదడు క్యాన్సర్ చికిత్సల్లో వైద్యులు రేడియేషన్ థెరపీతో పాటు మాత్రలు కూడా ఇస్తారు. మాత్ర ఇచ్చిన 40 నిమిషాల తర్వాత అందించే రేడియేషన్‌తో ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

రోబోట్ అసిస్టెడ్ సర్జరీ

మెదడులోని అన్ని కణుతులనూ సర్జరీతో తొలగించే వీలుండకపోవచ్చు. దగ్గరకు చేరుకోలేనంత లోతుగా కణితి ఏర్పడినప్పుడు వైద్యులు రోబోట్ అసిస్టెడ్ సర్జరీ సహాయంతో కణితిలోని చిన్న ముక్కను బయటకు తీసి, దాని దశను తెలుసుకుని రేడియేషన్, కీమోథెరపీ సూచిస్తూ ఉంటారు. అలాగే మెదడులో లోతుగా ఉన్న కణితిని సమూలంగా తొలగించానికి కూడా ఇదే సర్జరీ తోడ్పడుతుంది.

అది అపోహ మాత్రమే!

మెదడు సర్జరీతో చేతులు, కాళ్లు చచ్చుబడితాయన్నది అపోహ మాత్రమే! నేడు అందుబాటులో ఉన్న సాంకేతికతలను సమర్థంగా వినియోగించుకోగలిగితే, 98% మంది రోగులు ఎటువంటి దుష్ప్రభావాలూ లేకుండా పూర్తిగా కోలుకుంటారు. అలాగే మెదడు సర్జరీతో తలెత్తే దుష్ప్రభావాలు కూడా క్రమేపీ తొలగిపోతాయి. మెదడు ఎడమ వైపు ఉన్న కణితికి సర్జరీ చేసినప్పుడు, శరీరంలో కుడి వైపు అవయవాల్లో కొంత బలహీనత కనిపించవచ్చు. కుడివైపు సర్జరీ తర్వాత ఎడమ వైపు అవయవాలు బలహీన పడవచ్చు. అయితే ఈ బలహీనత కూడా తాత్కాలికమే! సర్జరీ తదనంతర ఫిజియోథెరపీతో ఈ సమస్యలన్నీ సర్దుకుంటాయి. కేవలం 2 నుంచి 3% రోగులకు మాత్రమే శాశ్వత లోపాలు తలెత్తుతాయి.

డాక్టర్ ఆర్. అయ్యాదురై,
సీనియర్ రోబోటిక్ న్యూరోసర్జన్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్.



పారాహుషార్

చాట్ జిపిటితో ఆరోగ్య ముప్పు

కృత్రిమ మేధస్సు ఎఐ చాట్ జిపిటి అందుబాటులోకొచ్చిన తర్వాత ఆరోగ్య సమస్యల పరిష్కారాలకూ, సూచనలకూ దాని మీద ఆధారపడే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. అయితే ఒక 60 ఏళ్ల వ్యక్తి చాట్ జిపిటి సూచించిన సలహాతో ఆస్పత్రి పాలైన ఉదంతమొకటి యానల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్‌లో తాజాగా ప్రచురితమైంది. ముగ్గురు వైద్యులు రాసిన ఆ నివేదికలో...

ఒక 60 ఏళ్ల వ్యక్తి చిత్తభ్రమలతో ఆస్పత్రికి చేరుకుని, పొరుగింటి వ్యక్తి తన మీద విష ప్రయోగం చేస్తున్నట్టు అనుమానం వ్యక్తం చేశాడు. అయితే అతనికి పరీక్షలు చేపట్టినప్పుడు విస్తుపోయే విషయం బయల్పడింది. అతను గత కొంతకాలంగా చాట్ జిపిటి సలహా మేరకు టేబుల్ సాల్ట్‌కు బదులుగా బ్రోమైడ్‌ను తీసుకుంటున్నట్టు వైద్యులు



కనిపెట్టారు. ఉప్పుతో పొంచి ఉండే ఆరోగ్య ముప్పుల నుంచి తప్పించుకోవడం కోసం ప్రత్యామ్నాయాన్ని సూచించమని చాట్ జిపిటిని అడిగినప్పుడు, అది బ్రోమైడ్‌ను సూచించిందనీ, ఆ సలహా మేరకు మూడు నెలలుగా తాను బ్రోమైడ్ తీసుకుంటున్నాననీ సదరు వ్యక్తి చెప్పడం జరిగింది. బ్రోమైడ్ టాక్సిసిటీ ఫలితంగా అతను చిత్తభ్రమలకు లోనైనట్టు కనిపెట్టిన వైద్యులు ఆ తర్వాత చికిత్సతో పరిస్థితిని సరిదిద్దారు. వాస్తవానికి బ్రోమైడ్‌ను పశువైద్యంలో భాగంగా, కుక్కలు, పిల్లుల మూర్ఛల చికిత్సలో పశువైద్యులు ఉపయోగిస్తూ ఉంటారు. ఇదే బ్రోమైడ్ ఉప్పు రూపంలో విస్తృతంగా దొరుకుతూ ఉండడంతో విదేశాల్లో వీటి వాడకం పెరుగుతోంది. అయితే అసలు విషయాన్ని నిర్ధారించుకునేందుకు వైద్యులు చాట్ జిపిటిని సంప్రతించి... 'క్లోరైడ్'కు ప్రత్యామ్నాయం ఏంటని అడిగినప్పుడు, ఆ ఎఐ... 'బ్రోమైడ్'ను సూచించింది. అంతేతప్ప, దాంతో ముడిపడి ఉండే ఆరోగ్య హెచ్చరికలను ప్రస్తావించలేదు. అలాగే ఆ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారని కూడా ఎదురు ప్రశ్నించలేదు.

ఇదే ప్రశ్న ఒక వైద్యుడిని అడిగినప్పుడు, కచ్చితంగా భిన్నమైన సమాధానం వచ్చి ఉండేదనీ, చాట్ జిపిటిలా వైద్యులు పొరపాట్లు చేసే ఆస్కారం ఉండదనీ, కాబట్టి వైద్య సలహాల కోసం ఎఐ మీద ఆధారపడడం మానుకోవాలనీ వైద్యులు సూచిస్తున్నారు.

కుక్క కాటుకు యాంటీ రేబీస్ దెబ్బ

కుక్క కరిచిన ప్రదేశాన్ని సబ్బు నీళ్లతో శుభ్రం చేసుకుని సరిపెట్టుకునే వాళ్లుంటారు. కానీ పెంపుడు కుక్క వీధి కుక్క... ఏది కరిచినా రేబీస్ రాకుండా ఇంజెక్షన్లు తీసుకోవడం తప్పనిసరి.



రేబీస్ వైరస్

కుక్కలకు సోకే రేబీస్ వైరస్ వాటి శరీరంలో దీర్ఘకాలం పాటు ఉండిపోతుంది. వ్యాధి తీవ్రమై, కుక్క ప్రాణాలు కోల్పోయే లోపు అది ఎంత మందిని కరిస్తే, అంతమందికీ రేబీస్ వైరస్ సోకుతుంది. అయితే కుక్కకు రేబీస్ సోకిందో లేదో తెలుసుకోవడం కోసం కుక్కలో కొన్ని లక్షణాలను మనం గమనించవచ్చు. అవేంటంటే..

- చలాకీగా కదిలే కుక్క అకస్మాత్తుగా నీరసించడం
- ఒంటరిగా ఉండిపోవడం
- నోటి నుంచి సొంగ కారడం
- నీటికి దూరంగా ఉండడం
- గుండ్రంగా తిరుగుతూ ఉండడం

ఇలాంటి లక్షణాలు కనిపించిన కుక్కకు దూరంగా ఉండాలి. వాటికి ఆహారం తినిపించడం, వాటితో ఆడడం లాంటివి చేయకూడదు.

ఏ కుక్క కరిచినా..

కుక్క కరిచినప్పుడు, ఎంత లోతుగా కరిచింది అనే దాని మీదే చికిత్స ఆధారపడి ఉంటుంది. కుక్క గోళ్లతో గోకడాన్ని గ్రేడ్ ఎగా, కొరికినప్పుడు పంటి గాటు ఏర్పడితే ఆ గాయాన్ని గ్రేడ్ బిగా, పంటిగాటుతో పాటు రక్తస్రావమైతే గ్రేడ్ సిగా పరిగణించాలి. ఈ గాయాలకు రేబిక్యూర్ వ్యాక్సిన్‌తో పాటు, రేబీస్ ఇమ్యునోగ్లోబ్యులిన్ కూడా ఇవ్వవలసి ఉంటుంది. కుక్కకు ఎలాంటి టీకాలు ఇప్పించకపోయినా, అది వీధి కుక్క అయినా, పెంపుడు కుక్క అయినా రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. సాధారణంగా చాలా మంది వీధిలో రోజూ కనిపించే కుక్క, దానికేం కాలేదు కాబట్టి మాక్కూడా ఏం జరగదు అని చికిత్సను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ అది ఎలాంటి కుక్క అయినా, ఎలాంటి లక్షణాలు లేకున్నా తప్పనిసరిగి వైద్యులను కలిసి ఇంజెక్షన్లు తీసుకోవాలి.

గాయాన్ని నాకడం, గీకడం, కొరకడం

గీకడం: కుక్క గోళ్లు గీసుకున్నప్పుడు వెంటనే సబ్బునీళ్లతో శుభ్రం చేసుకోవాలి

కొరికినప్పుడు: పన్ను లోపలకు దిగి రక్తం కారినప్పుడు, ఆ ప్రదేశంలో ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్ తీసుకోవాలి, రేబీస్ వ్యాక్సిన్ కూడా తీసుకోవాలి

గాయాన్ని నాకితే: సబ్బుతో గాయాన్ని కడిగి, ఆ ప్రదేశంలో ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్ తీసుకోవాలి, రేబీస్ వ్యాక్సిన్ కూడా తీసుకోవాలి




పెంపుడు కుక్కల నుంచి కుటుంబసభ్యులకు వ్యాధులు సోకుతాయి. కాబట్టి పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబీస్‌తో పాటు లెప్టోస్పైరోసిస్ లాంటి ఇతరత్రా వ్యాధులు రాకుండా సదరు టీకాలు కూడా ఇప్పించాలి.

దోసులు ఇలా...

పెంపుడు కుక్క: యాంటీ రేబీస్ టీకాలు ఇప్పించిన పెంపుడు కుక్క కరిచినప్పుడు మూడు డోసుల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు, ఏడవ రోజు 21 రోజు ఈ ఇంజెక్షన్లు తీసుకోవాలి.

వీధి కుక్క: ఈ కుక్క కరిచినప్పుడు ఐదు డోసుల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు, మూడో రోజు, ఏడవ రోజు, 14వ రోజు, 27వ రోజు ఈ ఇంజెక్షన్లు తీసుకోవాలి.

డాక్టర్ శ్రీకృష్ణ ఆర్ బొడ్డు,
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్,
కామినేని హాస్పిటల్స్
ఎల్‌బి నగర్, హైదరాబాద్.



రేబీస్ మెదడుకు సోకితే...

సాధారణంగా కుక్క కరిచిన కొన్ని రోజుల తర్వాత బాధితులు వైద్యులను కలుస్తూ ఉంటారు. కానీ ఆ కుక్కకు రేబీస్ ఉందో లేదో మనకు తెలియదు కాబట్టి వెంటనే వైద్యులను కలవాలి. కుక్క కరిచిన గాయం ద్వారా మన శరీరంలోకి చేరుకునే రేబీస్ వైరస్ అన్ని అవయవాలతో పాటు అంతిమంగా మెదడుకు కూడా చేరుకుంటుంది. వైరస్ మెదడుకు చేరుకోవడం ప్రాణాంతకం. ఈ దశకు చేరుకున్న తర్వాత చికిత్సతో సాధారణ స్థితికి తీసుకురావడం అసాధ్యం. కాబట్టి ఆలోగానే వైద్యులను కలిసి ఇంజెక్షన్లు మొదలుపెట్టాలి. రేబీస్ వైరస్ మన వ్యాధినిరోధక వ్యవస్థ మీద పూర్తిగా ఆధిపత్యం సాధించి, తన సంఖ్యను విస్తృతం చేసుకుంటుంది. ఈ వైరస్ ఉధృతమై మెదడుకు సోకినప్పుడు ఆయాసం, జ్వరం, దాహం వేస్తున్నా నీళ్ల తాగలేని పరిస్థితి, వెలుతురును తట్టుకోలేకపోవడం, గాలి కోసం తపన పడడం, చికాకు, విపరీత ప్రవర్తన, భౌతిక దాడికి పాల్పడడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ఇలా రేబీస్ మెదడుకు సోకిన రోగులకు చికిత్స లేదు కాబట్టి లక్షణాలను అదుపు చేసే చికిత్సలను అందించే రేబీస్ సెంటర్‌కు తరలించవలసి ఉంటుంది. రేబీస్ మెదడుకు సోకి చివరి దశకు చేరుకున్న రోగులు చికిత్సతో తిరిగి పూర్తి ఆరోగ్యం పొందిన దాఖలాలు ఇప్పటివరకూ లేవు. కాబట్టి కుక్క కరిచిన 24 గంటల్లోపే వైద్యులను కలిసి యాంటీ రేబీస్ చికిత్స మొదలుపెట్టుకోవాలి.

కిడ్నీ కేర్

మూత్రపిండాల సమస్యలు కొన్ని ప్రధాన లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటాయి. కానీ సాధారణంగా మనం వాటిని నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. అయితే కొన్ని కీలకమైన సంకేతాలను పసిగట్టగలిగితే, ముంచుకొచ్చే ముప్పును ముందస్తుగానే గుర్తించవచ్చని అంటున్నారు సికె బిర్లా హాస్పిటల్ నెఫ్రాలజిస్ట్, డాక్టర్ మోహిత్ ఖీర్బత్.

ఈ లక్షణాలు ప్రమాదకరం

మూత్రవిసర్జన: మూత్రవిసర్జనలో మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు. మూత్రం పెరిగినా, తగ్గినా, మూత్రం రాకపోతున్నా, మూత్రంలో నురగ కనిపిస్తున్నా మూత్రపిండాలు ముప్పులో పడ్డాయని అర్థం

నీరసం: మూత్రపిండాలు, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడే హార్మోన్‌ను సమకూరుస్తాయి. మూత్రపిండాల సామర్థ్యం దెబ్బతిన్నప్పుడు, హార్మోన్ క్షీణించి, ఎర్ర రక్త కణాల ఉత్పత్తి సన్నగిల్లి, రక్తహీనతతో నీరసం ఆవరిస్తుంది

పాదాలు, చేతుల వాపులు: మూత్రపిండాలు ఒత్తిడికి లోనైనప్పుడు శరీరంలో నీరు నిలిచి పోతుంది. దాంతో కాళ్లు, చేతుల వాపులు కనిపిస్తాయి



కళ్ల వాపు: ప్రొటీన్ నష్టం దెబ్బ తిన్న మూత్రపిండాలకు సూచన. దకళ్ల చుట్టూరా తలెత్తే వాపు ప్రొటీన్ నష్టాన్ని సూచిస్తుంది. కాబట్టి ఈ లక్షణాన్ని నిర్లక్ష్యం చేయకూడదు

శ్వాస సమస్య: మూత్రపిండాలు ఒత్తిడికి లోనవడం వల్ల, ఊపిరితిత్తుల్లో నీళ్ల చేరి లేదా రక్తహీనత వల్ల విశ్రాంత స్థితిలో సైతం ఊపిరి తీసుకోవడం కష్టంగా మారుతుంది

దురదలు: ఆరోగ్యకరమైన మూత్రపిండాలు వ్యర్థాలను వడగట్టి విసర్జనకు తోడ్పడతాయి. అవి దెబ్బతిన్నప్పుడు, వడపోతకు ఆటంకం ఏర్పడి, చర్మం పొడిబారుతుంది. దురదలు వేధిస్తాయి

వెన్ను నొప్పి: వెన్ను లేదా పక్కటెముల నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదు. ఈ లక్షణాలు కిడ్నీల్లో రాళ్లు, ఇన్‌ఫెక్షన్లకు సూచనలు

నా భర్తకు లైంగిక సామర్థ్యం లేదు.. 90 లక్షల భరణం ఇప్పించండి

» హైకోర్టులో ఒక మహిళ పిటిషన్

» ఆధారాలు లేవని కొట్టేసిన న్యాయస్థానం

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తన భర్తకు లైంగిక సామర్థ్యం లేదని.. వాస్తవాలను దాచిపెట్టి పెళ్లి చేసుకోవడం క్రూరత్వం కిందికే వస్తుంది కాబట్టి.. విడాకులతోపాటు తనకు రూ.90 లక్షల శాశ్వత భరణం ఇప్పించాలని ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఇటీవల కొట్టేసింది. తన భర్త రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నాడని, దానివల్ల అంగస్తంభన సమస్య కలిగిందని.. అతడికి తనతో లైంగిక బంధం కొనసాగించే సామర్థ్యం లేదని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. 2013 డిసెంబరు 11న తమకు పెళ్లయిందని.. వెంటనే తాము హనీమూన్‌కు కేరళకు వెళ్లామని, 2014లో కశ్మీర్‌కు రెండోసారి హనీమూన్‌కు వెళ్లామని.. రెండుచోట్లా తన భర్త తనతో శృంగారంలో పాల్గొనలేకపోయాడని తెలిపారు. అతడు వైవాహిక జీవితానికి పనికిరాడని.. సంతానోత్పత్తి సామర్థ్యం లేనివాడని 2017లో నిర్వహించిన వైద్యపరీక్షల్లో తేలిందని, 2018లో అతడు తనను అమెరికాలో వదిలిపెట్టి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. అయితే ఆమె భర్త ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. తామిద్దరం చాలాసార్లు శారీరకంగా ఒక్కటయ్యామని కోర్టుకు తెలిపారు. తొలుత తాను అంగస్తంభన సమస్య ఎదుర్కొన్నప్పటికీ, తర్వాత చికిత్స తీసుకున్నానని కోర్టుకు తెలిపారు. తన స్పెర్మ్ కౌంట్ సాధారణంగా ఉందని తెలిపే వైద్యనివేదికను కోర్టుకు సమర్పించారు. ఆ మహిళ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో పిటిషన్‌ను కొట్టేస్తూ జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ మధుసూదన్‌రావు ధర్మాసనం తీర్పు ఇచ్చింది.

మెడికల్ అడ్మిషన్లలో క్రీడా కోటా అమలు చేస్తారా?

» రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

వైద్య విద్య ప్రవేశాల్లో గతంలో అమలు చేసి, ఉపసంహరించుకున్న అరశాతం (0.5%) స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోటాను అమలు చేసే ఉద్దేశం ఉందా? అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మెడికల్ అడ్మిషన్లలో గతంలో అమలు చేసిన స్పోర్ట్స్ కోటాను పునరుద్ధరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. స్పోర్ట్స్ కోటా అమలు చేయాలా? వద్దా? అనేది ప్రభుత్వం తీసుకోవాల్సిన విధానపరమైన నిర్ణయం అని పేర్కొన్నారు. దీంతో ఈ అంశంపై ప్రభుత్వం తన అభిప్రాయం చెప్పాలని పేర్కొంటూ ధర్మాసనం విచారణను సెప్టెంబర్ 4వతేదీకి వాయిదా వేసింది.

యూకేలో తెలుగు యువకుడి ప్రతిభ

» స్ఫూర్తిదాయక వ్యక్తిగా ఐటీ ఇండస్ట్రీ అవార్డు

» అరేనా ఇన్నోవా బ్రాండ్ అంబాసిడర్‌గా మనోహర్ రెడ్డి



లూటన్ (యూకే): తెలుగు యువకుడు మనోహర్ రెడ్డి అంతర్జాతీయ వేదికలపై ఐటీ ఆవిష్కరణల్లో ప్రతిభను చాటారు. యూకేలోని ఐటీ ఇండస్ట్రీ అవార్డ్స్-2025లో స్ఫూర్తిదాయకమైన వ్యక్తి విభాగంలో రెండోసారి ఎంపికయ్యారు. 2024లో జరిగిన ఐదో ఎడిషన్‌లో ఆయన ప్రతిపాదించిన అటానమస్ సెక్యూరిటీ రోబోట్స్ ప్రాజెక్టుకు అవార్డు దక్కింది. విమానాశ్రయ భద్రతకు ఆ ప్రాజెక్టు కొత్త దిశ చూపుతుందని విశేష ప్రశంసలు పొందింది. ఈ ఏడాది ఆయన రూపొందించిన ఏఐ ఏరో ఆప్స్ డాష్‌బోర్డు ప్రాజెక్టుకు సైతం అవార్డు రానుంది. దీంతోపాటు మనోహర్‌రెడ్డి 2025 ఏడాదికి గాను స్పెయిన్‌లోని అరేనా ఇన్నోవాకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితుడయ్యారు.

రాంనగర్‌లో ఘనంగా ఆగమన వేడుకలు





బాణాసంచా వెలుగులలో ఖైరతాబాద్ గణేశుడు

రా.. రా.. గణేశా.. రావయ్యా.. గణేశా

నిమజ్జనమే కాదు.. ఆగమనమూ వేడుకే

» వేడుకగా మండపాలకు విగ్రహాలు

» డీజేలతో ట్రెండీగా మార్చేస్తున్న నవతరం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి అంటే.. మామూలు పండగ కాదు.. ఒక ఎమోషన్! పందిరి వెయ్యడం దగ్గర్నుంచీ.. నిమజ్జనం దాకా ప్రతిదీ ఒక వేడుకే. అయితే గతంలో పెద్దగా కనిపించని, ఈసారి మాత్రం ఎక్కువగా కనిపిస్తోన్న ధోరణి.. గణేశ ఆగమన వేడుకల నిర్వహణ. అదేమిటి అంటే.. వినాయక విగ్రహాలను తయారీదారుల నుంచి తాము ఏర్పాటుచేసిన మండపాల వద్దకు వేడుకగా తీసుకురావడం. మహిళలు సంప్రదాయ హారతులతో స్వాగతిస్తుండగా, సంగీతం,



ఎర్రగడ్డలో వినాయక విగ్రహాలు

నృత్యం, బాణాసంచా పేలుళ్లతో గణనాథుడ్ని వైభవంగా తాత్కాలికంగా ఏర్పాటుచేసిన మండపాలలో ప్రవేశపెడుతున్నారు. నిమజ్జనం మాత్రమే ఎందుకు.. స్వామివారి ఆగమనమూ వేడుకే కదా అంటూ నేటి యువత ఆ సంబరాలనూ సందడిగా నిర్వహిస్తూ ఈ కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా.. రాజధాని నగరంలో దాదాపుగా అన్ని ప్రాంతాలలోనూ ఈసారి గణేశ ఆగమన వేడుకలు భారీస్థాయిలో జరుపుతుండటం విశేషం. సామాజిక మాధ్యమాలు విస్తృతం కావడంతో ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో లైక్స్ కోసం కూడా కొంత మంది వినాయక ఆగమనమూ వేడుకగా నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లు ఘనంగా కనిపించేందుకు ప్రత్యేకంగా ధోల్ బృందాలను మహారాష్ట్ర లాంటి ప్రాంతాల నుంచి తీసుకురావడమే కాదు, భారీ సెట్టింగ్‌లనూ వేస్తున్నారు. ఇక బాణసంచా, డీజె, డ్రెస్ కోడ్, నృత్యాల గురించి ఎంత చెప్పినా తక్కువే. గత సంవత్సరం పాతబస్తీ, రాంనగర్‌లో ఈ ధోరణి కాస్త కనిపించింది కానీ, ఈ సారి నగరమంతా ఈ సందడి పాకింది. ఆగస్టు 18న కొత్తపేటలో, ఆగస్టు 20న 'లాల్ దర్వాజా కా రాజా' పేరిట పాతబస్తీలో ఆగమన యాత్ర అంగరంగ వైభోగంగా నిర్వహించారు. సుల్తాన్ బజార్, రాంనగర్ లలో కూడా భారీగానే ఈ తరహా యాత్రలు జరిగితే, మూసారాంబాగ్‌లోనూ 22 అడుగుల ఎత్తైన గణేశ విగ్రహాగమన వేడుకలు ఆకట్టుకున్నాయి. ఆగస్టు 24 న బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14 వెంకటేశ్వర నగర్‌లో కూడా భారీస్థాయిలోనే ఆగమన వేడుకలు జరిగాయి. ఈసారి ఖైరతాబాద్ గణేశుని వద్ద కూడా ఈ ఆగమన యాత్ర నిర్వహించడం మారుతున్న ట్రెండ్‌కు అద్దం పడుతోంది. ఏకంగా ఆరు రకాల బ్యాండ్‌లు, భారీ ఏర్పాట్లతో అక్కడ వేడుక నిర్వహించడం విశేషం. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్.. స్థానిక యువతతో కలసి సరదాగా స్టెప్పులేశారు.

ఖర్చెంతైనా..

గతంలో నిమజ్జనం వేళ కనిపించే మహారాష్ట్ర బ్యాండ్‌లు ఇప్పుడు ఆగమన వేడుకల్లోనే సందడి చేస్తున్నాయి. పాడ్ బ్యాండ్‌కు రూ.లక్ష, స్టాండింగ్ డీజెకు రూ.2 లక్షల నుంచి 5 లక్షలు, అలంకరణకు 50వేల నుంచి లక్ష లైటింగ్‌కు లక్ష ఇలా అన్నీ లక్షల్లోనే ఉన్నా.. ఎవరూ వెనక్కి తగ్గకపోవడం విశేషం.

అశ్వారావుపేటలో తీవ్ర ఉద్రిక్తత

అనుమానాస్పద స్థితిలో లక్ష్మి ప్రసన్న మృతి

అత్తింటి వారి వేధింపులవల్లేనని బంధువుల ఆరోపణ

భర్త, ఆడపడుచు, బావలకు దేహశుద్ధి

అశ్వారావుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కల్లూరు మండల వాసి పూల లక్ష్మి ప్రసన్న(33) ఆదివారం అనుమానాస్పద మృతితో సోమవారం 3 గంటల పాటు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆమె మృతి వార్తతో అశ్వారావు పేటకు చేరుకున్న లక్ష్మి ప్రసన్న కుటుంబీకులు, బంధువుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దాదాపు రెండేళ్లుగా ఆమెను గృహ నిర్బంధం చేసి.. తమతో మాట్లాడనివ్వకుండా సరిగ్గా ఆహారం పెట్టక, బాగోగులు చూడనందుకే పూర్తిగా బక్కచిక్కి మరణించిందని లక్ష్మి ప్రసన్న కుటుంబీకులు ఆరోపించారు. ఆమె భర్త నరేశ్, ఇతర నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. రాజమండ్రి నుంచి అంబులెన్సులో మృతదేహాన్ని తీసుకొస్తున్నారన్న సమాచారంతో ఆందోళన కారులు రింగ్ రోడ్డు సెంటర్ వద్ద బైఠాయించారు. అదే సమయంలో ఏ-2 నిందితుడిగా ఉన్న నరేశ్ బావ శ్రీను పోలీసు వాహనాన్ని నడుపుకుంటూ రావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులతో పోలీసులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. మృతురాలు ఆడబడుచు దాసరి భూలక్ష్మికి లక్ష్మి ప్రసన్న బంధువులు, భర్త నరేశ్, నరేశ్ బావ శ్రీనులకు కొందరు యువకులు దేహశుద్ధి చేశారు. పోలీసులు నిందితులను స్టేషన్‌కు తరలించారు. కేసును తప్పుదోవ పట్టించట్లేదని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, దర్యాప్తు తర్వాత అందుకు కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని లక్ష్మి ప్రసన్న బంధువులకు నచ్చచెప్పారు. చివరకు మృతదేహాన్ని భర్త ఇంటికి తరలించారు. భర్త కుటుంబీకులందరిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో మృతురాలి అంత్యక్రియలకు వారి బంధువులు ముందుకు రాలేదు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడానికి లక్ష్మి ప్రసన్న బంధువులు నిరాకరించారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో స్థానిక యువకులు.. మృతురాలి ఏడేళ్ల కూతురు ఇనివితతో తల్లి చితికి నిప్పంటించిన దృశ్యాలు చూపరులను కలచివేశాయి.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పవిత్ర

» పెన్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో తనదైన శైలిలో బోధన

» 45 మందికి అవార్డులు



సూర్యాపేట(కలెక్టరేట్)/హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉపాధ్యాయురాలు మారం పవిత్రకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. కేంద్ర విద్యా శాఖ 2025కి గాను మొత్తం 45 మందికి అవార్డులు ప్రకటించగా.. రాష్ట్రం నుంచి పవిత్ర ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఆరుగురి పేర్లను పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించగా.. మారం పవిత్రను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ ఉన్నత పాఠశాలలో ఆమె జీవశాస్త్రం బోధిస్తున్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పవిత్ర.. బోధనలో తనకంటూ ప్రత్యేకత శైలిని అనుసరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దీక్ష పోర్టల్‌లో 99 వీడియో పాఠాలను అప్‌లోడ్ చేశారు. సాంకేతికతను ఉపయోగించి పాఠాలు బోధిస్తూ విద్యార్థులకు జీవశాస్త్రంపై ఆసక్తి పెంచుతున్నారు. డిజిటల్ బోర్డులపై పాఠాలు ఇతర పాఠశాలలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఆటలతో నేర్చుకోవడం కోసం 40 కార్డుబోర్డు గేమ్స్‌ను సొంతంగా రూపొందించారు. తక్కువ ఖర్చుతో బోధనోపకరణాలను తయారుచేసి విద్యార్థులకు బోధిస్తున్నారు. పవిత్ర ఆధ్వర్యంలో అనేకమంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారు. పవిత్ర రూపొందించిన పరిశోధనా పత్రం బ్రిటిష్ కౌన్సిల్ సంచికలో ప్రచురితమైంది. ప్రస్తుతం పదోతరగతిలో ఉన్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, హోమ్ సైన్స్ పుస్తకాల రచయితల్లో ఈమె కూడా ఒకరు. పవిత్ర భర్త నాతాల మన్మధరెడ్డి సైతం ప్రభుత్వం ఉపాధ్యాయుడే. 'మాది వ్యవసాయ కుటుంబం. చిన్నతనంలోనే నాన్న మరణించడంతో అమ్మే నన్ను చదివించారు. డిగ్రీ సెకండ్ ఇయర్‌లో వివాహం జరిగింది. నా భర్త ప్రోత్సాహంతో డీఎస్సీలో ఎంపికయ్యా' అని పవిత్ర చెప్పారు. తనకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు దక్కడంపై సంతోషం వ్యక్తం చేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన మారం పవిత్రను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్, సూర్యాపేట కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అభినందించారు. కాగా, ఏపీలోని విశాఖకు చెందిన ఉపాధ్యాయురాలు శ్రీదేవికి కూడా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. ఈ అవార్డులను ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 5న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

భారీ యాక్షన్ షెడ్యూల్



యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్'. ఈ సినిమాను ప్రపంచస్థాయి యాక్షన్ సినిమాలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు మేకర్స్ తాజాగా ముంబైలో ఓ భారీ యాక్షన్ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు మేకర్స్ 45 రోజుల పాటు ఇది సాగనుంది. యాక్షన్ ప్రియులను ఎంతగానే అలరించిన 'జాన్ విక్', 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' చిత్రాలకు యాక్షన్ కొరియోగ్రఫీ అందించిన జేజే పెర్రీ ఈ పోరాట ఘట్టాల్ని కంపోజ్ చేయనున్నారు. ఈ యాక్షన్ షెడ్యూల్ కోసం ఆయన ఇండియన్ స్టంట్ టీమ్‌ను తీసుకోవడం విశేషం. భారతీయ సినిమా చరిత్రలో మునుపెన్నడూ చూడని యాక్షన్ సీక్వెన్స్‌లు ఇందులో ఉండబోతున్నాయని జేజే పెర్రీ తెలిపారు. ఇండియన్ స్టంట్ టీమ్ పనితనం వరల్డ్ క్లాస్‌గా ఉందని చెప్పారు. కె.వెంకట్‌నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 19న చిత్రం విడుదలవుతోంది. టొమినో థామస్, నయనతార, కియార అద్వానీ, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

శ్రీదేవి ఆస్తుల కోసం



దివంగత నటి శ్రీదేవి ఆస్తులు పొందేందుకు కొందరు యత్నిస్తున్నారని ఆమె భర్త బోనీ కపూర్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శ్రీదేవి 1988వ సంవత్సరంలో చెన్నై ఈస్ట్ కోస్టు రోడ్డు (ఈసీఆర్) సమీపంలో స్థలం కొనుగోలు చేసారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ముగ్గురు వ్యక్తులు నకిలీ వారసత్వ సర్టిఫికెట్లతో ఆ స్థలం పొందేందుకు యత్నిస్తున్నారని, వాటిని రద్దు చేస్తూ ఉత్తర్వులివ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం విచారించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేష్.. ఈ వ్యవహారంపై నాలుగు వారాల్లో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని తాంబరం తహసీల్దార్ కు ఉత్తర్వులు జారీ చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మంచి చిత్రాలను ప్రోత్సహిస్తా



"'కన్యాకుమారి' అందమైన స్ర్కీన్‌ప్లే ఉన్న మంచి వినోదాత్మక చిత్రం. ఇంత మంచి సినిమాకి సపోర్ట్ చేయాలనిపించింది. ఇదొక్కటే కాదు ఇలాంటి మంచి చిత్రాలు ఎన్ని వచ్చినా వాటికి నా ప్రోత్సాహం కచ్చితంగా ఉంటుంది. ఇలాంటి చిన్న చిత్రాలు ఎక్కువగా వస్తేనే ఇండస్ట్రీ బాగుంటుంది' అని అన్నారు ప్రముఖ నిర్మాత బన్నీవాస్. నటి మధుశాలిని సమర్పణలో సృజన్ అట్టాడ దర్శకత్వం వహించి, నిర్మించిన చిత్రం 'కన్యాకుమారి'. గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఇందులో బన్నీవాస్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూశాను. చాలా నిజాయితీగా తీశారు. మంచి స్ర్కీన్‌ప్లేతో అద్భుతంగా ప్రజెంట్ చేశారు' అని అన్నారు.

'పరదా'తో గర్వపడుతున్నా

అనుపమ పరమేశ్వరన్



'తెలుగు సినీ చరిత్రలోనే 'పరదా' సాహసోపేతమైన అడుగు. ఇటువంటి కథని నమ్మి ముందుకు వచ్చిన నిర్మాత విజయ్‌కి మనసారా కృతజ్ఞతలు. ఈ సినిమాలో నటించినందుకు నేను గర్వపడుతున్నా. నా కెరీర్‌లోనే అత్యుత్తమ నటన అంటూ రివ్యూస్ రావడం ఆనందంగా ఉంది. జాతీయ మీడియా మా సినిమా గురించి అద్భుతం అంటూ ప్రశంసించింది. ఇలాంటి ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తే మరిన్ని మంచి సినిమాలు వస్తాయి' అని అన్నారు హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రధారుగా ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన సినిమా 'పరదా' ఇటీవలె విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన థాంక్స్ మీట్‌లో అనుపమ మాట్లాడుతూ 'ఈ సినిమా విషయంలో నేనెప్పటికీ గర్వపడుతూనే ఉంటాను. కొన్ని సంవత్సరాల పాటు గుర్తుండిపోతుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు ప్రవీణ్ మాట్లాడుతూ 'సినిమాని సపోర్ట్ చేసిన రివ్యూ రైటర్స్‌కి కృతజ్ఞతలు. కొన్ని తప్పుల గురించి కూడా రాశారు. వాటిని నేను అంగీకరిస్తున్నా. అయితే ఇందులో చాలా అద్భుతమైన కంటెంట్ ఉంది. సినిమా చూసిన చాలా మంది దాన్ని మెచ్చుకున్నారు' అని అన్నారు. చిత్ర నిర్మాత విజయ్ మాట్లాడుతూ 'ఈ సినిమా చాలా మంది అమ్మాయిలకు వారి జీవితాల్ని గుర్తు చేసిందని ఒక పెద్దావిడ చెప్తుంటే చాలా ఆనందంగా అనిపించింది' అని అన్నారు. కార్యక్రమంలో నటుడు రాగ్ మయూర్, ఎడిటర్ ధర్మేంద్ర తదితరులు మాట్లాడారు.

ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు

నారా రోహిత్



'ఈ జనరేషన్‌కి ఇది చాలా కొత్త కథ. క్యారెక్టర్‌లో కొత్తదనం ఉంటుంది. అందరికీ కనెక్ట్ అవుతుంది. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు' అని అన్నారు హీరో నారా రోహిత్. ఆయన కథానాయకుడిగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'సుందరకాండ'. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ హీరోయిన్లు. సినిమా ఈనెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నారా రోహిత్ విలేకరులతో మాట్లాడుతూ 'డైరెక్టర్ వెంకటేశ్ ఈ కథ చెప్పినప్పుడు కంగారుపడ్డాను. ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారో అని అనిపించింది. అయితే అదే సమయంలో వచ్చిన 'బ్రో డాడీ' సినిమా 'సుందరకాండ'కు మార్గం చూపింది. ఆ స్టయిల్‌లో చేస్తే వర్కవుట్ అవుతుందనిపించి స్టార్ట్ చేశాం. ఇందులో నాది కాంప్లికేటెడ్ క్యారెక్టర్. ఆ కాంప్లికేషన్ నుంచే ఫన్ క్రియేట్ అవుతుంది. దర్శకుడు తాను అనుకున్న కథను చక్కగా తెరకెక్కించాడు. ఈ చిత్రంలో నరేశ్ క్యారెక్టర్ కూడా చాలా బావుంటుంది. ఆయన చాలా అనుభవం ఉన్న నటుడు. ఏ పాత్రనైనా చాలా అద్భుతంగా చేయగలరు' అని అన్నారు.

ఇది పక్కా కమర్షియల్

- రాజీవ్‌రెడ్డి



అనుష్కశెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రధారులుగా క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన సినిమా 'ఘాటి'. సెప్టెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాత రాజీవ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'ఒక సూపర్‌స్టార్ నటితో కమర్షియల్ యాక్షన్ మూవీ చేయాలనేది మెయిన్ ఐడియా. 'కర్తవ్యం'తర్వాత మళ్లీ ఆ స్థాయిలో సినిమా రాలేదు. ఇప్పుడున్న స్టార్స్‌లో అనుష్కకు అలాంటి సామర్థ్యాలున్నాయి. అలా 'ఘాటి' ప్రయాణం మొదలైంది. ఇది పూర్తిగా కమర్షియల్ యాక్షన్ సినిమా. ఇందులో క్రిష్ మార్క్ డ్రామా కూడా ఉంటుంది. అనుష్క అద్భుతంగా నటించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో ఎక్కువగా షూటింగ్ జరిపాం. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా అద్భుతంగా వచ్చింది. వరుణ్ తేజ్‌తో చేస్తున్న సినిమా దాదాపు 80 శాతం పూర్తయింది. 'అరేబియన్ కడలి సీజన్-2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది' అని వివరించారు.

కేజీఎఫ్ నటుడు దినేష్ కన్నుమూత



శాండల్‌వుడ్ విలక్షణ నటుడు దినేష్ మంగళూరు(55) సోమవారం కన్నుమూశారు. నటుడిగా, ఆర్ట్ డైరెక్టర్‌గా దినేష్ పేరు సంపాదించారు. కేజీఎఫ్ సినిమాలో ముంబై శెట్టి పాత్రను పోషించారు. హృదయ సంబంధిత జబ్బుతో బాధపడుతున్న ఆయన, ఉడుపి జిల్లా కుందాపుర కోటేశ్వర సర్జన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంతకాలం కిందట ఆయనకు గుండెపోటు రాగా, బెంగళూరులో చికిత్స చేయించుకున్నారు. సోమవారం మరోసారి అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు సర్జన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి బెంగళూరుకు తరలించే ప్రయత్నం చేస్తుండగానే మృతి చెందారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

చాలా సంతృప్తినిచ్చింది

- విజయ్‌పాల్ రెడ్డి అడిదల



'ఈ కథను మైథలాజికల్ జానర్‌ను జోడించి చెప్పడమే కొత్తగా ఉంటుంది. వరంగల్, విజయవాడలో ప్రీమియర్లు వేశాం. మూవీ అద్భుతంగా ఉందని అందరూ పొగిడారు. మాకు చాలా సంతృప్తినిచ్చింది' అని అన్నారు నిర్మాత విజయ్‌పాల్ రెడ్డి అడిదల. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. సత్యరాజ్, ఉదయభాను, వశిష్ఠ ఎన్ సింహా తదితరులు నటించారు. సినిమా ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విజయ్‌పాల్ రెడ్డి చిత్ర విశేషాల్ని విలేకరులతో పంచుకున్నారు. 'మొదట చిన్న బడ్జెట్‌తో సినిమా తీయాలనుకున్నాం. సినిమా తీస్తే బాగా తీయండి లేదంటే లేదు అని డైరెక్టర్ మారుతి ఖరాఖండిగా చెప్పారు. దాంతో భారీ స్థాయిలోనే సినిమా తీయాలని నిర్ణయించుకున్నాం. ఇది కొత్తరకం కథ. చాలా ఉత్కంఠభరితంగా ఉంటుంది. మలయాళంలోలా చాలా సహజంగా తీశాం. తెలుగు ప్రేక్షకులకు కావాల్సిన కమర్షియల్ అంశాలన్నీ జోడించాం. ఇన్ ఫ్యూజన్ బ్యాండ్ ఇచ్చిన పాటలు అద్భుతంగా ఉన్నాయి. ఆర్ఆర్ అదిరిపోయింది. మా ప్రొడక్షన్స్‌లో వరుసగా చిత్రాలు తీయాలనే ఉద్దేశంతో ఇండస్ట్రీకి వచ్చాను. 'త్రిబాణధారి బార్బరిక్‌'తో పాటు 'బ్యూటీ' మూవీని ప్రారంభించాం' అని అన్నారు.

ప్రజ్ఞానందకు వరుసగా ఐదో డ్రా

సెయింట్ లూయిస్ (యూఎస్): సింక్యుఫీల్డ్ కప్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద వరుసగా ఐదో గేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. ఆరో రౌండ్‌లో పోలెండ్ జీఎం జాన్ క్రిజిస్ టోఫ్‌తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 32 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. అలీరెజా ఫిరోజా (ఫ్రాన్స్)తో గేమ్‌ను వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు డ్రాగా ముగించాడు. మొత్తం ఆరు రౌండ్ల నుంచి ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో, గుకేష్ 3 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉన్నారు.

క్విటోవా బై..బై



వరల్డ్ మాజీ నెం.1, 2011, 2014 వింబుల్డన్ విజేత పెట్రా క్విటోవా టెన్నిస్‌కు వీడ్కోలు పలికింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 35 ఏళ్ల క్విటోవా యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో 1-6, 0-6తో డ్యానీ ప్యారీ చేతిలో ఓటమిపాలైంది. కాగా, యూఎస్ ఓపెన్ తనకు కెరీర్‌లో చివరిదని క్విటోవా ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. బిడ్డకు జన్మనివ్వడంతో 2024 సీజన్ మొత్తం ఆటకు దూరంగా ఉన్న క్విటోవా..గత ఫిబ్రవరిలో పునరాగమనం చేసినా ఆశించిన మేర రాణించలేకపోయింది.

చాను రికార్డు స్వర్ణం



- తెలుగమ్మాయి భవానికి రజతం
- కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్

అహ్మదాబాద్: గాయం నుంచి కోలుకొని ఏడాది తర్వాత రీఎంట్రీ ఇచ్చిన టోక్యో ఒలింపిక్స్ రజత పతక వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనతో అదరగొట్టింది. సోమవారం జరిగిన కామన్వెల్త్ చాంపియన్‌షిప్ మహిళల 48 కిలోల విభాగంలో చాను.. స్నాచ్‌లో 84 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలతో మొత్తం 193 కిలోల బరువు ఎత్తి స్వర్ణం సొంతం చేసుకొంది. ఎత్తిన చాను కామన్వెల్త్ రికార్డులను బద్దలుకొట్టింది. ఓవరాల్‌గా గతంలో కంటే అధికంగా 14 కిలోల బరువు ఎత్తింది. మలేసియా లిఫ్టర్ ఐరెనీ హెన్రీ 161 (73+88) కిలోలు ఎత్తి రజతం, వేల్స్ లిఫ్టర్ నికోల్ రాబర్ట్స్ 150 (70+80) కిలోలు లిఫ్ట్ చేసి కాంస్యం దక్కించుకొన్నారు. పురుషుల 60 కిలోల కేటగిరీలో జాతీయ క్రీడల చాంపియన్ రిషికాంత్ సింగ్ 271 (120+151) కిలోలు ఎత్తి బంగారు పతకం నెగ్గాడు. గతంలో మీరాబాయి 49 కిలోల కేటగిరీలో పోటీపడేది. అయితే, విశ్వక్రీడల నుంచి ఆ విభాగాన్ని తొలగించడంతో 48 కిలోల విభాగానికి మారింది. ఇక, ఇదే టోర్నీ సబ్ జూనియర్ విభాగంలో తెలుగమ్మాయి రెడ్డి భవాని పతకంతో సత్తా చాటింది. ఏపీలోని విజయనగరానికి చెందిన భవాని మహిళల 48 కిలోల కేటగిరిలో రజత పతకం గెలుచుకుంది. స్నాచ్‌లో 66 కిలోలు ఎత్తిన భవాని.. క్లీన్ అండ్ జెర్క్‌లో 92 కిలోలు లిఫ్ట్ చేసింది. దీంతో ఓవరాల్‌గా 158 కిలోల బరువుతో భవాని రెండోస్థానంలో నిలిచింది.

మెద్వెదెవ్ అవుట్

యూఎస్ ఓపెన్

- తొలి రౌండ్‌లోనే ఇంటిదారి
- జొకో, సబలెంక బోణీ



ఓటమి అనంతరం అసహనంతో రాకెట్ విరగ్గొట్టిన మెద్వెదెవ్

న్యూయార్క్: రష్యా స్టార్ డానిల్ మెద్వెదెవ్‌కు వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్‌లోనూ మొదటి రౌండ్‌లో చుక్కెదురైంది. 2021 యూఎస్ ఓపెన్ చాంపియన్ మెద్వెదెవ్‌కు ఫ్రాన్స్ ఆటగాడు బెంజమిన్ బోన్జీ మళ్లీ షాకిచ్చాడు. ఇక ఏడో సీడ్ నొవాక్ జొకోవిచ్, టాప్ సీడ్ సబలెంక, నాలుగో సీడ్ పెగుల, ఏడో సీడ్ పోలిని, 10వ సీడ్ నవారో శుభారంభం చేశారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో అన్‌సీడెడ్ బోన్జీ 6-3, 7-5, 6-7 (7), 0-6, 6-4తో 13వ సీడ్ మెద్వెదెక్‌కు ఝలకిచ్చాడు. వింబుల్డన్ మొదటి రౌండ్‌లో కూడా డానిల్‌ను బోన్జీ తిరుగుముఖం పట్టించడం గమనార్హం. ఇక..25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న జొకోవిచ్ 6-1, 7-6 (3), 6-2తో టీన్‌పై గెలుపొంది రెండో రౌండ్‌కు చేరాడు. ఇతర మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-5, 6-2, 6-4తో ఎమీలో నవాపై, 21వ సీడ్ మక్‌హాక్ 6-3, 6-1, 6-1తో నార్డీపై, నకాషిమా 6-2, 6-7 (7), 2-6, 6-2, 7-6 (10)తో జోంగ్‌పై నెగ్గి రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు. డిఫెండింగ్ చాంపియన్ సబలెంక 7-5, 6-1తో రెబెకా మసరోవాని, పెగుల 6-0, 6-4తో మయార్ షరీఫ్‌ను, పోలిని 6-2, 7-6 (4)తో ఐవాని, 10వ సీడ్ నవారో 7-6 (9), 6-3తో వాంగ్‌ని, 16వ సీడ్ బెన్సిక్ 6-3, 6-3తో జాంగ్‌ని, అజరెంకా 7-6 (0), 6-4తో ఇనోని ఓడించారు.

అలెగ్జాండ్రా సంచలనం



ఫిలిప్పీన్స్‌కు చెందిన 20 ఏళ్ల అలెగ్జాండ్రా యాలా సంచలనం సృష్టించింది. తొలి రౌండ్‌లో 6-3, 2-6, 7-6 (13–11)తో 14వ సీడ్ క్లారా టాసన్‌ను చిత్తు చేసింది. తద్వారా ఓపెన్ ఎరాలో గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రా మ్యాచ్ గెలిచిన తొలి ఫిలిప్పీన్స్ ప్లేయర్‌గా అలెగ్జాండ్రా రికార్డుకెక్కింది. భారీ సంఖ్యలో విచ్చేసిన ఫిలిప్పీన్స్ దేశస్థులు ప్రోత్సహిస్తుండగా ఐదడుగుల తొమ్మిది అంగుళాల పొడగరి అయిన యాలా విజృంభించి ఆడింది. మూడో సెట్‌లో 1-5 వెనుకంజలో నిలిచినా అద్భుతంగా పోరాడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

ఇషా బృందానికి కాంస్యం

- నీరూ డబుల్ గోల్డ్
- ఆసియా షూటింగ్



షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ ఇషాసింగ్ పతకం సాధించింది. సోమవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో ఇషా సింగ్, మనూ భాకర్, సిమ్రన్‌ప్రీత్ కౌర్ త్రయం మూడోస్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. చైనా స్వర్ణం, కొరియా రజత పతకం అందుకున్నాయి.

నీరూకు రెండు స్వర్ణాలు: జాతీయ క్రీడల చాంపియన్ నీరూ ధండ రెండు స్వర్ణాలతో దుమ్మురేపింది. తొలుత మహిళల ట్రాప్‌లో నీరూ పసిడి పతకం కొల్లగొట్టింది. భారత్‌కే చెందిన ఆషిమా అహ్లావత్ కాంస్య పతకం నెగ్గింది. అనంతరం నీరూ, ఆషిమా, ప్రీతీ రజాక్ బృందం మహిళల ట్రాప్ టీమ్ పసిడి పతకం సొంతం చేసుకుంది. పురుషుల ట్రాప్ విభాగంలో భౌనీష్ రజతం నెగ్గాడు. జూనియర్ మహిళల 25 మీ. పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్లు పాయల్ ఖత్రి, నామ్యా కపూర్, తేజస్విని వరుసగా

స్పాన్సర్‌షిప్ నుంచి డ్రీమ్ 11 అవుట్

- రూ.358 కోట్ల ఒప్పందం రద్దు
- మరో కంపెనీ వేటలో బీసీసీఐ



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ల జెర్సీలపై ఇక నుంచి డ్రీమ్-11 లోగో కనిపించదు. టీమిండియా ప్రధాన స్పాన్సరర్‌గా కొనసాగుతున్న ఈ ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీ తమ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్-నియంత్రణ బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారింది. దీంతో డ్రీమ్ స్పోర్ట్స్ కంపెనీ తమ ఒప్పందం నుంచి వైదొలిగింది. ఈ విషయాన్ని అటు బీసీసీఐ కూడా ధ్రువీకరించింది. 2023లో మూడేళ్ల కాలానికి డ్రీమ్-11తో బోర్డు రూ.358 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే డ్రీమ్-11 ఇలా మధ్యలోనే తమ స్పాన్సర్‌షిప్‌ను రద్దు చేసుకున్నా బీసీసీఐ జరిమానా విధించే అవకాశం లేదు. ఎందుకంటే నిబంధన ప్రకారం.. కంపెనీ ప్రధాన వ్యాపారాన్ని ఏదైనా ప్రభుత్వ చట్టం ప్రభావితం చేస్తే స్పాన్సర్‌షిప్ నుంచి వైదొలిగినా నష్టపరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉండదు. మరోవైపు వచ్చేనెల 9 నుంచి ఆసియా కప్ జరగనున్న తరుణంలో ఈ పరిణామం బీసీసీఐని ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే డ్రీమ్ 11 లోగోలతో కూడిన ఆటగాళ్ల జెర్సీలు కూడా సిద్ధమయ్యాయి. కానీ వాటిని ఉపయోగించడానికి లేదు. ఈ టోర్నీకి స్పాన్సర్లు లేకుండానే జట్టు వెళ్తుందా? లేక మరో 15 రోజుల్లోనే బోర్డు కొత్త స్పాన్సర్‌తో ఒప్పందం కుదుర్చుకుంటుందా? అనేది తేలాలి. మరోవైపు టొయోటా కంపెనీ స్పాన్సర్‌షిప్‌పై ఆసక్తిగా ఉన్నట్టు సమాచారం.

రోహిత్‌ను సాగనంపేందుకే..

బ్రాంకో టెస్టుపై మనోజ్ తివారీ



న్యూఢిల్లీ: భారత క్రికెటర్లను మరింత ఫిట్‌గా ఉంచే ప్రక్రియలో బీసీసీఐ ఇటీవల కొత్తగా బ్రాంకో టెస్టును ప్రవేశపెట్టింది. అయితే వెటరన్ స్టార్ రోహిత్ శర్మను జట్టులోంచి తప్పించేందుకు ఈ టెస్టును తీసుకువచ్చారని మాజీ ఆటగాడు మనోజ్ తివారీ సంచలన ఆరోపణ చేశాడు. '2027 వన్డే వరల్డ్‌కప్ జట్టులో విరాట్‌ను తీసుకోకుండా ఉండలేరు. అతడి ఫిట్‌నెస్ స్థాయి అలాంటిది. కానీ రోహిత్‌ను పక్కనబెట్టాలని బోర్డు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. అందుకే కొన్ని రోజుల క్రితం కఠినమైన బ్రాంకో టెస్టును ప్రవేశపెట్టారు. రోహిత్ శరీరతత్వం ఎలా ఉంటుందో అందరికీ తెలుసు. కచ్చితంగా తను ఈ టెస్టులో పాస్ అవలేడు. కోచ్ గంభీర్ ఇప్పుడే దీన్ని ఎందుకు అమలు చేయాలనుకుంటున్నాడో అర్థమవుతుంది' అని తివారీ వివరించాడు. అలాగే తాను శ్రీలంక పర్యటనలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించినా జట్టులో చోటు దక్కలేదని, బహుశా అప్పటి కెప్టెన్ ధోనీకి నచ్చలేదేమోనని తెలిపాడు.

గంభీర్ స్థానంలో గంగూలీ?

జోరుగా ఊహాగానాలు



న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్లకు డైరెక్టర్, మెంటార్‌గా వ్యవహరించిన మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. తాజాగా సౌతాఫ్రికాకు చెందిన ఎస్‌ఏ20 లీగ్ జట్టు ప్రిటోరియా క్యాపిటల్స్‌కు కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ వార్త సోషల్ మీడియాలో ఊహాగానాలకు తెరలేపింది. ఫ్రాంచైజీ కోచ్‌గా బాధ్యతలు తీసుకొన్నాడంటే.. అతడు త్వరలో భారత కోచ్‌గా వస్తాడంటూ చర్చ మొదలైంది. ఇవన్నీ ఊహాగానాలుగా భావిస్తున్నా.. వాటిల్లో నిజం లేకపోలేదంటున్నారు విశ్లేషకులు. ప్రస్తుత కోచ్ గంభీర్ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సత్తాచాటినా టెస్ట్‌లకు వచ్చేసరికి కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి. రోహిత్, కోహ్లీ, అశ్విన్‌లాంటి ప్లేయర్ల రిటైర్మెంట్‌తో ఆయా స్థానాలు భర్తీచేసే వారి కోసం వెతకాల్సి ఉంది. ఈ క్రమంలో గంగూలీ అయితే జట్టును మెరుగ్గా తీర్చిదిద్దుతాడని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కానీ, సీజన్ మధ్యలో కోచ్‌లను తప్పించే సంప్రదాయం బీసీసీఐకు లేదు. అన్నింటికంటే ముందు కోచ్‌గా దాదా తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం కూడా ఉంది.

లక్ష్య సేన్‌కు నిరాశ

- తొలిరౌండ్లోనే వెనుదిరిగిన భారత స్టార్
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



పారిస్: వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత ఏస్ షట్లర్ లక్ష్య సేన్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ పోరులో సేన్ 17-21, 19-21తో వరల్డ్ నెం.1 షి యు కి (చైనా) చేతిలో పోరాడి ఓడాడు. తొలి గేమ్‌లో ఆరంభంలో ఇద్దరూ 6-6తో సమవుజ్జీలుగా కనిపించినా.. వరుసగా 4 పాయింట్లు సాధించిన షి యు 11-9తో బ్రేక్‌కు వెళ్లాడు. తర్వాత 11-11తో సేన్ సమం చేసినా.. వరుసగా ఐదు పాయింట్లు స్కోరు చేసిన చైనా షట్లర్ 16-11తో మెరుగైన ఆధిక్యం సాధించాడు. అదే జోరులో తొలి గేమ్‌ను నెగ్గాడు. రెండో గేమ్‌లో 9-11తో వెనుకంజలో ఉన్న సమయంలో పుంజుకొన్న సేన్ 16-16తో సమం చేశాడు. ఆ తర్వాత షి యు ఆధిక్యంలోకి దూసుకెళ్లినా.. సేన్ 19-19తో మరోసారి సమం చేశాడు. అయితే, కీలక సమయంలో సేన్ అనవసర తప్పిదాలతో మ్యాచ్ చైనా షట్లర్ సొంతమైంది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రుతుపర్ణ-శ్వేతపర్ణ జంట 12-21, 11-21తో బల్గేరియా జోడీ గాబ్రియెలా-స్టెఫానీ చేతిలో, ప్రియ-శ్రుతి మిశ్రా ద్వయం 17-21, 16-21తో ఫ్రాన్స్ జంట మార్గాట్ లాంబర్ట్-కమెల్లీ చేతిలో పరాజయం పాలయ్యారు.

హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ మెగా డీల్

- 2.65 లక్షల చ.అ ఆఫీస్ స్పేస్ లీజుకు తీసుకున్న టెక్ దిగ్గజం
- నెలకు రూ.5.4 కోట్ల అద్దె



హైదరాబాద్: అమెరికా టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. హైదరాబాద్‌లో వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ సెంటారస్ బిల్డింగ్‌లో 2.65 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని (ఆఫీస్ స్పేస్) లీజుకు తీసుకుంది. హైదరాబాద్‌లోని ఆఫీస్ స్పేస్ మార్కెట్లో ఇప్పటివరకు కుదిరిన అతిపెద్ద లీజు ఒప్పందాల్లో ఇదొకటి. రియల్ ఎస్టేట్ డేటా ప్లాట్‌ఫామ్ ప్రాప్‌స్టాక్ ప్రకారం.. వర్క్‌స్పేస్ నిర్వహణదారు టేబుల్ స్పేస్ టెక్నాలజీస్ నుంచి ఫీనిక్స్ సెంటారస్‌లోని 3,4 అంతస్థులను మైక్రోసాఫ్ట్ ఇండియా ఐదేళ్ల కాలానికి లీజుకు తీసుకుంది. ఈ జూలై 1 నుంచి ఒప్పందం అమలులోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.67 చొప్పున మొత్తం స్థలానికి మైక్రోసాఫ్ట్ నెలకు రూ.1.77 కోట్ల కనీస అద్దె, నిర్వహణ వ్యయాలు, ఇతర చార్జీలు కలిపి మొత్తం రూ.5.4 కోట్లు చెల్లించనుంది. ఏటా అద్దె 4.8 శాతం పెరగనుంది. అంతేకాదు, సెక్యూరిటీ డిపాజిట్ కింద మైక్రోసాఫ్ట్ రూ.42.15 కోట్లు జమ చేసినట్లు ప్రాప్‌స్టాక్ తెలిపింది. వాస్తవానికి టేబుల్ స్పేస్ టెక్నాలజీస్ ఈ స్థలాన్ని బిల్డింగ్ యజమాన్య సంస్థ ఫీనిక్స్ టెక్ జోన్ నుంచి లీజుకు తీసుకుంది.

1998 నుంచి నగరంలో సంస్థ కార్యకలాపాలు: మైక్రోసాఫ్ట్ ఇండియాలో తన తొలి ఆర్ అండ్ డీ సెంటర్‌ను హైదరాబాద్‌లో 1998లో ఏర్పాటు చేసింది. అమెరికా వెలుపల కంపెనీ నిర్వహిస్తోన్న అతిపెద్ద ఆర్ అండ్ డీ సెంటర్ ఇదే. గచ్చిబౌలిలోని కంపెనీ క్యాంపస్ ప్రస్తుతం ఇంజనీరింగ్, కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ సేవలపై దృష్టి సారిస్తోంది. ఫీనిక్స్ సెంటారస్‌లోని క్యాంపస్ మరిన్ని ఆర్ అండ్ డీ బృందాలు, టెక్నాలజీ విభాగాలకు నెలవు కానుంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పుణె, నోయిడాల్లోనూ మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు సాగిస్తోంది.

ఆఫీస్ స్పేస్‌కు హైదరాబాద్ అడ్డా: భారత్‌లో ప్రీమియం, ఏ గ్రేడ్ ఆఫీస్ స్పేస్ అడ్డాల్లో హైదరాబాద్ ఒకటి. పలు అంతర్జాతీయ టెక్నాలజీ, ఆర్థిక సేవల కంపెనీల కార్యాలయాలతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు నెలవుగా మారింది నగరం. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టింగ్ సేవల కంపెనీ నైట్‌ఫ్రాంక్ డేటా ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్‌లో కోటి చదరపు అడుగుల కార్యాలయ స్థలం లీజు ఒప్పందాలు కుదిరాయి. అందులో టెక్నాలజీ దిగ్గజ కంపెనీలదే అధిక వాటా అని నైట్‌ఫ్రాంక్ పేర్కొంది.

బిజినెస్

భారత్ రేటింగ్ యథాతథం

ట్రంప్ సుంకాల ప్రభావం అంతంతే ● ఫిచ్ రేటింగ్

న్యూఢిల్లీ: భారత సార్వభౌమ పరపతి రేటింగ్‌ను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఫిచ్ రేటింగ్ సోమవారం ప్రకటించింది. బలమైన వృద్ధితో పాటు విదేశీ నిధులు భారీగా తరలి వస్తుండటం రేటింగ్‌ను యథాతథంగా కొనసాగించేందుకు దోహదపడ్డాయని తెలిపింది. ఈ అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఇండియాకు గతంలో స్థిరమైన వైఖరితో కూడిన 'బీబీబీ మైనస్' రేటింగ్‌ను కేటాయించింది. పెట్టుబడులకు అనుకూలమైన కనిష్ఠ రేటింగ్ ఇది. కాగా, మరో అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ ఈ మధ్యనే భారత పరపతి రేటింగ్‌ను బీబీబీ స్థాయికి పెంచింది. కాగా దేశ ఆర్థిక వృద్ధిపై ట్రంప్ ప్రతిపాదిత 50 శాతం సుంకాల ప్రభావం అంతంత మాత్రమేనని ఫిచ్ అభిప్రాయపడింది.

ఫ్లిప్‌కార్ట్‌లో 2.2 లక్షల సీజనల్ ఉద్యోగాలు

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ రాబోయే పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సరఫరా, లాజిస్టిక్స్, డెలివరీ విభాగాల్లో 2.2 లక్షల సీజనల్ ఉద్యోగాలను సృష్టించింది. ఇది కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కేవలం పండగల కోసం ఏర్పాటు చేసిన డెలివరీ కేంద్రాల్లో మరో 650 ఉద్యోగాశాలు అందుబాటులోకి రానున్నట్టు కంపెనీ తెలిపింది. కంపెనీలో మహిళా నియామకాలు 10 శాతం పెరగనున్నట్టు వెల్లడించింది. అలాగే దివ్యాంగులకు కూడా ఈ పండగ సీజన్‌లో మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు ఫ్లిప్‌కార్ట్ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	540
వరంగల్	497	గోదావరి	535
చిత్తూరు	558	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	98	విజయవాడ	112
వరంగల్	98	గుంటూరు	112
కరీంనగర్	98	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	88
కర్నూలు	98	నెల్లూరు	93
విశాఖపట్నం	116	అనంతపురం	93
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,510 ▼	93,050 ▼	1,31,000 ▲
విజయవాడ	1,03,200 ▲	96,500 ▲	1,19,900 ▲
విశాఖపట్నం	1,03,450 ▲	93,050 ▲	1,21,000 ▼
రాజమండ్రి	1,01,520 ▼	93,050 ▼	1,18,500 ▲
ప్రొద్దుటూరు	1,02,050 ▲	93,890 ▲	1,18,500 ▲
ముంబై	1,00,488 ▲	92,047 ▲	1,16,133 ▲

ఫర్నీచర్‌పైనా ట్రంప్ సుంకాలు!

అక్టోబరులో ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ: అమెరికాలోకి దిగుమతయ్యే ఫర్నీచర్‌పైనా సుంకాలు విధిస్తానని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత వారాంతంలో సంకేతాలిచ్చారు. ప్రస్తుతం తమ దేశంలోకి ఫర్నీచర్ దిగుమతులపై దర్యాప్తును ప్రారంభించడం జరిగిందని, 50 రోజుల్లో పూర్తవనున్న దర్యాప్తు అనంతరం ఎంత మేర సుంకాలు విధించాలనేది నిర్ణయిస్తామన్నారు. ఇది భారత ఫర్నీచర్ ఎగుమతులపైనా గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే, ప్రపంచంలో అమెరికానే అతిపెద్ద ఫర్నీచర్ దిగుమతిదారు. ప్రపంచ దిగుమతుల్లో 30 శాతం వాటా అమెరికాదే. గత ఏడాది యూఎస్ 2,896 కోట్ల డాలర్ల విలువైన ఫర్నీచర్‌ను దిగుమతి చేసుకుంది. అందులో 60 శాతం చైనా, వియత్నాం నుంచే తరలిపోయింది. కాగా, అమెరికాకు భారత్ ఎనిమిదో అతిపెద్ద ఫర్నీచర్ ఎగుమతిదారు. జీటీఆర్ఐ డేటా ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో మన దేశం నుంచి 110 కోట్ల డాలర్ల విలువైన ఫర్నీచర్, బెడ్లు, పరుపులు అమెరికాకు ఎగుమతయ్యాయి. మన ఫర్నీచర్ సంబంధిత మొత్తం ఎగుమతుల్లో అమెరికాదే 45 శాతం వాటా.

హైదరాబాద్‌లో హిల్టన్ హోటల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ అంతర్జాతీయ హోటల్స్ సంస్థ హిల్టన్ హైదరాబాద్‌లో మరో స్టార్ హోటల్ ఏర్పాటు చేయనుంది. గచ్చిబౌలిలో హిల్టన్ హైదరాబాద్ గచ్చిబౌలి పేరుతో 304 రూమ్స్‌తో ఈ లగ్జరీ స్టార్ హోటల్ ఏర్పాటు కానుంది. శ్రీ వెంకటేశ్వర హోటల్స్ అండ్ కన్వెన్షన్‌తో కలిసి హిల్టన్ ఈ హోటల్‌ను అభివృద్ధి చేస్తోంది. అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసే ఈ హోటల్ 2029 జనవరి నాటికి అందుబాటులోకి రానుంది. హిల్టన్ ఇప్పటికే హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో ఒక స్టార్ హోటల్ ఏర్పాటు చేస్తోంది.

దేశం ముందు కీలక సవాళ్లు

- బ్యాంకులు, కంపెనీలు చేతులు కలపాలి
- పెట్టుబడులు పెంచాలి



ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

ముంబై: అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ కీలక సవాళ్లు ఎదుర్కోనుందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. పెట్టుబడులు పెంచడం ద్వారా వీటిని ఎదుర్కోవచ్చని అన్నారు. ఇందుకోసం బ్యాంకులు, కంపెనీలు చేతులు కలపాలని కోరారు. అమెరికా సుంకాలతో దెబ్బతినే రంగాలను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కూడా ఆయన హామీ ఇచ్చారు. ముంబైలో ఫిక్కీ, ఐబీఏ నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌బీఐ ద్రవ్య విధానం ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తూనే వృద్ధికి దోహదం చేసేలా ఉంటుందన్నారు.

చర్యలు తీసుకుంటాం: గత ఆర్థిక సంవత్సరం (2024-25) బ్యాంకుల పరపతి వృద్ధి రేటు మూడేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంపైనా మల్హోత్రా మాట్లాడారు. దీన్ని సరిదిద్దేందుకు ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా కంపెనీలు తమ నిధుల కోసం ప్రైవేటు రుణాలు, క్యాపిటల్ మార్కెట్లపై మొగ్గు చూపడం ఇందుకు ప్రధాన కారణమని ఇదే సదస్సులో పాల్గొన్న ఎస్‌బీఐ చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు కంపెనీల దీర్ఘకాలిక రుణ అవసరాలపై దృష్టి పెట్టడం మంచిదన్నారు.

విలీనాలు, కొనుగోళ్ల ఫండింగ్‌ను అనుమతించాలి

ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి

నీరసించిన పరపతి వృద్ధి రేటు పెంచుకునేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా లిస్టెడ్ కంపెనీల కొనుగోళ్లు, విలీనాలకు అవసరమైన నిధులు సమకూర్చేందుకూ ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి ఫండింగ్‌పై ఉన్న నిషేధాన్ని తొలగించాలని త్వరలో ఆర్‌బీఐని కోరబోతున్నాయి. ఫిక్కీ, ఐబీఏ నిర్వహించిన సదస్సులో ఎస్‌బీఐ, ఐబీఏ (ఐబీఏ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఈ విషయం వెల్లడించారు. పూర్తి పారదర్శక పద్ధతిలో కొనుగోళ్లు, విలీనాలకు రెగ్యులేటరీ సంస్థలు, వాటాదారులు అనుమతించినప్పుడు, అలాంటి కొనుగోళ్లు, విలీనాలకు నిధులు సమకూర్చడంలో పెద్ద రిస్క్ ఉండదన్నారు. ప్రస్తుతం కంపెనీలు తమ నిధుల అవసరాల్లో ఎక్కువ భాగాన్ని ఈక్విటీ, రుణ పత్రాలు, అంతర్గత వనరుల ద్వారానే సమకూర్చుకుంటున్న విషయాన్ని శెట్టి గుర్తు చేశారు.

మార్కెట్‌కు కొనుగోళ్ల మద్దతు

సెన్సెక్స్ 329 పాయింట్లు అప్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో సోమవారం ఐటీ, ఆటోమొబైల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ర్యాలీతో పాటు అమెరికన్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్న ఆశలతో ఇన్వెస్టర్ సెంటిమెంట్ బలపడింది. సర్వత్రా సానుకూల సంకేతాల నడుమ సెన్సెక్స్ 329.06 పాయింట్ల లాభంతో 81,635.91 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 491.21 పాయింట్ల లాభంతో 81,799.06 వరకు వెళ్లింది. మరోవైపు నిఫ్టీ 97.65 పాయింట్ల లాభంతో 24,967.75 వద్ద ముగిసింది.

అంకాలజీ విభాగంలోకి జీఎస్‌కే

న్యూఢిల్లీ: గైనకాలజీ క్యాన్సర్లకు ప్రెసిషన్ థెరపీ అందుబాటులోకి తేవడం ద్వారా అంకాలజీ విభాగంలోకి ప్రవేశించినట్టు గ్లాక్సో స్మిత్‌క్లైన్ ఫార్మాస్యూటికల్స్ (జీఎస్‌కే) ప్రకటించింది. దేశీయ మార్కెట్లోకి కంపెనీ జెంపెర్లి (దోస్టార్‌లిమాబ్), జెజూలా (నిరాపరిబ్) ఔషధాలను విడుదల చేసింది. ఇవి మహిళల క్యాన్సర్ చికిత్సలో అర్థవంతమైన పురోగతిని తెస్తాయని జీఎస్‌కే ఇండియా ఎండీ భూషణ్ అక్షికర్ అన్నారు.

ఫార్మాపై ఒకే జీఎస్‌టీ ఉండాలి: ఫార్మెక్సిల్

న్యూఢిల్లీ: ప్రతిపాదిత జీఎస్‌టీ సవరణలో ఔషధాలు, వాటి ముడి పదార్థాలపై ఒకే పన్ను రేటు ఉండాలని ఫార్మా పరిశ్రమ కోరుతోంది. ప్రస్తుతం తుది ఔషధాల (ఫార్ములేషన్లు)పై 12 శాతం, వాటి తయారీకి ఉపయోగించే ప్రధాన ముడి పదార్థం ఏపీఐలపై 18 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తున్నారు. ప్రతిపాదిత సవరణలో ఈ వ్యత్యాసాన్ని సవరించి రెంటిపైనా ఒకే జీఎస్‌టీ రేటు విధించాలని భారత ఔషధ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెక్సిల్) వైస్ చైర్మన్ భవిన్ మెహతా కోరారు. ఔషధాలపై ప్రస్తుతం ఉన్న జీఎస్‌టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించి, ఏపీఐలపై అదే స్థాయిలో 18 శాతం సుంకాలు విధించినా పరిశ్రమకు మంచిది కాదన్నారు.

డిసెంబరు కల్లా కొత్త ఐటీ నిబంధనలు

న్యూఢిల్లీ: కొత్త ఆదాయ పన్ను చట్టం (ఐటీ) నిబంధనలను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఈ ఏడాది డిసెంబరు చివరికల్లా నోటిఫై చేయబోతోంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సభ్యుడు ఆర్‌ఎన్ పర్బత్ ఈ విషయం వెల్లడించారు. నిబంధనలతో పాటు సరళీకరించిన ఐటీ ఫారాలను కూడా విడుదల చేస్తామన్నారు. పార్లమెంట్ ఆమోదించిన కొత్త ఐటీ చట్టానికి రాష్ట్రపతి ముర్ము ఈ నెల 21న ఆమోద ముద్ర వేశారు. దీంతో వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త ఐటీ చట్టం అమల్లోకి రానుంది.



ఇందిరాపార్కు వద్ద జరిగిన ఆశావర్కర్ల ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

'ఆశా'లకు 18 వేల వేతనం ఇవ్వాలి

» స్థానిక ఎన్నికల్లోపు వారి సమస్యలు పరిష్కరించాలి

» లేకపోతే కాంగ్రెస్ పార్టీకి వారే బుద్ధి చెబుతారు: హరీశ్

కవాడిగూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల లోపు ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే వారే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. తమ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఇందిరాపార్క్ వద్ద ఆశా వర్కర్లు నిర్వహించిన ధర్నాలో హరీశ్‌రావు, ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే ప్రభుత్వం దగ్గర పైసలు లేవని సీఎం రేవంత్ దాటవేస్తున్నారని విమర్శించారు. డబ్బుల్లేనప్పుడు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఇగిరేషన్ శాఖల్లో 26వేల కోట్ల పనుల కోసం టెండర్లను ఎలా పిలిచారని ఆయన ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీలో రేవంత్‌రెడ్డి బంధువుల భూముల అభివృద్ధి కోసం టెండర్లను పిలుస్తున్నారని విమర్శించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన బిల్డింగ్‌ను.. గజానికో పోలీసును పెట్టి ఇనుప కంచెలు నిర్బంధాల మధ్య రేవంత్‌రెడ్డి ప్రారంభించడానికి వెళ్లి యూనివర్సిటీని ఉద్ధరిస్తానని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రారంభించిన పనులకు రిబ్బన్లు కట్ చేసుకుంటూ జేబులో కత్తెర పెట్టుకొని రేవంత్ తిరుగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరంలోపే రెండులక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేసిన సీఎం రేవంత్ ఇప్పుడే ఏ ముఖం పెట్టుకొని ఉస్మానియా యూనివర్సిటీకి వెళుతున్నారని అన్నారు. దమ్ముంటే గన్‌మెన్, పోలీసులు లేకుండా సీఎం ఒక్కడే ఓయూకి రావాలని ఆయన సవాల్ విసిరారు.

కేంద్రంలో బడా మోదీ.. రాష్ట్రంలో చోటా మోదీ

» రాహుల్.. ఆటలో అరటిపండు: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బడా మోదీ.. రాష్ట్రంలో చోటా మోదీ... కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారని, వీరి మధ్య రాహుల్‌గాంధీ ఆటలో అరటిపండు కావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య అనేక పోలికలున్నాయని, హామీల అమలులో ఇద్దరూ విఫలమయ్యారని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో సోమవారం బీజేపీ నాయకురాలు అలూరి విజయభారతిసహా పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ వ్యవహార శైలి చూస్తుంటే రేపోమాపో మోదీతో కలిసిపోయేలా ఉన్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ సీఎంకు బీజేపీ ఎంపీలు కొమ్ముకాస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణకు ద్రోహం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ ఒకటేనని, పరిశ్రమలు, పెట్టుబడులు, విభజన హామీల అమలులో తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. గోదావరి నీళ్లను దిగువకు పంపి ఏపీలోని బనకచర్ల, అక్కడినుంచి తమిళనాడుకు నీటిని తరలించేందుకు మోదీ, చంద్రబాబు ఆదేశాలతో రేవంత్‌రెడ్డి కుట్రచేస్తున్నారని ఆరోపించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కేసీఆర్ పునాది వేసిన భవనాలనే.. నేడు రేవంత్‌రెడ్డి ప్రారంభించి వచ్చారని ఎద్దేవా చేశారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలి

» లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: ఆర్ కృష్ణయ్య

కవాడిగూడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా బీసీల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం గత 19 నెలలుగా బీసీ రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేస్తుందన్నారు. సోమవారం ఇందిరాపార్కువద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షను ఆర్ కృష్ణయ్య చేపట్టారు. ఈ దీక్షకు ఎంపీ ఈటల రాజేందర్, మండలిలో విపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు జరిగేలా ప్రభుత్వం వెంటనే ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. లేనిపక్షంలో బీసీ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ బీజేపీ ఎల్లప్పుడూ బీసీ పక్షమేనని, 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు జరిగేంతవరకు వెనక్కి తగ్గబోమన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు మాట్లాడారు. సత్యాగ్రహ దీక్ష చేపట్టిన ఆర్ కృష్ణయ్యకు పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ విజీఆర్ నారగోని నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపజేశారు.

రేవంత్ పరివారాన్ని కోస్తే కోట్లు వస్తాయి: క్రిశాంక్

హైదరాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికలప్పుడు కడుపు కట్టుకొని హామీలు అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు తనను కోసుకు తిన్నా పైసల్లేవంటున్నారని, ప్రభుత్వంలో లేకున్నా ఆయన కుటుంబ పరివారాన్ని కోస్తే కోట్లకు కోట్లు వస్తాయని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఎన్నికల ముందు అంతంత మాత్రంగా ఉన్న రేవంత్‌రెడ్డి అన్నదమ్ములు, బంధువర్గం ఇప్పుడు వేలకోట్లు వెనకేసుకుందన్నారు. రేవంత్‌రెడ్డి కుటుంబం అవినీతి, అరాచకాలకు పాల్పడుతోందని, వారి దోపిడీపై ఏబీసీ ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి అమృత్ టెండర్లు కట్టబెట్టారని, ఆయన యశోదా కంపెనీకి సింగరేణి కాంట్రాక్టులు అప్పగించారన్నారు. ప్రభుత్వ యాడ్స్ వ్యవహారం అంతా సీఎం సోదరుడు కృష్ణారెడ్డి కనుసన్నల్లో నడుస్తోందన్నారు. పీసీసీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు రేవంత్ తిరిగేందుకు ల్యాండ్‌క్రూయిజర్ కారు ఇచ్చిన కె.ఎల్.ఎస్.ఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు రూ.320 కోట్ల కాంట్రాక్టు కట్టబెట్టారని క్రిశాంక్ ఆరోపించారు.

రేవంత్‌కు కోర్టులంటే గౌరవంలేదు: దాసోజు

కోర్టు పరిధిలోని అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఇష్టాను సారం మాట్లాడడం సరికాదని, ఆయనకు కోర్టులన్నా.. కోర్టు తీర్పులన్నా.. గౌరవం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. కోదండరామ్ గొంతు కోశామంటూ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో సీఎం చేసిన వ్యాఖ్యలను దాసోజు శ్రవణ్ ఖండించారు. తీర్పు వచ్చేవరకు ఎమ్మెల్సీలుగా ఎవరిని నామినేట్ చేయమని కోర్టుకు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ వెంటనే కోదండరామ్, అమీర్ అలీఖాన్‌ను నామినేట్ చేయగానే గవర్నర్ ఆమోదించడం అన్యాయం కాదా? అని ప్రశ్నించారు. దీనిపై తాము సుప్రీం కోర్టుకు వెళ్లడం తప్పెలా అవుతుందో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. కోదండరామ్ పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న రేవంత్‌రెడ్డి.. నిజంగానే ఆయనపై గౌరవం ఉంటే తన పదవి నుంచి దిగిపోయి ఆయన్ను సీఎం చేయాలని డిమాండ్ చేశారు.

కడియం ఓ అవినీతి తిమింగలం: టీ రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒక అవినీతి తిమింగలమని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. కడియం కేవలం తన వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి పెట్టారని, నియోజకర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. కడియం శ్రీహరికి బినామీ పేర్లతో దేశవిదేశాల్లోనూ ఆస్తులున్నాయని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్నపుడు ఉద్యోగాలు అమ్ముకున్నారని, హైడ్రల్ ప్రాజెక్టులు, ఇతర కాంట్రాక్టుల నుంచి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

శ్రీశైలానికి 6 అలైన్‌మెంట్లు!

(మొదటిపేజీ తరువాయి)

పాటు 6 అలైన్‌మెంట్లలో దేనికి, ఎన్ని నిధులు అవసరమవుతాయనే వివరాలను పేర్కొన్నారు. టోల్ ప్లాజ్‌లు, బైపాస్‌లు, గ్రామాలు ఉన్న చోట నిర్మించతలపెట్టిన ర్యాంపులు, ఘాట్‌లో చేపట్టే రోడ్డు నిర్మాణ అంశాలను కూడా పొందుపర్చారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో చేపడితే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. నివేదికను పరిశీలించి, కేంద్రం ఆమోదం తెలిపితే.. వెంటనే సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్)ను ఖరారు చేసి.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉంటుంది. ఈ రహదారి పూర్తయి, అందుబాటులోకి వస్తే హైదరాబాద్-శ్రీశైలంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లేందుకు ప్రయాణ సమయం తగ్గడంతో పాటు, దూరం కూడా తగ్గనుంది. మార్గం మధ్యలో ఒక టోల్‌ప్లాజా, రెండు బైపాస్‌లు రానున్నాయి. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని, ఏటా భక్తులు పెరుగుతున్నారని, ఈ మార్గంలో కొత్త రోడ్డు అవసరమన్న విషయాన్ని నివేదికలో తెలిపారు.

ఇదీ విషయం..

తెలంగాణలోని పలు ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లాలంటే హైదరాబాద్-శ్రీశైలం- నంద్యాల జాతీయ రహదారే ఆధారం. ప్రస్తుత రోడ్డు రిజర్వ్ ఫారెస్ట్ నుంచి వెళ్తుండడంతో ఈ మార్గంలో మన్ననూరు చెక్‌పోస్టు దగ్గర రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రయాణాలకు అవకాశం లేదు. ఈ దారిలో 30-40 కి.మీ. కంటే ఎక్కువ వేగం వెళ్లేందుకు వీల్లేదు. వెరసి శ్రీశైలం వెళ్లే భక్తులతో పాటు ఆంధ్రప్రదేశ్ వెళ్లే ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం దాదాపు 55 కి.మీ. మేర కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించాలని భావించింది. ఇందుకోసం మన్ననూరు నుంచి పాతాళగంగ వ రకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని నిర్ణయించింది. ఆ మేరకు అలైన్‌మెంట్‌ను సిద్ధం చేసి గతంలోనే కేంద్రానికి అందించింది. దాన్ని పరిశీలించిన కేంద్రం.. పూర్తి వివరాలను పంపాలని సూచించింది. దీంతో 6 రకాల అలైన్‌మెంట్లను సిద్ధం చేసి, తాజాగా కేంద్రానికి నివేదించింది. ఆ నివేదిక 'ఆంధ్రజ్యోతి'కి లభించింది.



ఎలివేటెడ్ కారిడార్‌కే మొగ్గు!

మొత్తం ఆరు రకాల అలైన్‌మెంట్లను రూపొందించినప్పటికీ వీటిలో ఎలివేటెడ్ కారిడార్ ఆమోదయోగ్యంగా ఉందని నివేదికలో పేర్కొన్నారు. 6 అలైన్‌మెంట్లను ఒకదానితో మరొకటి పోల్చుతూ సమగ్ర వివరాలను తెలిపారు. ఉదాహరణకు ఎలివేటెడ్ కారిడార్ విధానంలో ట్రాఫిక్ ఎంత పెరిగినా ఇబ్బంది ఉండదు. భారీ వాహనాలు కూడా వెళ్లొచ్చు. 24 గంటలు ప్రయాణాలకు అనుకూలంగా ఉంటుంది. అదే రోప్‌వే విధానంలో అయితే రాత్రి పూట ప్రయాణాలు ఇబ్బంది, ప్రయాణ సమయం ఎక్కువగా ఉండనుంది. ఇక సొరంగ మార్గంలోనూ భారీ వాహనాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలా మిగిలిన అలైన్‌మెంట్ల గురించి కూడా వివరించారు.

2023 నుంచి ప్రతిపాదనల దశలోనే..

కొత్త అలైన్‌మెంట్ల ప్రకారం ఈ మార్గం మన్ననూరు చెక్‌పోస్టుకు కొంచెం ముందుగా బ్రాహ్మణపల్లి నుంచి ప్రారంభమై.. ఈగలపెంట తర్వాత ముగుస్తుంది. ఈ మధ్యలో మన్ననూరు, వట్టర్‌పల్లి దగ్గర రెండు బైపాస్‌లను, ఆ తర్వాత ఒకచోట టోల్ ప్లాజా, రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. ఘాట్ రోడ్డు దగ్గర ప్రత్యేకంగా నిర్మాణాలుంటాయి. ఏపీ సరిహద్దు వచ్చే దగ్గర కృష్ణా నదికి కొంచెం పక్కనుంచి ఈ ఎలివేటెడ్ కారిడార్ వెళ్లనుంది. వాస్తవానికి ఈ ప్రాజెక్టును 2022-23 వార్షిక ప్రణాళికలో కేంద్రం తెలంగాణకు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఇది ప్రతిపాదనల దశలోనే ఉంది. తాజాగా కదలికలు మొదలయ్యాయి.

ఆ 6 అలైన్‌మెంట్లు ఇవే..

1 మొత్తం 6 అలైన్‌మెంట్లలో రోప్‌వే మొదటిది. ఒక క్యాబిన్‌లో 15 మందిని తరలించే అవకాశం ఉంది. ఈ విధానంలో ప్రయాణ సమయం 3-3.30 గంటలు పట్టనుంది. నిర్మాణ వ్యయం 4,213 కోట్లు అవుతుందని అంచనా.

2 రోప్‌వే 32.45 కి.మీ., మరో 7.70 కి.మీ. రోడ్డు మార్గం ఉండేలా అలైన్‌మెంట్. రోప్‌వే నిర్మాణానికి 3,569.5 కోట్లు, రోడ్డు నిర్మాణానికి 385 కోట్లు కలిపి మొత్తం 3,954 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ విధానంలో ప్రయాణ సమయం 4.30 గంటలు పడుతుందని అంచనా.

3 రోప్‌వే 9.4 కి.మీ., ఎలివేటెడ్ కారిడార్ 35.22 కి.మీ., రోడ్డు మార్గం 7.70 కి.మీ. ఉండేలా అలైన్‌మెంట్. ఇందులో రోప్‌వేకు రూ.1,034 కోట్లు, ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.4,226.4కోట్లు, రోడ్డుకు రూ.385 కోట్లు కలిపి రూ.5,645 కోట్లు అవసరమని తేల్చారు. ఈ విధానంలో ప్రయాణ సమయం 2.30 గంటలు పట్టనుంది.

4 టన్నెల్ విధానం. భూగర్భ మార్గం గుండా ప్రయాణించేలా రెండు రకాల అలైన్‌మెంట్లు రూపొందించారు. ఇందులో ఆప్షన్-1లో 40 కి.మీ. సొరంగం, ఒక కిలోమీటరు రోడ్డు, టన్నెల్ బోరింగ్ మెషిన్ విధానంలో దీని నిర్మాణానికి రూ.29 వేల కోట్లు అవసరమని తేల్చారు. ఆప్షన్-2లో 33 కి.మీ. సొరంగం, 7 కి.మీ. రోడ్డు ఉంది. న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ విధానంలో రూ.16,200 కోట్ల నిధులు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

5 సొరంగం 24 కి.మీ., ఎలివేటెడ్ కారిడార్ 15 కి.మీ., మరో 7.5 కి.మీ. రోడ్డు విధానంలో నిర్మించేలా అలైన్‌మెంట్ రూపొందించారు. ఈ మార్గాన్ని టన్నెల్ బోరింగ్ మెషిన్ విధానంలో నిర్మిస్తే రూ.19,455 కోట్లు, న్యూ ఆస్ట్రియన్ విధానంలో అయితే రూ.11,775 కోట్లు అవసరమని అంచనా.

6 మొత్తం 54.91 కి.మీ. మార్గంలో 45.19 కి.మీ. మేర 4 వరసలతో ఎలివేటెడ్ కారిడార్, మరో 9.72 కి.మీ. మేర రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. దీని నిర్మాణానికి మొత్తం 148 హెక్టార్ల భూమి అవసరమవుతోంది. ఇందులో అటవీ భూమి 129 హెక్టార్లు, అటవీయేతర భూమి 19 హెక్టార్లు. నిర్మాణానికి సుమారు రూ.7,668 కోట్లు అవసరమని పేర్కొన్నారు. ఇందులో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కి.మీ.కు రూ.115 కోట్ల చొప్పున రూ.5,500 కోట్లు, ఘాట్‌రోడ్డు వెడల్పుకు రూ.175 కోట్లు, ఎట్‌గ్రేడ్ రోడ్డుకు రూ.195 కోట్లు చొప్పున నిధులు అవసరమని తెలిపారు.



వైద్య విద్యలో

నకిలీ దందా!

నకిలీ పత్రాలతో కుంభకోణం

» ఎన్నారై కోటా కింద 18 వేల ఎంబీబీఎస్, పీజీ సీట్ల భర్తీ

» బెంగాల్, ఒడిశాలలో గుర్తింపు

» ఏజెంట్లతో కాలేజీల కుమ్మక్కు

» బట్టబయలు చేసిన ఈడీ

న్యూఢిల్లీ, ఆగస్టు 25: వైద్య విద్య ప్రవేశాల్లో ప్రవాస భారతీయుల(ఎన్నారై) కోటా కింద జరిగిన భారీ కుంభకోణాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు బట్టబయలు చేశారు. నకిలీ పత్రాలు, ఎన్నారై సర్టిఫికెట్లతో ఎంబీబీఎస్, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏకంగా 18 వేల సీట్లను ప్రైవేటు మెడికల్ కాలేజీలు భర్తీ చేసినట్టు గుర్తించారు. ఈ సీట్లన్నీ ఎన్నారై కోటాలోనివేనని ఈడీ అధికారులు తెలిపారు. విదేశాంగ శాఖ, భారత విదేశీ వ్యవహారాల మిషన్‌తో కలిసి ఈ వ్యవహారంపై ఈడీ ముమ్మర దర్యాప్తు చేసింది. ప్రైవేటు వైద్య కళాశాలలు.. నకిలీ పత్రాలు, నకిలీ ఎన్నారై సర్టిఫికెట్ల ఆధారంగా 18 వేల సీట్లలో అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ దందాలో కొందరు ఎన్నారైల ప్రమేయం కూడా ఉన్నట్టు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఏజెంట్ల పాత్ర కీలకంగా ఉందని, వారు ఎన్నారైలను సంప్రదించి వారికి కొంత మొత్తం సొమ్మును ముట్టజెప్పి వివరాలు తెలుసుకున్నట్టు నివేదికలో వివరించారు. ఈ వ్యవహారంపై సమాచారం అందగానే పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో దాడులు చేసిన ఈడీ అధికారులు.. వందల కొద్దీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకుని, వాటిని భారత దౌత్య కార్యాలయాలకు పంపించారు. వీటిలో ఎక్కువగా నకిలీవే ఉన్నాయని తెలిపారు. అమెరికాకు చెందినవి పేర్కొన్న సర్టిఫికెట్లలో నకిలీ నోటరీలనూ గుర్తించారు. ప్రవాస భారతీయులతో సంబంధాలు ఉన్నాయని పేర్కొన్న సర్టిఫికెట్లు కూడా నకిలీవేనని ఈడీ అధికారులు పేర్కొన్నారు. ఒకే తరహా సర్టిఫికెట్లను ఎక్కువ మంది వినియోగించారని గుర్తించారు. 'స్పాన్సర్స్' పేరుతో కళాశాలల తరఫున ఏజెంట్లే చక్రం తిప్పారని, భారీ మొత్తంలో సొమ్మును దోచుకున్నారని తెలిపారు. అయితే, స్పాన్సర్లు ఎవరూ సొమ్ము చెల్లించలేదని, విద్యార్థుల తల్లిదండ్రులే చెల్లించారని పేర్కొన్నారు. ఫలితంగా ఎన్నారై కోటా అసలు ఉద్దేశం గాడి తప్పిందని ఈడీ అధికారులు తెలిపారు. అయితే, ఇంత మోసం జరిగినప్పటికీ ఒడిశా, బెంగాల్ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. నకిలీ సర్టిఫికెట్ల దందా ఆరోపణలు ఎదుర్కొంటున్న కాలేజీలకు సంబంధించి.. రూ.18.75 కోట్లను ఫ్రీజ్ చేసినట్టు తెలిపారు.

ఆనాడు చేర్చుకున్న 60 మందితో ఎందుకు రాజీనామా చేయించలేదు?

» కేటీఆర్‌ను నిలదీసిన ఎంపీ చామల

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పాలనలో 60 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలను పార్టీలో చేర్చుకున్నప్పుడు.. వారితో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో దమ్ము ఎందుకు నిరూపించుకోలేదని కేటీఆర్‌ను నిలదీశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సీఎం అయ్యాకే హైదరాబాద్ అభివృద్ధి చెందినట్లుగా కేటీఆర్ మాట్లాడుతున్నాడని, వాస్తవానికి పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కట్టింది 4 ఫ్లైఓవర్లు, దుర్గంచెరువు వద్ద సెల్ఫీ పాయింట్ మాత్రమేనన్నారు. కేటీఆర్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టుకోవడానికే హైదరాబాద్‌ను వాడుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పట్టుమని పది జెడ్పీటీసీలు లేని బీజేపీకి స్థానిక ఎన్నికల్లో సగానికిపైగా సీట్లు వస్తాయంటూ రాంచందర్ రావు బీరాలు పలుకుతున్నాడని ఎద్దేవా చేశారు.

జూబ్లీహిల్స్‌లో జనహిత సభ 30కి వాయిదా..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మంగళవారం జరగాల్సిన జనహిత పాదయాత్ర, సభ.. ఈ నెల 30వ తేదీకి వాయిదా పడింది. రాహుల్‌గాంధీ బిహార్‌లో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, మహేశ్‌గౌడ్ తదితరులందరూ వెళ్తున్న నేపథ్యంలో సభను వాయిదా వేశారు.

కరీంనగర్‌లో ఒకే ఇంట్లో 40 ఓట్లు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ఓట్ల చోరీతోనే మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చారని పునరుద్ఘాటించారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ తరఫున ఎంపీలు గెలవడంపై తమకు అనుమానం ఉందని పేర్కొన్నారు. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఆరు నెలలకే పార్లమెంట్ ఎన్నికలు జరిగితే.. కోటి ఓట్లు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం బీజేపీకి వత్తాసు పలకడం ప్రజల దౌర్భాగ్యమని అన్నారు. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ బిహార్‌లో చేస్తున్న పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్ర వరంగల్ జిల్లాలోని ఇల్లంద నుంచి వర్ధన్నపేట వరకు ఉత్సాహంగా సాగింది. వర్ధన్నపేటలో నిర్వహించిన జనహిత పాదయాత్ర సభతోపాటు కరీంనగర్ జిల్లా గంగాధరలో నిర్వహించిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో మహేశ్‌గౌడ్ మాట్లాడారు. బీసీలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. బీజేపీ తలచుకుంటే ఒక్క రోజులోనే బీసీ రిజర్వేషన్ల చట్టం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు వెళ్లేది 1-2శాతం మాత్రమేనని తెలిపారు. బీసీ అయిన బండి సంజయ్‌కుమార్ బీసీ రిజర్వేషన్లపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. సంజయ్ సహా బీజేపీ ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, అర్వింద్ సమయం ఇస్తే రిజర్వేషన్లపై వివరిస్తామని చెప్పారు. కేంద్ర మంత్రిగా బండి సంజయ్ కరీంనగర్‌కు ఎన్ని పరిశ్రమలు తెచ్చారని, నిజామాబాద్‌లో అర్వింద్ ఏం అభివృద్ధి చేశారని నిలదీశారు. దేవుడి పేరు చెప్పనిదే మళ్లీ వీళ్లు గెలవలేరని అన్నారు. అసలు తెలంగాణలో ప్రతిపక్షం ఉందా? అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు ప్రతిపక్షం హోదా ఎందుకు? అని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగిపోయిందని విచారణకు ఆదేశిస్తే, బీఆర్ఎస్ నాయకులు కోర్టుకు వెళ్లడం విచారకరమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, ప్రజా కోర్టులో ఆ పార్టీ నేతలకు శిక్ష పడక తప్పదని హెచ్చరించారు. కేటీఆర్, కవిత మధ్య ఆస్తుల పంచాయితీ.. పదేళ్లైనా తెగదని, బీఆర్ఎస్ సైతం రెండు వర్గాలుగా చీలిపోయిందని ఎద్దేవా చేశారు. మూడేళ్ల తర్వాత జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చే శారు. దేశంలో బీజేపీ అరాచక పాలన సాగిస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గాంధేయ మార్గంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో పాల్గొంటుంటే.. బీజేపీ మాత్రం దొంగిలించిన ఓట్లతో అధికారాన్ని అనుభవిస్తోందని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన.. దేశానికి ఒక మోడల్‌గా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

మహేశ్‌గౌడ్ దిష్టిబొమ్మల దహనం

కరీంనగర్/ఎల్కతుర్తి/భీమదేవరపల్లి: బండి సంజయ్‌ను ఉద్దేశించి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్, హుజూరాబాద్, ఇల్లందకుంట, తిమ్మాపూర్, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో మహేశ్‌గౌడ్ దిష్టిబొమ్మలను దహనం చేశాయి. మానకొండూర్‌లో రాస్తారోకో నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మతిలేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఓట్ చోరీ జరిగితే.. కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు.

పొలం పనులు వదిలి పడిగాపులు

» రోజంతా నిల్చుంటే దక్కేది ఒకటీ రెండు బస్తాలే

» కొన్ని చోట్ల అది కూడా దొరక్క రైతులకు నిరాశ

» రాష్ట్రంలో కొనసాగుతున్న యూరియా కష్టాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా యూరియా కోసం అన్నదాతల కష్టాలు కొనసాగుతున్నాయి. ఎదుగుతున్న పంటలకు అదును దాటక ముందే ఎరువు వేయాల్సి ఉండటంతో యూరియా కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలం పనులు వదిలి యూరియా పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. జనం కిక్కిరిసిపోతుండటంతో యూరియా దొరుకుతుందో లేదోనని తెల్లవారుజాము నుంచే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) ఎదుట రైతులు బారులు తీరుతున్నారు. చెప్పులు, ఆధార్ కార్డులను క్యూలో పెట్టి చెట్ల కింద కూర్చుంటున్నారు. అయితే, రోజంతా ఎదురుచూసినా ప్రతి కేంద్రంలో ఒక్కో రైతుకు ఒకటి లేదా రెండు బస్తాలు మాత్రమే అందుతున్నాయి. లైన్‌లో ఉన్నా.. కొందరికి అవి కూడా దొరకడం లేదు. దీంతో అన్నదాతలు నిరాశగా వెనుదిరుగుతున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని పీఏసీఎస్‌లో యూరియా స్టాక్ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా మర్పల్లి గోదాం నుంచి యూరియా సరఫరా అయిన తర్వాత కూడా ఫర్టిలైజర్ డీలర్లు గుట్టుచప్పుడు కాకుండా బయట అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ రైతులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. సరిపడినంత యూరియా ఇవ్వడం లేదని వనపర్తి జిల్లా ఆత్మకూరులోని సింగిల్ విండో కార్యాలయం వద్ద అన్నదాతలు నిరసన తెలిపారు. మెదక్ జిల్లా రామాయంపేటలో యూరియా కోసం రైతులు రాస్తారోకో చేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి రైతువేదిక వద్ద టోకెన్ల కోసం గంటపాటు అన్నదాతలు రాస్తారోకో నిర్వహించారు. యూరియా లారీలు వస్తున్నాయనే సమాచారంతో దుబ్బాక పీఏసీఎస్ వద్ద ఆదివారం రాత్రి రైతులు నిద్రించారు. చేర్యాలలో యూరియా కొరతపై అన్నదాతలు ఆందోళన చేపట్టారు. నల్లగొండ జిల్లాలోని. నిడమనూరు, కనగల్ మండలాలకు యూరియా లోడు వస్తుందని చెప్పడంతో రైతులు అధిక సంఖ్యలో సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. యూరియా రాలేదని, పక్క సొసైటీకి పంపించారని తెలియడంతో అన్నదాతలు రహదారిపై బైఠాయించారు. రంగారెడ్డి జిల్లా ఉప్పరిగూడలో ఈ-పాస్ యంత్రం పనిచేయకపోవడంతో రైతులు గంటల తరబడి క్యూలో నిలబడ్డారు.



మెదక్ జిల్లా రామాయంపేటలో యూరియా కోసం గుమిగూడిన రైతులు

బీఆర్ఎస్ ఆందోళనలు..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు యూరియా కొరతపై బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ఆందోళనలు నిర్వహించాయి. ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రాథమిక సహకార సంఘం వద్ద ధర్నా చేపట్టారు. కొత్తగూడెం జిల్లా ఇల్లందులో హరిప్రియా నాయక్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. హవేలీఘనపూర్‌లో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వినాయకుడి విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మహబూబాబాద్‌లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్.. కలెక్టర్ అద్వైత్‌కు వినతిపత్రం అందించారు. మహబూబాబాద్ పీఏసీఎస్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ రైతులతో కలిసి ఆందోళన చేశారు. కురవిలో నిర్వహించిన ధర్నాలో రెడ్యానాయక్ పాల్గొన్నారు.

పదోన్నతులు వద్దు.. ఉన్నచోటే ముద్దు!

» గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా వెళ్లేందుకు 20% మంది విముఖత

» హైదరాబాద్‌లో హెచ్ఆర్ఏ 24 శాతం.. వేరే జిల్లాలకు వెళ్తే 11 శాతమే

» వచ్చే ఇంక్రిమెంట్ కంటే కోల్పోయేదే ఎక్కువని పేర్కొంటున్న టీచర్లు

హైదరాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పదోన్నతులు కల్పించాలంటూ ఉద్యమించే ఉపాధ్యాయులు.. ఇస్తే మాత్రం తీసుకునేందుకు సిద్ధంగా లేరు. దీనికి కారణం..హెచ్ఆర్ఏ తగ్గటం, దూర ప్రాంతాలకు వెళ్లాల్సిరావడం! ఏడాది తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో పదోన్నతుల ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 880 మంది స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టుల్లో ఉన్న వారికి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించారు. ఇందులో మల్టీజోన్-1లో 490, మల్టీజోన్-2లో 390 మంది ఉన్నారు. అయితే జోనల్ స్థాయి నుంచి హెచ్ఎంగా మల్టీజోన్‌కు వెళ్లేందుకు అనేకమంది స్కూల్ అసిస్టెంట్లు సిద్ధంగా లేరు. ముఖ్యంగా మల్టీజోన్-2లోని హైదరాబాద్ జిల్లాలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు ఇదే జిల్లా పరిధిలో వస్తేనే వెళుతున్నారు. ఇతర జిల్లాలకు వెళ్లాలంటే విముఖత చూపిస్తున్నారు. హైదరాబాద్‌లో హెచ్ఆర్ఏ 24శాతం ఉండగా, ఇతర జిల్లాల్లో కేవలం 11శాతంగా ఉంది. పదోన్నతులు వస్తే ఒక ఇంక్రిమెంట్ పెరుగుతుంది. దీంతో వారికి గరిష్ఠంగా కలిగే ఆర్థిక ప్రయోజనం రూ.4 వేలకు మించి ఉండదు. అదే హెచ్ఆర్ఏ తగ్గితే అంతకుమించి నష్టం ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికే సీనియారిటీ జాబితాను ప్రకటించిన పాఠశాల విద్యా శాఖ.. ఒక్కో పోస్టుకు తొలుత ముగ్గురిని ఎంపిక చేసి.. ఒకర్ని ఖరారు చేసింది. కొత్త పోస్టులో చేరేందుకు 15 రోజుల గడువు ఉంటుంది. ఆలోపు చేరకపోతే పదోన్నతిని రద్దు చేస్తారు. దాంతో ఆ ఖాళీ అలాగే ఉండిపోనుంది. రాష్ట్రం మొత్తంలో 880 మందికి గ్రేడ్-2 హెచ్ఎంలుగా పదోన్నతులు ఇవ్వగా.. వారిలో 20శాతం మంది అనాసక్తితో ఉన్నారు. వీరిలో అత్యధికులు హైదరాబాద్ జిల్లా ఉపాధ్యాయులే. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 2,324 స్కూల్ అసిస్టెంట్, 640 ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంల పోస్టులను సీనియారిటీ ఆధారంగా ఎస్జీటీలతో భర్తీ చేస్తున్నారు. ఈ జాబితాను ఇప్పటికే ప్రకటించారు. మంగళవారం ఉత్తర్వులు ఇస్తారు. అయితే పదోన్నతుల్లో దూరప్రాంతాలకు బదిలీ అయినవారిలో అత్యధికులు విముఖత చూపించే అవకాశాలు ఉన్నాయి. ఎస్జీటీగా ప్రాథమిక పాఠశాలలో బోధించి.. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందితే ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు నిపుణుడిగా బోధించాల్సి ఉంటుంది. దీనికి అనేక మంది సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. దీంతో స్కూల్ అసిస్టెంట్, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంల పోస్టులు ఖాళీగా ఉండిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే పదోన్నతుల ఉద్దేశం నెరవేరకపోగా, విద్యా వ్యవస్థ గాడి తప్పనుంది. కొత్త పోస్టులో చేరకపోతే ప్రస్తుత నిబంధనల ప్రకారం మళ్లీ పదోన్నతులు చేపట్టేవరకు ఆ పోస్టు ఖాళీగా ఉండిపోతుంది. ఒక్క పోస్టు కూడా ఖాళీగా మిగలకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, 20శాతం అదనపు ఆప్షన్లు కల్పించాలని పాఠశాల ఉపాధ్యాయుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి విజ్ఞప్తి చేశారు.

ఖైరతాబాద్ గణేశుడి తొలి పూజలకు సీఎం, గవర్నర్!

ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి ఆహ్వానించిన ఉత్సవ కమిటీ..

హైదరాబాద్/ఖైరతాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో విశ్వశాంతి మహాశక్తి గణపతిగా ముస్తాబైన స్వామి వారికి చవితి పండుగ రోజున తొలి పూజలను సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించనున్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సైతం పూజలకు హాజరు కానున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్ నేతృత్వంలో ప్రతినిధులు సీఎంను ఆయన నివాసంలో కలి'ట ఆహ్వాన పత్రికను అందజేశారు. తొలిరోజు పూజలకు హాజరవుతానని సీఎం హామీ ఇచ్చినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ శాసనసభ

- విపక్షాలకూ స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం..
- అఖిల భారత స్పీకర్ల సదస్సులో గడ్డం ప్రసాద్



న్యూఢిల్లీ/వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ శాసనసభను నిర్వహిస్తున్నామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చెప్పారు. అధికార పక్షంతోపాటు ప్రతిపక్షాలకు సైతం స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామన్నారు. సోమవారం ఢిల్లీలో అఖిల భారత స్పీకర్ల సదస్సులో ఆయన ప్రసంగించారు. తొలి శాసన సభాపతిగా విఠల్‌బాయి పటేల్ వారసత్వాన్ని, విలువలను కొనసాగించాల్సిన అవసరముందని చెప్పారు. 'దేశ లేజిస్లేటివ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పేరు.. విఠల్ బాయి పటేల్‌దే.. ఆయన న్యాయవాద వృత్తిలో, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన పాత్ర మరువలేనిది. 1925లో బ్రిటిష్ వలస పాలనలో విఠల్ బాయి సెంట్రల్ లేజిస్లేటివ్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికవడం సాధారణ విషయం కాదు. ఆయన స్పీకర్‌గా ఉన్నప్పుడే 1929లో భగత్‌సింగ్, భటికేశ్వర్ దత్ వలస పాలనను వ్యతిరేకిస్తూ సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు విసిరారు. అప్పుడు కూడా ఆందోళన చెందకుండా ఆయన సమయస్ఫూర్తితో వ్యవహరించారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొనే తెలంగాణ శాసనసభను నడుపుతున్నాం' అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాశ్ కూడా పాల్గొన్నారు.

మద్యం నాణ్యతలో రాజీపడొద్దు: జూపల్లి

హైదరాబాద్/పూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తయారీలో నాణ్యత, నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్ గ్రామంలోని బృందావనం స్పిరిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిస్టిలరీస్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిస్టిలరీస్‌లో ఉత్పత్తి ప్రక్రియ, భద్రతా ప్రమాణాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. హోల్డింగ్ ట్యాంకులు, బ్లెండింగ్ యూనిట్, బాటిల్ ఫిల్లింగ్ ప్లాంట్‌లను పరిశీలించారు. మద్యం ఉత్పత్తి, సరఫరా, లేబులింగ్, ముడిసరుకు వినియోగంపై అధికారులతో చర్చించారు. ప్రజల ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలని, నాణ్యతా ప్రమాణాలలో ఎలాంటి రాజీ పడకూడదని కంపెనీ యాజమాన్యానికి స్పష్టం చేశారు.

టూరిజం హబ్‌గా అనంతగిరి హిల్స్

హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న అనంతగిరి హిల్స్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తామని జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన అనంతగిరి హిల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అనంతగిరి ట్రెక్కింగ్, దైవ దర్శనం, ప్రకృతి ఆస్వాదనకు అనువైనదని చెప్పారు. అనంతగిరిలోని హరిత హోటల్ నిర్వహణను పైలట్ ప్రాజెక్టుగా వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తున్నామని, దీనిని ప్రైవేట్ హోటళ్లకు దీటుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ఆదేశించారు.

ఎన్‌డబ్ల్యూడీఏ పాలకమండలి భేటీ వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న న్యూఢిల్లీలో నిర్వహించతలపెట్టిన జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) 75వ పాలకమండలి సమావేశం వాయిదా పడింది. హైబ్రిడ్(వర్చువల్, ప్రత్యక్ష) విధానంలో ఈ సమావేశం ఉంటుందని ఇదివరకు ఎన్‌డబ్ల్యూడీఏ సమాచారం ఇచ్చింది. అయితే ఆ రోజు వినాయకచవితి పండుగ ఉండటంతో సమావేశాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

నేడు, రేపు భారీ వర్షాలు

రాష్ట్రంలో మంగళ, బుధ వారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరికొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని వెల్లడించింది. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మంచిర్యాల, భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ, ఆ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, వరంగల్, భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

వైద్య అనుబంధ వృత్తుల కౌన్సిల్ చైర్మన్ నియామకమెప్పుడో?

- ఏడాదిగా చైర్మన్ పోస్టు ఖాళీ
- భర్తీ చేయాలని 'ఫోరం' డిమాండ్

: కేంద్ర ప్రభుత్వం 2021 మార్చిలో వైద్య అనుబంధ వృత్తుల జాతీయ కమిషన్ ఏర్పాటు చేసింది. వైద్య రంగంలో పని చేసే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తప్ప మిగతా 57 రకాల వైద్య అనుబంధ వృత్తులను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి జాతీయ కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ చట్టం ప్రకారం ప్రతి రాష్ట్రంలో రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు చేయాలి. కానీ, దేశంలో 11 రాష్ట్రాలు తప్ప అన్ని రాష్ట్రాలు ఏర్పాటు చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం 2022లో చైర్మన్, ముగ్గురు కో-ఆప్షన్ మెంబర్లతో రాష్ట్ర కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. కానీ ఇతర సభ్యులను నియమించలేదు. చైర్మన్‌గా నిమ్స్‌కు చెందిన డా.విజయ్ కుమార్‌ను నియమించగా, ఆయన కాల పరిమితి గతేడాది ముగిసింది. అప్పటి నుంచి చైర్మన్‌ను, ఎక్స్-అఫిషియో సభ్యులను నియమించలేదు. ఈ తరుణంలో చైర్మన్‌తో పాటు ఇతర సభ్యులను నియమించాలని వైద్య అనుబంధ వృత్తుల జాయింట్ ఫోరం, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ సంయుక్తంగా సర్కారును కోరాయి. ఈ మేరకు సోమవారం వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజ నరసింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనాను కలసి వినతిపత్రం ఇచ్చాయి.

అక్రమంగా తరలిస్తున్న 89 మూగజీవాలకు విముక్తి

- కంటైనర్ సీజ్.. యజమానిపై కేసు నమోదు



కంటైనర్ నుంచి గోవులను దింపుతున్న పోలీసులు

గజ్వేల్/గజ్వేల్ రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 89 మూగజీవాలను సిద్దిపేట జిల్లా గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని పాతూరు చౌరస్తా వద్ద అన్నవరం నుంచి వస్తున్న కంటైనర్‌ను తనిఖీ చేయగా 89 మూగజీవాలున్నాయి. అప్పటికే చనిపోయిన ఏడు పశువులకు పోస్టుమార్టం నిర్వహించి, మిగిలిన వాటిని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్ గోశాలకు తరలించారు. కంటైనర్‌కు కర్ణాటకతో పాటు తెలంగాణకు సంబంధించిన నెంబర్ ప్లేట్లు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. కంటైనర్ లారీ ఓనర్, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

యూరియా పాపం కేంద్రానిదే



ప్రతిపక్షాల మాయమాటలు నమ్మొద్దు

రైతులకు మంత్రి తుమ్మల బహిరంగ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడటానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. విపక్షాలు చెప్పే మాయమాటలు, దుష్ప్రచారాన్ని నమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఈ మేరకు రైతులకు బహిరంగ లేఖ రాశారు. కేంద్రం కేటాయింపులు, సరఫరా, స్వదేశీ యూరియా, దిగుమతి చేసుకున్న యూరియా, ప్రస్తుత పరిస్థితులను ఆ లేఖలో వివరించారు. "దేశానికి దిగుమతి అయిన యూరియాలో.. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కేంద్రం 3.94 లక్షల మెట్రిక్ టన్నుల మేర మన రాష్ట్రానికి కేటాయించింది. అందులో 2.10 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలతో ఎర్రసముద్రంలో నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దేశీయ యూరియా ఉత్పత్తి కూడా ఆశించిన స్థాయిలో లేదు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 1,69,325 టన్నులను కేటాయిస్తే.. 1,06,852 టన్నుల మేర సరఫరా జరిగింది. ఇది కూడా యూరియా కొరతకు కారణమే" అని ఆయన వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు 9.80 లక్షల టన్నులు, ఆగస్టు నాటికి 8.30 లక్షల టన్నులను కేటాయించినా.. ఇప్పటికి 5.72 లక్షల టన్నులు రాష్ట్రానికి అందిందని, ఇంకా 2.58 లక్షల టన్నుల యూరియాను సరఫరా చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర బీజేపీ నేతలు వాస్తవాలను గ్రహించి, ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవుపలికారు.

బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు

యూరియా విషయంలో సోషల్‌మీడియాలో బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని బహిరంగ లేఖలో తుమ్మల మండిపడ్డారు. "రైతుల ముసుగులో బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారు. పీఏసీఎస్ కార్యాలయాల వద్ద చెప్పులు క్యూలైన్‌లో పెట్టిస్తున్నారు. మహిళలను క్యూలైన్‌లో నిలబెట్టి, సోషల్ మీడియాలో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. ఈ చర్యలతో శునకానందం పొందుతున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు నానో యూరియా వాడకాన్ని పెంచాలని తుమ్మల కోరారు. "నానో యూరియాతో భూసారం దెబ్బతినదు. తక్కువ ఖర్చుతో రైతులకు మేలు జరుగుతుంది. పర్యావరణహితంగా ఉంటుంది" అని వివరించారు.

ఫాంహౌస్‌లో మానవ మృగాలు

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థుల కోసం రెండు నూతన హాస్టల్ భవనాలు, డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూమ్ నిర్మాణాలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. దీంతోపాటు రూ.80 కోట్లతో కొత్తగా నిర్మించిన దుందుభి, భీమ హాస్టల్ భవనాలను ప్రారంభించారు. అనంతరం వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో సీఎం మాట్లాడారు. ఓయూను ప్రపంచంతో పోటీపడేలా స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీల స్థాయిలో అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేయడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ఓయూను ఒక అద్భుతమైన వర్సిటీగా తీర్చిదిద్దడానికి ఇంజనీరింగ్, విద్యాశాఖ నిపుణలతో కమిటీని నియమించి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.



ఉస్మానియా యూనివర్సిటీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఓయూ..

తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా యూనివర్సిటీ అని సీఎం రేవంత్ అన్నారు. ఓయూ లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదన్నారు. 1948 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఓయూ అని, దేశఖ్యాతిని ప్రపంచానికి చాటిన శివరాజ్ పాటిల్, పీవీ నర్సింహారావు, జైపాల్‌రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జార్జిరెడ్డి ఈ యూనివర్సిటీ నుంచి వచ్చినవారేనని గుర్తు చేశారు. తెలంగాణలో ఏ సమస్య వచ్చినా మొదట చర్చ జరిగేది ఓయూలోనేనన్నారు. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పించే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది, మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీయేనని అన్నారు. యాదయ్య, ఇషాన్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర సాధనలో సమిధలయ్యారని గుర్తు చేశారు.

వీసీల నియమాకంలో సామాజిక న్యాయం..

గతంలో కళకళలాడిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రస్తుతం కళాహీనంగా మారిందని సీఎం రేవంత్ అన్నారు. గత పాలకులు కుట్రపూరితంగా ఓయూను నిర్వీర్యం చేయాలని చూశారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే యూనివర్సిటీకి పూర్వ వైభవం కల్పించాలని నిర్ణయించామన్నారు. "రాష్ట్రంలోని యూనివర్సిటీలన్నింటినీ చదువులకే కాకుండా.. సామాజిక చైతన్య వేదికలుగా మార్చాలన్న ఆలోచనతో నిర్ణయాలు తీసుకున్నాం. ఉస్మానియా వర్సిటీ 108 ఏళ్ల చరిత్రలో దళితుడు వైస్ చాన్స్‌లర్ కాలేదు. ప్రస్తుత వీసీ కుమార్‌లోని నైపుణ్యాన్ని గుర్తించి వీసీగా నియమించాం. మిగతా యూనివర్సిటీలు, విద్యా కమిషన్‌కు అలాగే నియమించాం. సామాజిక న్యాయాన్ని పాటించాం. దేశానికి యువ నాయకత్వం అవసరం. దేశంలో 65 శాతం జనాభా 35 ఏళ్ల లోపువారు. ఇది మన దేశ సంపద. 21 ఏళ్ల వయసులో ఐఏఎస్‌లుగా, ఐపీఎస్‌లుగా దేశానికి సేవలందిస్తున్నప్పుడు.. 21 ఏళ్ల యువకులు శాసనసభలో ఎందుకు అడుగు పెట్టకూడదు? శాసనసభకు పోటీ చేసేందుకు 25 ఏళ్ల వయసు పరిమితిని 21 ఏళ్లకు ఎందుకు తగ్గించకూడదో ఆలోచించాలి" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. యూనివర్సిటీలు చదువులకు మాత్రమే పరిమితం కాకుండా పరిశోధనలకు వేదిక కావాలన్నారు. సైద్ధాంతికపరమైన భిన్నాభిప్రాయాలపై చర్చలు, సాంకేతిక పరమైన చర్చలు జరగాలన్నారు. వర్సిటీలు, విద్యాలయాల్లో సిద్ధాంతపరమైన పోరాటాలు, సామాజిక చైతన్య ఉద్యమాలు లేని కారణంగా చిన్న చిన్న కాలేజీల్లో కూడా విద్యార్థులు గంజాయి లాంటి వ్యసనాల బారిన పడేందుకు దారితీస్తోందని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్య మాత్రమే ఇవ్వగలం..

విద్యార్థులకు తాను ఇవ్వగలిగింది చదువు ఒక్కటేనని, పంచడానికి భూముల్లేవని సీఎం రేవంత్ అన్నారు. "నాడు ఇందిరాగాంధీ ప్రభుత్వం పీవీ సంస్కరణలతో అర్బన్ సీలింగ్ పెట్టి పేదలకు 25 లక్షల ఎకరాల భూములను పంచింది. గిరిజనులకు 10 లక్షల ఎకరాల పోడు భూములను ఇచ్చింది. ప్రస్తుతం పంచడానికి నా దగ్గర భూములు లేవు. అగ్రికల్చర్ సీలింగ్ యాక్ట్ పెట్టి గుంజుకోవడానికీ లేవు. ధనవంతులను చేయడానికి ఖజానా లేదు. మీకు ఇవ్వగలిగింది విద్య ఒక్కటే. చదువే మిమ్మల్ని ధనవంతుల్ని, గుణవంతుల్ని చేస్తుంది. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గం" అని సీఎం రేవంత్ అన్నారు. విద్యా రంగానికి ఈ ఏడాది రూ.40 వేల కోట్లు ఖర్చు పెట్టామని, ఓయూ కోసం వెయ్యి కోట్లు ఖర్చు చేయడానికి ఇబ్బందేమీ లేదని తెలిపారు.

అడ్డుకుంటే అభివృద్ధి ఎలా?

విద్యార్థులు తమకు ఇబ్బంది కలిగించిన వారి పట్ల నిరసన తెలపాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారిని అడ్డుకుంటే అభివృద్ధి ఎలా జరుగుతుందో ఆలోచించుకోవాలని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో ఇంకో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. అధికారం చేపట్టి రెండున్నరేళ్ల కాలం నాటికి లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ప్రైవేటు రంగంలో రూ.వేల కోట్ల పెట్టుబడులు తేవడమే కాకుండా 1.5 లక్షల ఉద్యోగాలనూ కల్పించామని చెప్పారు.

డిసెంబరులో ఆర్ట్స్ కాలేజీ ముందు మీటింగ్..

"డిసెంబరులో ఆర్ట్స్ కాలేజీ ముందు మీటింగ్ పెట్టండి. నేను కూడా వస్తాను. విద్యార్థుల సమస్యలు తీర్చాలనుకుంటున్నాను. నేను ఓయూకు ఎందుకు రావద్దు? మీ సమస్యలు ఏమున్నా చెప్పండి. తీరుస్తాను. ఒక్క పోలీసుకూ పెట్టకండి.. డీజీపీ ఇదే నా ఆదేశం. మళ్లీ యూనివర్సిటీకి వచ్చి నిధులు మంజూరు చేస్తాను. అప్పటికప్పుడు మీకు జీవోలు ఇస్తాను. ఆరోజు ఒక్క పోలీసు కూడా క్యాంపస్‌లో ఉండడు. అప్పుడు విద్యార్థులు నిరసనలు తెలిపినా నేను ఏమీ అనను. నిరసనలు తెలిపే స్వేచ్ఛ ఉంటుంది. విద్యార్థులు అడిగే ప్రతీ ప్రశ్నకు సమాధానం చెప్పే చిత్తశుద్ధి నాకు ఉంది" అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీరేశం, సామేల్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఓయూ వీసీ కుమార్ పాల్గొన్నారు.

ఆంక్షలతో నిరుద్యోగుల నిరసన ఆపలేరు: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): "మోసపూరిత హామీలు, నీ తప్పుడు ప్రచారంపై కడుపుమండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమకేసులు పెడతావా? వారిలో రగులు తున్న నిరసన జ్వాలలను నీ ఆంక్షలతో, చల్లార్చలేరు రేవంత్" అంటూ హరీశ్ రావుహెచ్చరించారు. ఉస్మానియాకు సీఎంవస్తున్న సందర్భంగా విద్యార్థుల ముందస్తుఅరెస్టులు అప్రజాస్వామికమని, వారిని విడుదలచేయాలని సోమవారం ఎక్స్‌వేదికగా ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులపై లాఠీలు ఝళిపించేందుకేనా.. విద్యాశాఖను, హోంశాఖను మీవద్ద పెట్టుకున్నదని సీఎంను ప్రశ్నించారు. ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని రేవంత్‌రెడ్డిని హరీశ్ డిమాండ్ చేశారు.

హ్యామ్‌లో ఎక్కువ ట్రాఫిక్ ఉన్న రోడ్లకే ప్రాధాన్యం

రోడ్ల మరమ్మతులకు 100 కోట్లు అవసరం

హ్యామ్ కింద 4వేల కి.మీ రోడ్ల పునరుద్ధరణ

ఆర్ఆర్ఆర్ బాధితులకు పరిహారం చెల్లించండి

హ్యామ్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)లో ఎక్కువ ట్రాఫిక్ ఉన్న రోడ్లకే ప్రాధాన్యమివ్వాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బీ కేంద్ర కార్యాలయంలో హ్యామ్‌పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 10 కిలోమీటర్ల కంటే ఎక్కువ పొడవు ఉన్న రోడ్లనే ఈ ప్రాజెక్టు కిందకు తీసుకోవాలని సూచించారు. హ్యామ్ కింద చేపట్టే రోడ్లు గ్రామీణ ప్రాంతాలకు అనుసంధాన కారిడార్లుగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై వెనుకబడిన జిల్లాలకు హ్యామ్‌లో మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులకు కొత్తగా భూ సేకరణ అవసరం లేదని, ప్రస్తుతమున్న రోడ్లనే ఒక వరుస నుంచి రెండు వరుసలుగా విస్తరిస్తామని చెప్పారు. దాదాపు 4 వేల కి.మీ రోడ్లను పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల కోసం రూ. 100 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరుతానని తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం భూసేకరణలో భూమి కోల్పోయిన వారికి వెంటనే పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. అలాగే హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రధాన భవనాలను వచ్చే రెండేళ్లలో పూర్తిచేసేలా లక్ష్యం విధించుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

విద్యాభివృద్ధికి ప్రైవేటు సంస్థలు కలిసి రావాలి: భట్టి విక్రమార్క

విద్యా రంగ అభివృద్ధికి ప్రైవేటు సంస్థలు ప్రభుత్వంతో కలిసి రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రైవేటు విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రైవేట్ సంస్థ విద్యా రంగంపై రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడారు. మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా సిలబస్ మారితేనే ప్రయోజనం ఉంటుందన్నారు. రాబోయే 50, 100 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తమ ప్రజా ప్రభుత్వం విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. యవత కోసం ఏర్పాటు చేసిన స్కిల్ యూనివర్సిటీలో పరిశ్రమలకు పనికొచ్చేలా సిలబస్‌ను రూపొందించామని తెలిపారు.కోఠి ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టి రూ.500 కోట్లతో భవన నిర్మాణాలు చేపడుతున్నామని, ఉస్మానియా యూనివర్సిటీలో అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేస్తున్నామని భట్టి వివరించారు.

అడిగినవన్నీ ఇస్తున్నా.. ఆందోళన ఏంటి?

ఒక రోజు అటూ ఇటూగా చేస్తూనే ఉన్నాం కదా?.. ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య దూరానికి కారణమేంటి?

- వెంటనే పరిస్థితిని చక్కదిద్దండి.. భట్టికి సూచించిన సీఎం రేవంత్
- ఉద్యోగ సంఘాలతో భట్టి చర్చలు
- కనీస స్పందన లేకపోవడంతోనే ఉద్యమ కార్యాచరణ: సంఘాల నేతలు



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన బాట పట్టాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'ఉద్యోగులు అడిగినవి ఒక రోజు అటూ ఇటూగా చేస్తూనే ఉన్నాం కదా? అయినా ఆందోళన బాట పట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? దీనికి బాధ్యులు ఎవరు? ఆర్థిక ఇబ్బందుల వల్ల బిల్లుల చెల్లింపులో కొంత జాప్యం జరిగినా.. ఎంతో కొంత మేలు జరుగుతూనే ఉందిగా? ఉద్యోగులతో సమావేశం అయ్యాక డిమాండ్ల అమలు కోసం మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. అధికారుల కమిటీ ఏర్పాటు చేసి నివేదిక తీసుకున్నాం. ఆ నివేదిక వచ్చాక మంత్రిమండలిలో చర్చించి, చేస్తామని చెప్పిన అంశాలు కూడా ఎందుకు పరిష్కరించలేకపోతున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ సహచరుల వద్ద అసంతృప్తి చేసినట్లు సమాచారం. ఉద్యోగుల ఆందోళనలకు బీజేపీ మద్దతు ప్రకటించి, రాజకీయ లబ్ధి పొందాలనే పరిస్థితి ఎలా వచ్చిందనే చర్చ కూడా జరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు 'ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని సంబంధిత మంత్రి, కార్యదర్శిని పదేపదే కలిసి విజ్ఞప్తి చేసినా స్పందన లేదు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని సీఎం ప్రధాన కార్యదర్శిని కోరితే స్పందించడం లేదు. జేఏసీ పెట్టిన 63 డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదు. అందుకే ఈ నెల 19న జేఏసీ సమావేశం ఏర్పాటు చేసి, కార్యాచరణ ప్రకటించాం. ఉమ్మడి పది జిల్లాల్లో బస్సు యాత్రలు చేయాలని నిర్ణయించాం' అని ఉద్యోగ సంఘాల జేఏసీ చెబుతోంది. ఇక ఉద్యోగుల ఆందోళనకు బీజేపీ మద్దతు తెలపడంతో సీఎం రేవంత్ శుక్రవారంరాత్రి భట్టి విక్రమార్కతో సుమారు మూడు గంటలపాటు చర్చించినట్లు తెలిసింది. శనివారం ఉదయం ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమైన భట్టి.. తొలుత వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అడిగినవన్నీ చేస్తున్నా.. ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. కింది స్థాయిలో ఉద్యోగులు సామాజిక మాధ్యమాల ద్వారా సంఘాల నాయకులను అల్లరి చేస్తున్నారని వారు సమాధానమిచ్చినట్లు సమాచారం. దీంతో బీఆర్ఎస్ పాలనలో ఉన్న సమస్యలే మళ్లీ కావాలా? అని భట్టి ఉద్యోగులను ప్రశ్నించగా.. 'అలా వ్యవహరిస్తే మీ ప్రభుత్వానికి కూడా లీడర్లే ఉంటారు తప్ప.. క్యాడర్ ఉండదు' అని జేఏసీ ప్రతినిధులు బదులిచ్చినట్లు తెలిసింది. శనివారం సమావేశం అర్ధంతరంగా ముగియడంతో సోమవారం మరోసారి భట్టి నుంచి పిలుపొచ్చింది. అయితే జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ అందుబాటులో లేకపోవడంతో సమావేశం వాయిదా పడింది. ఉద్యోగులు ఉద్యమ కార్యాచరణను ఆపాలని సీఎం సూచించడంతో మంత్రులు వారిని బుజ్జగించే పనిలో పడ్డారు.

నాయకులను గుర్తుపట్టని కొందరు మంత్రులు

ఉద్యోగుల సమస్యలను వివరించేందుకు వెళుతున్న జేఏసీ నాయకులను కొందరు మంత్రులు గుర్తు పట్టడం లేదని సంఘం నాయకుల్లో చర్చ జరుగుతోంది. రెండు కీలక శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ సీనియర్ మంత్రి వద్దకు వెళ్లగా.. ఆయన మీరంతా ఎవరు? అని ప్రశ్నించారని తెలిసింది. మరో మంత్రి వద్దకు వెళ్లగా ఎప్పుడూ మీ సమస్యలేనా? అంటూ అసహనం వ్యక్తం చేయడంతో సంఘాల నేతలు నివ్వెరపోయారు. కీలక శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న మరో మంత్రి వద్దకు వెళ్లగా.. కనీసం స్పందించలేదని, వారు చెబుతున్న వివరాలను వినే ఆసక్తి చూపలేదని ప్రచారం జరుగుతోంది. మరో మంత్రి ఏ పథకం ఆపి ఉద్యోగులకు నిధులు ఇవ్వాలో చెప్పాలని ప్రశ్నించడంతో 'ఏ పథకం ఆపొద్దు. మా నిధులు మాకు ఇవ్వండి' అని ఉద్యోగ సంఘం ప్రతినిధులు స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లోనే తమ డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణకు దిగాల్సి వచ్చిందని జేఏసీ చెబుతోంది. మరోవైపు 206 సంఘాలు, 15,20,000 మంది ఉద్యోగులు ఉన్న జేఏసీలో విభేదాలు తలెత్తాయనే ప్రచారం కూడా జరుగుతోంది. 20 నెలలుగా సమస్యల పరిష్కారం విషయంలో ఆశించిన పురోగతి లేకపోవడంతో ఉపాధ్యాయ సంఘాలు జేఏసీ నుంచి బయటకు వెళ్లే ప్రతిపాదన చేయడం ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

సమాంతర సమరం!

- ఇటు పార్టీ పరంగా 42% రిజర్వేషన్లు
- అటు సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం
- ఒకేసారి చేపట్టాలని సర్కారు నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై ప్రభుత్వం స్పష్టతకు వచ్చింది. రాజకీయ పోరాటంతో పాటు న్యాయ పోరాటం సైతం చేయాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఈ అంశంపై వేసిన మంత్రుల కమిటీ సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. సాయంత్రం న్యాయ నిపుణుడు, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీనియర్ నేతలు కేశవరావు, వి.హనుమంతరావు, ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఇరవత్రి అనిల్ భేటీ అయ్యారు. కుల గణనపై నిపుణుల కమిటీ చైర్మన్, ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్ బాబు, ఈరావత్రి అనిల్, వినయ్ కుమార్ కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30 లోపు నిర్వహించాలని, అంతకంటే ముందు రిజర్వేషన్లు ఖరారు చేయాలని హైకోర్టు ఆదేశించిన అంశంపై ఇరువురితో చర్చించారు. బీసీలకు రిజర్వేషన్ల అమలు అధికారికంగా చేసే వెసులుబాటు లేకపోతే ఏ విధంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి? పార్టీ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తే ఎలా ఉంటుంది? అనే అంశంపై చర్చించారు. రాష్ట్రపతి, గవర్నర్ కాలయాపనపై సుప్రీంను ఆశ్రయిస్తే? విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మార్చి 17న తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులూ ఐదు నెలలుగా రాష్ట్రపతి వద్దనే పెండింగ్‌లో ఉండటంపై చర్చించారు. రాష్ట్రపతి, గవర్నర్‌ల కాలయాపనపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే ఎలా ఉంటుందని సింఘ్వీతో చర్చించారు. రాష్ట్రాలు పంపిన బిల్లులపైన 90 రోజుల్లోగా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్ బీసీ రిజర్వేషన్ల బిల్లులకూ వర్తిస్తుందా? అనే అంశంపైనే ప్రధానంగా చర్చించారు. సుప్రీంకోర్టుకు వెళితే ఆ కారణం చూపి, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు హైకోర్టును గడువు కోరే అవకాశంపైనా చర్చలు జరిగాయి. సభలో బీసీ బిల్లులపై తీర్మానం పెట్టి ఆమోదించి, దాని ఆధారంగా జీవో తేవొచ్చా అనేదీ చర్చించారు. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో స్థానిక ఎన్నికలపై ముందుకు వెళుతూనే బిల్లుల ఆమోదం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించడం అనేదే ఖాయంగా కనిపిస్తోంది. ఆగస్టు 28 లోగా మంత్రివర్గ ఉపసంఘం ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. 29న మంత్రివర్గ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలి. ఢిల్లీలో సోమవారం సమావేశంతో ఈ అంశంపై ఏం చేయాలన్న దానిపై స్పష్టత వచ్చినట్లు సమాచారం.

కేసీ వేణుగోపాల్‌తో రేవంత్, భట్టి భేటీ

కేసీ వేణుగోపాల్‌తో రేవంత్, భట్టి, ఉత్తమ్, పొంగులేటి, పొన్నం భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, మంత్రివర్గ విస్తరణ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చించారు. మంగళవారం ఉదయమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు బిహార్ వెళ్లనున్నారు. రాహుల్‌గాంధీ ఓటర్ అధికార్ యాత్రలో మంత్రులు పాల్గొంటారు.

ఐదుగురు మెడికోలపై 6 నెలల సస్పెన్షన్

నిజామాబాద్ మెడికల్ కాలేజీ యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ణయం

నిజామాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ మెడికల్ కళాశాలలో జూనియర్ విద్యార్థి రాహుల్‌రెడ్డిని ర్యాగింగ్ చేసిన ఐదుగురు సీనియర్ విద్యార్థులను కళాశాల నుంచి 6 నెలలు సస్పెండ్ చేశారు. సోమవారం జరిగిన యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ తెలిపారు. ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం విద్యార్థి రాహుల్ రెడ్డిని శనివారం సీనియర్లు ర్యాగింగ్ చేసిన ఘటన వెలుగు చూసింది. ఈ ఘటనను విద్యార్థి, ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని యాంటీ ర్యాగింగ్ కమిటీ సమీక్షించింది. ఈ కమిటీ ముందు విద్యార్థి రాహుల్ రెడ్డి తల్లిదండ్రులు హాజరై వాదనలు వినిపించారు.

పతకాలు సాధించిన హోంగార్డులకు ఏడీజీ ప్రశంస



హైదరాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం శాఖ నుంచి పతకాలు అందుకున్న ఇద్దరు హోంగార్డులను ఏడీజీ స్వాతి లక్రా అభినందించారు. తన కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు జొన్నాడ రాజు, గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్న పిసారి సంగంకు కేంద్రం మెరిటోరియస్ సర్వీస్ పతకాలను అందించింది.

చీటింగ్ కేసులో నౌహీరా షేక్ మరోసారి అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : హీరా గ్రూప్ సంస్థల అధినేత్రి నౌహీరా షేక్ మరోసారి అరెస్ట్ అయ్యారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఇంతెజార్‌గంజ్ పోలీసులు నౌహీరా షేక్‌ను అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేసేందుకు వెళ్లిన సమయంలో ఇంతెజార్‌గంజ్ పోలీసులు ఆమెను ఆదివారం అరెస్ట్ చేశారు. బంగారంలో పెట్టుబడుల పేరుతో వరంగల్‌కు చెందిన ఫర్వేజ్, ఎజాజ్, ఎజాజ్ భార్య నుంచి రూ. 33 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2021లో ఇంతెజార్‌గంజ్ పోలీసులు నౌహీరాపై కేసు నమోదు చేశారు. వరంగల్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ)పై ఇంతెజార్‌గంజ్ పోలీసులు నౌహీరాను అరెస్ట్ చేసి నర్సంపేట సబ్‌జైలుకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

జడ్చర్ల, నసురుల్లాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అప్పులు తెచ్చి సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతినడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఈర్లపల్లి తండాకు చెందిన ఇస్లావత్ రవి(40) తన ఎకరన్నర భూమిలో గతేడాది పత్తి పంటను సాగుచేయడానికి, ఇంటి అవసరాల కోసం అప్పులు చేశాడు. వేసిన పత్తి పంట పూర్తిగా దెబ్బతినడంతో చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో సోమవారం పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా నస్రులాబాద్ మండలంలోని నెమలి గ్రామానికి చెందిన రైతు బొబ్బిలి శ్రీనివాస్ (37) సోమవారం తన పొలంలో విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. పొలానికి నీరు పెట్టేందుకు గాను విద్యుత్ బోర్ వద్ద స్విచ్ ఆన్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

షోకాజ్' రద్దుకు రూ.25 వేల లంచం

- రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కిన ఏడీఏ

చుంచుపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్ షాపుకు జారీ చేసిన షోకాజు నోటీసు రద్దు చేయడానికి దాని యజమాని నుంచి రూ.25 వేల లంచం తీసుకుంటూ భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా వ్యవసాయశాఖ సహాయ డైరెక్టర్ (ఏడీఏ) నర్సింహారావు సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. యూరియా అమ్మకాలకు అనుమతుల్లేవని జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఒక ఫెర్టిలైజర్ షాప్ యజమానికి ఆయన ఈ నెల 23న షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు రద్దు చేయడానికి రూ.50 వేలు లంచమడిగిన ఏడీఏకు రూ.25 వేలు ఇవ్వడానికి షాప్ యజమాని ఒప్పందం కుదుర్చుకున్నాడు. తర్వాత ఈ విషయమై ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారి సూచన మేరకు సోమవారం ఏడీఏ కార్యాలయంలోనే నర్సింహారావుకు రూ.25 వేలు ఇస్తుండగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు.. ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

చేవెళ్లలో రోడ్డు ప్రమాదం.. తండ్రీ కూతుళ్ల మృతి

చేవెళ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణంలో సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైకును లారీ వెనుక నుంచి ఢీ కొట్టడంతో బైకుపై వెళ్తున్న తండ్రీకూతుర్లు లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన రైతు తాండ్ర రవీందర్ (32) మొయినాబాద్ మండలంలోని తొల్‌కట్ట గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తన కూతురు తాండ్ర కృప (13)ను పాఠశాల నుంచి తీసుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానికులు లారీ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రీ మోడలింగ్ కార్ల మ్యాట్, సీట్ల కింద 122.85 కిలోల ఎండు గంజాయి స్మగ్లింగ్

- ఇద్దరు నిందితుల అరెస్టు.. 2 కార్లు.. రెండు ఫోన్లు జప్తు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రీ మోడలింగ్ చేసిన కారు ఫ్లోరింగ్ మ్యాట్, సీట్ల కింద 122.85 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మెదక్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ సోమవారం మీడియాకు తెలిపారు. జిల్లాలోని కంది మండలం చేర్యాల గేటు వద్ద 3 రోజుల క్రితం 65వ నంబర్ జాతీయ రహదారిపై చేపట్టిన తనిఖీలో టాటా విస్టా కారులో ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ వ్యక్తి ఇచ్చిన క్లూ ఆధారంగా 3 రోజులుగా ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. చేర్యాల గేటు వద్ద సోమవారం అనుమానాస్పదంగా వస్తున్న టాటా ఇండికా విస్టా డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని కారు తనిఖీ చేయడంతో డిక్కీలో 69.5 కిలోల గంజాయి, కాసేపటికి వచ్చిన మరో టాటా ఇండికా విస్టా కారు నుంచి 53.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని హరికిషన్ తెలిపారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని చాచా మహ్మద్ అనే వ్యక్తి కోసం తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు చెప్పారు. నిందితులు మహారాష్ట్రలోని బీడ్ జిల్లా అత్తర్ నగర్ వాసి అబ్దుల్ వహాబ్, ఒడిశాలోని గజపతి జిల్లా రాయగడలోని సంకురదా వాసి ఉమా కాంత్‌తోపాటు 2 కార్లు, 2 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చాచా మహ్మద్‌నూ నిందితుడిగా పేర్కొన్నట్లు తెలిపారు. ఈ గంజాయి విలువ సుమారు రూ.40 లక్షలుంటుందని హరికిషన్ వెల్లడించారు.

కూతురిని చంపి తల్లి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ముక్కుపచ్చలారని మూడేళ్ల కూతురిని గొంతు నులిమి చంపేసిన తల్లి.. తర్వాత తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన యశోద (36)కు 12 ఏళ్ల క్రితం వివాహమయింది. ఆమెకు ఓ కొడుకు, మూడేళ్ల కూతురు అక్షర ఉన్నారు. తన భర్త నరేశ్ విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ ఏడాది జూలైలో ఇంటి ముందు జీడిపప్పు ఆరబెట్టగా ఓ కుక్క ఎంగిలి చేసింది. కుటుంబ సభ్యులు ఏం కాదులే అనుకుని ఆ జీడిపప్పును వంటకు వాడేశారు. కొద్దిరోజులుగా యశోద ఒంటిపై అలర్జీ ప్రారంభమైంది. తన అలర్జీకి కుక్క ఎంగిలి చేసిన జీడిపప్పే కారణమని రేబిస్ ఇంజక్షన్ కూడా తీసుకున్నది. అయినా అలర్జీ తగ్గకపోవడం, తన మానసిక పరిస్థితి కూడా సరిగా లేకపోవడంతో సోమవారం భర్త బయటకు వెళ్లిన తరువాత కూతురు అక్షరను గొంతు నులిమి చంపేసింది. తరువాత తానూ ఆత్మహత్య చేసుకుంది. చనిపోయే ముందు ఇంట్లో ఉన్న బ్లాక్ బోర్డు, డోర్‌లపై తన భర్త, కొడుకు బాగుండాలని, వాళ్ళు మంచిగా వైద్యం చేయించుకోవాలని రాసింది.

ఏపీ డిప్యూటీ తహసీల్దార్ డ్రగ్స్ దందా!

- కొండాపూర్‌లో డ్రగ్స్‌తో రేవ్‌పార్టీ
- ఈగల్, పోలీసుల దాడి.. ఆరుగురి అరెస్టు
- 20 గ్రా. కొకైన్, 3 గ్రా. ఎండీఎంఏ సీజ్



నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

రాయదుర్గం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి.. కొండాపూర్ సర్వీస్ అపార్టుమెంట్‌లో డ్రగ్స్‌తో రేవ్‌పార్టీ చేసుకుంటున్న ఆరుగురిని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ వింగ్- ఈగల్, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి 20 గ్రాముల కొకైన్, 3 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకోగా.. రాజమండ్రిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసే మణిదీప్ డ్రగ్స్ దందా వెలుగులోకి వచ్చింది. మాదాపూర్ డీసీపీ వినీత్ సోమవారం ఈ వివరాలను వెల్లడించారు. కొండాపూర్‌లోని ఓ సర్వీస్ అపార్టుమెంట్‌లో డ్రగ్స్‌తో రేవ్‌పార్టీ నిర్వహిస్తున్నట్లు ఉప్పందుకున్న ఈగల్, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. తేజ, విక్రమ్, మన్నె నీలిమ, చందన్, పురుషోత్తమ్‌రెడ్డి, భార్గవ్ అనే నిందితులను అరెస్టు చేశారు. వీరికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ఐదుగురికి పాజిటివ్ వచ్చింది. తేజ డ్రగ్స్ సప్లయర్‌గా పనిచేస్తున్నట్లు.. బెంగళూరుకు చెందిన రాహుల్ అనే డ్రగ్స్ పెడ్లర్ పరారీలో ఉన్నట్లు డీసీపీ వివరించారు. తేజకు రాజమండ్రిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసే మణిదీప్ డ్రగ్స్ అలవాటు చేసినట్లు తెలిపారు. "మణిదీప్ 2023 డిసెంబరు 31న గోవాలో పార్టీ నిర్వహించాడు. ఆ పార్టీకి తేజ, నీలిమ వెళ్లారు. అక్కడే వీరు మణిదీప్ ద్వారా కొకైన్ రుచి మరిగారు. మణిదీప్ రాజమండ్రిలోని తన సొంత ఫామ్‌హౌస్‌లో పలుమార్లు డ్రగ్స్ పార్టీలునిర్వహించాడు. ఆ తర్వాత మణిదీప్ డ్రగ్స్ పార్టీలకు తేజ సప్లయర్‌గా మారాడు. రాహుల్ ద్వారా డ్రగ్స్ తెప్పించుకునేవాడు. తేజ, నీలిమ, విక్రమ్ ముగ్గురూ స్నేహితులు. వీరంతా రాజమండ్రికి చెందినవారు. కొండాపూర్‌లోని ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. తరచూ కొకైన్ పార్టీలు చేసుకునేవారు" అని డీసీపీ వివరించారు. తేజ డ్రగ్స్‌తోపాటు.. బాడీబిల్డింగ్ కోసం గ్లుటాహిన్ విటమిన్ ఇంజక్షన్‌ను వాడుతుంటాడని, దాని మాటున రాహుల్ ద్వారా కొరియర్‌లో కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్‌ని తెప్పించేవాడని పేర్కొన్నారు. తాజాగా అరెస్టయిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు విక్రమ్‌తో ఇటీవల సంచలనం సృష్టించిన మల్నాడు కిచెన్ నిందితుడు సూర్యకు స్నేహం ఉన్నట్లు గుర్తించామని డీసీపీ వెల్లడించారు. సూర్య నెట్‌వర్క్‌తో తాజాగా పట్టుబడ్డ ముఠాకు లింకులున్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. తాజా కేసుతో డీటీ మణిదీప్‌కు సంబంధం లేకున్నా.. అతడిని విచారిస్తే డ్రగ్స్ నెట్‌వర్క్ వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయన్నారు.

పెంచిన తల్లిదండ్రులకే ఆ పిల్లల్ని ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. ఈమేరకు ఆగస్టు 12న తాము ఇచ్చిన తీర్పును పాటించకపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణకు పాల్పడిన అధికారులు తదుపరి విచారణ జరిగే సెప్టెంబర్ 2న వర్చువల్‌గా తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. గత ఏడాది మే నెలలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక రిపోర్టర్ చేసిన స్టింగ్ ఆపరేషన్‌తో పిల్లల అక్రమ రవాణా, విక్రయం వ్యవహారం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. మహిళా ఆర్‌ఎంపీ వైద్యురాలి నేతృత్వంలో జరుగుతున్న తతంగంపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో ఆ ఆర్‌ఎంపీ మొత్తం 16 మంది చిన్నారులు (నలుగురు మగ, 12 మంది ఆడపిల్లల్ని) అమ్మినట్లు గుర్తించారు. ఈ కేసులో 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారు ఇచ్చిన సమాచారం ప్రకారం.. ఆ 16 మంది చిన్నారుల్లో ఏడుగురిని అమ్మకం దశలోనే పట్టుకోగా, మరో తొమ్మిది మంది పసిపాపలను అప్పటికే అక్రమ రవాణా ముఠాకు విక్రయించేశారు. ఆ తొమ్మిది మంది చిన్నారులను కొనుగోలు చేసినవారి ఆచూకీ గుర్తించి వారి నుంచి చిన్నారులను తీసుకొని రాష్ట్ర మాతా, శిశు సంక్షేమ శాఖకు అప్పగించారు. వీరిని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(కారా) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దత్తత ప్రక్రియలో పెట్టింది.



వీరిలో అమ్మకం దశలో దొరికిన ఆరుగురు చిన్నారులను కొందరు తల్లిదండ్రులు దత్తత తీసుకున్నారు. అలాగే.. మిగిలిన తొమ్మిది మంది చిన్నారులను కూడా పిల్లలు లేని కొందరు తల్లిదండ్రులు ఎంపిక చేసుకున్నారు. తమ పిల్లల్ని తమకే ఇవ్వాలంటూ వారిని అప్పటిదాకా పెంచిన (దత్తత తీసుకున్న) తొమ్మిది మంది తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించగా... సింగిల్ బెంచ్ వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో.. ఆ పిల్లలను ఎంపిక చేసుకున్న తల్లిదండ్రులు వారిని తీసుకెళ్లడానికి ఒక్క పూట ముందు.. తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దీనిని సవాల్ చేస్తూ.. రాష్ట్ర శిశు సంక్షేమ విభాగం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఆ అప్పీల్‌పై వాదనలు విన్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వానికి సానుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో.. ఆ పిల్లలను పెంచిన తల్లిదండ్రుల్లో దాసరి అనిల్ కుమార్ కుటుంబంతో పాటు మరో ముగ్గురు దంపతులు ఆ తీర్పును సవాల్ చేస్తూ.. ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం తమ వాదన విన్నాకే ఉత్తర్వులు ఇవ్వాలని కేవియట్ వేసింది. ఈ పిటిషన్లపై సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం.. కొనుగోలు చేసిన తల్లిదండ్రులకే పిల్లల్ని ఇవ్వాలని ఈ నెల 12న తుది తీర్పు ఇచ్చింది. 14వ తేదీకల్లా వారిని తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశించింది. ఈ తీర్పును సమీక్షించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ చేసింది. దీంతో.. 14వ తేదీకల్లా పిల్లలను తమకు అప్పగించాలన్న కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని ఆ పిల్లలను పెంచిన తల్లిదండ్రులు 18న సుప్రీంకోర్టులో ధిక్కరణ పిటిషన్ వేశారు. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆ పిటిషన్‌ను విచారించింది. గతంలో ఇచ్చిన తీర్పును రాష్ట్రప్రభుత్వం అమలు చేయకపోవడంపై జస్టిస్ నాగరత్న ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సుప్రీంకోర్టు ఆదేశాలనే పాటించకపోతే ఎలా?' అంటూ అసహనం వ్యక్తం చేశారు. తమ వద్దకు వచ్చిన నలుగురు దంపతులకూ.. వారి పెంచుకున్న పిల్లలను మంగళవారం ఉదయం 11 గంటలలోపు ఇవ్వాలని ఆదేశించారు. మిగిలిన ఐదుగురికి సంబంధించిన కేసు ఈ నెల 28న రాష్ట్ర హైకోర్టు ముందుకు రానుంది.

చైనాకు తరలించినా.. తిరిగి రాబట్టారు!

- మాట్రిమోనిలో పరిచయం.. అధిక లాభాల పేరిట మోసం
- క్రిప్టో కరెన్సీ రికవరీ చేసిన సీఎస్‌బీ

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో లాభాల వస్తాయని బాధితుడి నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసిన కేసు దర్యాప్తులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) రికార్డు సృష్టించింది. తెలంగాణలోని మంచిర్యాల జిల్లాకు చెందిన బాధితుడి నుంచి చైనాకు తరలి వెళ్లిన నిధుల్ని తిరిగి రాబట్టింది. చైనా దేశస్తుడి ఖాతాలో ఉన్న క్రిప్టో కరెన్సీ 2,703 యూఎస్‌డీటీలను (భారత కరెన్సీలో సుమారు రూ. 2.38 లక్షలు) రికవరీ చేసింది. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రముఖ మాట్రిమోనిలో తన వివరాలు నమోదు చేశాడు. నందితా రెడ్డి అనే పేరుతో ఒక ప్రొఫైల్ రిక్వెస్ట్ రావడంతో వాట్సాప్ నంబరుతో పరిచయం పెంచుకున్నారు. నందితా రెడ్డి తనను తాను క్రిప్టో కరెన్సీ నిపుణురాలిగా చెప్పడంతో ఆమె మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో సుమారు రూ. 87 లక్షలకుపైగా పెట్టుబడులు పెట్టాడు. రూ.6 కోట్లు లాభం వచ్చినట్లు చూపిస్తున్నా... విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడం, నందితా రెడ్డి నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిధులు చైనా దేశస్తుడు జియాంగ్ చువాష్వువాస్ ఖాతాకు బదిలీ అయినట్లు గుర్తించిన పోలీసులు అతని క్రిప్టో ఖాతాలో ఉన్న మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు. ఈ తరహా క్రిప్టో కరెన్సీ ఫ్రీజ్ చేయడం ఇదే మొదటిసారి అని సీఎస్‌బీ పోలీసులు తెలిపారు. కాగా, రాయ్‌పూర్ కేంద్రంగా సాగుతున్న మిస్టర్ మింట్ క్రిప్టో సంస్థ డైరెక్టర్లు ప్రమోద్ సాహు, రాహుల్ బధారియో అరెస్ట్‌తో ఆ సంస్థలో పెట్టుబడులు పెట్టిన తెలుగు రాష్ట్రాలకు చెందినవారు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కనుంచి 2,500 మంది 3 వేల కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం.

ఏపీ హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులు

కేంద్రానికి సుప్రీం కొలీజియం సిఫారసు

అమరావతి/న్యూఢిల్లీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులు రానున్నారు. దేశవ్యాప్తంగా 14 మంది హైకోర్టు న్యాయమూర్తుల బదిలీకి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలో సోమవారం భేటీ అయిన కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. గుజరాత్ హైకోర్టు నుంచి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ దోనాది రమేశ్, కోల్‌కతా హైకోర్టు నుంచి జస్టిస్ శుభేందు సమంతను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం సిఫారసు చేసింది. వీరి బదిలీకి సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. కాగా, వీరిలో జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ డి. రమేశ్‌లు గతంలో ఏపీ హైకోర్టులో న్యాయమూర్తులుగా సేవలందించారు. వీరిద్దరూ తెలుగు వారు కావడం విశేషం.

జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్.. స్వగ్రామం విజయనగరం జిల్లా, పార్వతీపురం కాగా, జస్టిస్ డి. రమేశ్.. స్వగ్రామం చిత్తూరు జిల్లా, మదనపల్లిలోని కమ్మపలి. జస్టిస్ శుభేందు సమంత పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు.



జూబ్లీహిల్స్‌లో 100 కోట్ల విలువైన స్థలం స్వాధీనం!

- ప్రజావసరాల స్థలంలో నర్సరీ.. నిర్మాణాలు
- హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి హైడ్రా
- 2 దశాబ్దాలుగా ఉన్న ఆక్రమణల తొలగింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహానగరంలోని మరో విలువైన స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి హైడ్రా కాపాడింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు సమీపంలో.. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న 2వేల చదరపు గజాల స్థలంలో ఆక్రమణలను సోమవారం తొలగించింది. ఈ స్థలం విలువ దాదాపు రూ.100 కోట్ల వరకు ఉంటుందని సంస్థ చెబుతోంది. జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన 2000 చదరపు గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. పిల్లా సత్యనారాయణ అనే వ్యక్తి ఈ స్థలానికి నకిలీ ఇంటి నంబరుతో నర్సరీ నిర్వహిస్తున్నాడు. ఆయనపై గతంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. స్థలాన్ని పలుమార్లు జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా.. సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించాడు. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించి స్టేటస్ కో తెచ్చుకున్నాడు. కోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తూ అక్కడ నర్సరీ నిర్వర్తిస్తున్నాడు. అనుమతి లేకుండా షెడ్లు నిర్మించాడు. దీనిపై ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదులందాయి. దీంతో రంగంలోకి దిగిన అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ప్రజావసరాలకు కేటాయించిన స్థలంలో నర్సరీ నడుపుతున్న సత్యనారాయణకు హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో మరోసారి సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించగా అక్కడ ఆయనకు చుక్కెదురైంది. గతంలో ఉన్న స్టేటస్‌కోను కొట్టేసిన న్యాయస్థానం.. చర్యలు తీసుకునేందుకు హైడ్రాకు అనుమతినిచ్చింది. దీంతో రెండు దశాబ్దాలుగా అక్రమార్కుల చేతిలో చిక్కిన స్థలాన్ని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాత్కాలిక నిర్మాణాలు, నర్సరీని తొలగించారు. హైడ్రా కాపాడిన స్థలమంటూ బోర్డులూ ఏర్పాటు చేశారు. హైడ్రా చర్యలపై జూబ్లీహిల్స్ కో ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. రూ.100 కోట్ల విలువైన స్థలాన్ని కాపాడినందుకు ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల మాదాపూర్‌లో రూ.400 కోట్ల విలువైన 16 వేల చదరపు గజాల స్థలాన్ని హైడ్రా పరిరక్షించిన విషయం విదితమే.

ప్రభాకర్‌రావు విచారణకు సహకరించడం లేదు

ఎలక్ట్రానిక్ పరికరాలను ఫార్మాట్ చేశారు.. ప్రభుత్వ ల్యాప్‌టాప్‌లో డాటాను తుడిచేశారు

- సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదనలు
- తదుపరి విచారణ వచ్చేనెల 22కు వాయిదా
- ప్రభాకర్‌రావు విచారణకు సహకరించాల్సిందే
- ఆదేశించిన సుప్రీంకోర్టు ధర్మాసనం



న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్‌ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు విచారణకు సహకరించడం లేదని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఫోన్ ట్యాపింగ్‌లో కీలకమైన ప్రభుత్వ ల్యాప్‌టాప్‌లో డాటాను డిలీట్ చేశారని, ఎలక్ట్రానిక్ పరికరాలను ఫార్మాట్ చేశారని సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించింది. బీఆర్‌ఎస్ హయాంలో ఎస్‌ఐబీ కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు 2023 మార్చి 10న పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే..! ఈ కేసులో ప్రభాకర్‌రావు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. కేసు నమోదవ్వగానే క్యాన్సర్ చికిత్స పేరుతో అమెరికా వెళ్లిన ప్రభాకర్‌రావు.. ముందస్తు బెయిల్ ఇస్తేనే భారత్‌కు తిరిగి వస్తానని హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు తిరస్కరించడంతో.. ఆ తీర్పును మే 9న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పించడంతో.. ప్రభాకర్‌రావు భారత్‌కు తిరిగి వచ్చారు. సుప్రీంకోర్టులో ఆయన పిటిషన్ సోమవారం మరోమారు విచారణకు వచ్చింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్రశర్మ ధర్మాసనం ఎదుట తొలుత.. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదనలను వినిపించారు. "సిట్ విచారణకు ప్రభాకర్‌రావు అన్ని విధాలా సహకరిస్తున్నారు. ఇప్పటి వరకు పదిసార్లు విచారణకు హాజరయ్యారు. దర్యాప్తు అధికారులు ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు" అని ధర్మాసనానికి వివరించారు. ఈ వాదనలపై తెలంగాణ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా అభ్యంతరం తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, స్టేటస్ రిపోర్టులో వివరాలన్నీ స్పష్టంగా పొందుపరిచారమని చెప్పారు. ఆన్‌లైన్‌లో వాదనలను వినిపించిన లూథ్రా.. ఉద్దేశపూర్వకంగానే ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన పరికరాలను ధ్వంసం చేశారని వివరించారు. ఈ క్రమంలో కల్పించుకున్న జస్టిస్ బీవీ నాగరత్న.. "ప్రస్తుతం ప్రభాకర్‌రావు విచారణకు సహకరిస్తున్నారు కదా? తదుపరి విచారణను సెప్టెంబరు 22కు వాయిదా వేస్తున్నాం" అని స్పష్టం చేశారు. దాంతో.. సిద్దార్థ్‌లూథ్రా మాట్లాడుతూ.. ఒక్కసారి స్టేటస్ రిపోర్టును చూడాలని ధర్మాసనాన్ని కోరారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కలుగజేసుకుంటూ.. సాక్ష్యాలను ధ్వంసం చేయడాన్ని తీవ్రమైన అంశంగా పరిగణించాలని కోరారు. దీనిపై జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. డిలీట్ చేసిన డాటాను రిట్రీవ్ చేసే సాంకేతికత మన వద్ద ఉంది కదా? అని ప్రశ్నించారు. అదే ప్రయత్నంలో దర్యాప్తు అధికారులు ఉన్నారని తుషార్ మెహతా సమాధానం ఇచ్చారు. దీంతో.. విచారణను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన ధర్మాసనం.. విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్‌రావును ఆదేశించింది. దర్యాప్తు అధికారులు ఎప్పుడు పిలిచినా.. విచారణకు హాజరవ్వాలని సూచించింది.

దొరకని తల.. కనిపించని కాళ్లు చేతులు

- 5 నెలల గర్భిణి స్వాతి శరీరభాగాల కోసం విస్తృతంగా గాలిస్తున్న డీఆర్‌ఎఫ్ బృందాలు
- రెండు రోజులుగా తగ్గని వరద నీటి ప్రవాహం
- జైల్లో మౌనంగా ఉన్న ఆమె భర్త మహేందర్
- అంత్యక్రియలపై కామారెడ్డిగూడలో ఉద్రిక్తత



మహేందర్‌రెడ్డి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న స్వాతి కుటుంబ సభ్యులు

హైదరాబాద్ సిటీ, వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 5 నెలల గర్భిణీ స్వాతి హత్య కేసులో మేడిపల్లి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నెల 23న స్వాతిని హత్య చేసిన ఆమె భర్త మహేందర్‌రెడ్డి.. ఆమె శవాన్ని ముక్కలు చేసి తల, కాళ్లు, చేతులను మూసీలో పడేసిన సంగతి తెలిసిందే. అతణ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. స్వాతి శరీరభాగాల కోసం మూసీలో వలలు, గేలాలతో విస్తృతంగా గాలిస్తున్నారు. కానీ, వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రెండు రోజులుగా గాలిస్తున్నా ఫలితం లేకపోయింది. వరద ప్రవాహం తగ్గితే ఎక్కడో ఒక చోట శరీరభాగాలను పెట్టిన ప్లాస్టిక్ కవర్ గానీ, హంతకుడు విసిరేసిన బ్యాగు కానీ దొరుకుతుందని భావిస్తున్నారు. ఒకవేళ మృతురాలి శరీర భాగాలు దొరక్కపోతే ఏం చేయాలి? అనే దానిపై ఉన్నతాధికారులు, న్యాయనిపుణుల సలహా తీసుకుంటామని పోలీసులు తెలిపారు. మరోవైపు.. ఇంట్లో మిగిలిపోయిన స్వాతి మొండేన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమె మొండేనికి ఆదివారమే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఆ మొండేన్ని తీసుకోవడానికి స్వాతి తల్లిదండ్రులు, అత్తింటివారు నిరాకరించడంతో గాంధీలోనే భద్రపరిచారు. సోమవారం మరోసారి వారితో మాట్లాడగా.. తొలుత ఇద్దరూ తమకు వద్దన్నారు. ఇదే విషయాన్ని లేఖ రూపంలో రాసిస్తే ఆమె మొండేన్ని మునిసిపాలిటీ వారికి అప్పగిస్తామని చెప్పడంతో.. స్వాతి తల్లిదండ్రులు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. భార్యను ఇంత దారుణంగా చంపి శరీరభాగాలను మూసీలో పడేసిన మహేందర్ రెడ్డిని మరింత లోతుగా విచారించడానికిగాను అతణ్ని తమ కస్టడీకి ఇవ్వాలని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసినట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు. కాగా.. చర్లపల్లి జైల్లో రిమాండ్‌లో ఉన్న మహేందర్ రెడ్డిని సోమవారం ఉదయం జైలు సూపరింటెండెంట్ పిలిచి.. 'ఏం నేరం?' చేశావు అని ప్రశ్నించగా.. అతడు మౌనంగా ఉన్నట్లు తెలిసింది. జైలర్ మరోసారి గట్టిగా అడగడంతో 'భార్యను హత్య చేశాను' అని సమాధానం చెప్పినట్లు సమాచారం.

అంత్యక్రియలపై ఉద్రిక్తత

స్వాతి కుటుంబ సభ్యులు సోమవారం.. వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడలో హంతకుడి ఇంటి ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని.. హంతకుడి కుటుంబ సభ్యులే అంత్యక్రియలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరువర్గాలకు సంబంధించిన పెద్దలు సుదీర్ఘంగా చర్చించారు. చివరకు అంత్యక్రియలను స్వాతి కుటుంబ సభ్యులే జరుపుకొంటామని తెలపడంతో ఆందోళన సద్దుమణిగింది. కాగా.. హంతకుడి నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని మృతురాలి సోదరి శ్వేత విలపించింది. తన అక్కను చంపినట్లుగానే తమ అమ్మనాన్నను సైతం మహేందర్‌రెడ్డి చంపుతాడని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. మహేందర్ రెడ్డికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.